


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



**రాష్ట్రానికి దుష్టశక్తిలా వైసీపీ: నిమ్మల**

- వివరాలు 10 లో..

## ఘోర దుర్ఘటన!

- బాణసంచా పరిశ్రమలో భారీ విస్ఫోటం
- పేలుళ్లలో 20మంది మృత్యువాత
- 13మందికి గాయాలు.. పలువురి పరిస్థితి విషమం
- తీవ్ర దిగ్భ్రాంతికి గురైన ముఖ్యమంత్రి చంద్రబాబు
- సహాయక చర్యలకు తక్షణ ఆదేశాలు..
- దురదృష్టకర ఘటనపై పవన్, లోకేష్ విచారం

3



బాణసంచా ప్రమాదంలో మృతిచెందినవారి కుటుంబాలను కాకినాడ జీజీహెచ్‌లో పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

## పరిహారం రూ.20 లక్షలు

- బాధిత కుటుంబాలకు సాయం ప్రకటించిన ప్రభుత్వం
- కేంద్రం తరపున ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షలు
- విస్ఫోటం బాధితులను చూసి చలించిపోయిన ముఖ్యమంత్రి
- కాకినాడ జీజీహెచ్‌లో క్షతగాత్రులకు పరామర్శ
- బాధిత కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటామని హామీ
- ఆర్డీవో సహా నలుగురు అధికారుల సస్పెన్షన్
- ఘటనకు బాధ్యులను ప్రాసిక్యూట్ చేస్తామని హెచ్చరిక

2

*వేట్లపాలెంలో బాణాసంచా పేలుడు ఘటనలో మరణాలు సంభవించడం అత్యంత బాధాకరమని సీఎం చంద్రబాబు విచారం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.*

### ప్రధాని మోదీ దిగ్భ్రాంతి



*కాకినాడ జిల్లా వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటన బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడినవారికి రూ.50,000 పరిహారం ప్రకటించారు. ఈమేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.*







చీపురుపల్లి నియోజకవర్గం రావివలసలో నిర్వహించిన ప్రజావేదిక సభనుంచి మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు.

## ప్రజారోగ్యానికి కొత్త ఊపిరి

*రాష్ట్రంలో ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. కాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ సహా అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. భవిష్యత్తులో కాన్సర్ సోకకుండా 15 ఏళ్లలోపు బాలికలంతా విధిగా హెచ్‌పీవీ టీకాలు వేయించుకోవాలని పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం రావివలసలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్, పేదల సేవల కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. అనంతరం ప్రజా వేదిక సభకు హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.*



- సంక్షేమం.. సుపరిపాలనకు తొలి ప్రాధాన్యం
- కర్నూలులో స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు
- మూడేళ్లలో ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి
- గత ప్రభుత్వ పాలనలో ప్రజలకే కాదు, దేవుడికీ ద్రోహం
- చీపురుపల్లి ప్రజా వేదిక సభలో సీఎం చంద్రబాబు

4



6

## ఎకనామిక్ హబ్‌గా ఉత్తరాంధ్ర

- పారిశ్రామికాభివృద్ధిలో బ్లూ జెట్ ఓ మైలురాయి
- పరిశ్రమల గ్రౌండింగ్‌కు ప్రభుత్వ ప్రాధాన్యత
- బ్లూజెట్ ద్వారా రూ.2,300 కోట్ల పెట్టుబడులు..
- 2వేల మందికి ఉద్యోగావకాశాలు
- ప్రముఖ ఔషధ తయారీ రాష్ట్రాలలో ఒకటిగా ఏపీ
- విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటన
- రాంబిల్లిలో హెల్త్ కేర్ యూనిట్‌కు శంకుస్థాపన

**విశాఖ పార్టీ కార్యాలయంలో మంత్రి లోకేష్ 82వ ప్రజాదర్బార్**

7



7

### ఘనంగా ఏయూ శతాబ్ది

పూర్వవైభవానికి ఉత్సవాలే వేదిక కావాలి

అధికారులతో సమీక్షలో లోకేష్ ఆదేశం

## రూ.5,456.26 కోట్లతో టీటీడీ బడ్జెట్‌కు ఆమోదం

- "శ్రీవారి ముడుపుల పత్రం పథకం" ప్రారంభం
- విద్య, భద్రత, భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యం
- రూ.120 కోట్లతో అత్యాధునిక వంటశాల
- పరిపాలనా భవనంలో కమాండ్ కంట్రోల్ సెంటర్
- టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడి



8

# పరిహారం రూ.20 లక్షలు

- పేలుడు ఘటనలో ప్రాణనష్టం దురదృష్టకరం
- బాధితులకు అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుంది
- నిర్లక్ష్యం వహించిన నలుగురు అధికారుల సస్పెన్షన్
- ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు- ఆస్తుల జప్తు
- వేట్లపాలెం పేలుడు ఘటనపై సీఎం చంద్రబాబు
- మృతులు, క్షతగాత్రుల కుటుంబాలకు పరామర్శ
- విజయనగరంనుంచి నేరుగా ఘటనా స్థలికి చేరిన సీఎం



కాకినాడ జిల్లా, వేట్లపాలెం (చైతన్య రథం): కాకినాడ జిల్లా వేట్లపాలెంలో బాణాసంచా పేలుడు ఘటనలో మరణాలు సంభవించడం అత్యంత బాధాకరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో బాధితులకు.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు. మృతి చెందిన బాధిత కుటుంబానికి రూ.20 లక్షలమేర ఎక్స్‌గ్రేషియాను రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం చంద్రబాబు ప్రకటించారు. క్షతగాత్రులకూ ఎక్స్‌గ్రేషియా ఇస్తామని వెల్లడించారు. ఘటనకు కారకులైన నలుగురు స్థానిక అధికారులను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతంకాకుండా ఉండేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. శనివారం విజయనగరం పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. ప్రమాదం ఘటన గురించి తెలియగానే జిల్లా అధికారులతో, వివిధ శాఖలకు చెందిన మంత్రులతో మాట్లాడారు. ప్రమాదం జరగడానికి గల కారణాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సాయం అందించాలని సీఎం ఆదేశించారు. అనంతరం నేరుగా కాకినాడ జిల్లా వేట్లపాలెం చేరుకున్నారు. హెలీప్యాడ్ నుంచి సంఘటనా స్థలానికి జిల్లా కలెక్టర్ కారులోనే ముఖ్యమంత్రి ప్రయాణించారు. బాణాసంచా పేలుడు జరిగిన ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును జిల్లా కలెక్టర్, ఎస్పీలు ముఖ్యమంత్రికి వివరించారు. ఘటన జరిగిన స్థలంలోనే సుమారు అరగంటపాటు అధికారులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. జిల్లా కలెక్టర్ కారులోనే సామర్లకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న బాధిత కుటుంబాలను సీఎం చంద్రబాబు పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కలెక్టర్, ఎస్పీ, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి కాకినాడ జీజీహెచ్‌కు చేరుకున్నారు. అక్కడ చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సీఎం చంద్రబాబు పరామర్శించి... వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ..."బాణసంచా ఘటన చాలా దురదృష్టకరం. విచారకర ఘటన. ఇప్పటివరకు 20మంది చనిపోయారు. 9మంది పరిస్థితి విషమంగా ఉంది. ఇద్దరు సురక్షితంగా ప్రమాదంనుంచి బయటపడ్డారు. మృతుల్లో 12 మంది ఎస్సీలు, 9మంది మహిళలు ఉన్నారు. కూలీపని కోసం...పూట గడవడం కోసం బాణాసంచా తయారీ పనికి వెళ్లారు. ప్రభుత్వపరంగా మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తాం. కేంద్రం రూ.2 లక్షలు ప్రకటించింది. తీవ్రంగా గాయపడిన వారినీ ఆదుకుంటాం. చిన్న పిల్లలు ఉండి, చదువుకునే వారిని రెసిడెన్షియల్ స్కూళ్లలో చేర్పిస్తాం. ఇళ్లులేని వారికి ఇళ్లు నిర్మిస్తాం. చనిపోయిన వారిని తీసుకురాలేము. కానీ వారి కుటుంబాలను అండగా నిలబడతాం. మృతిచెందినవారి ఆత్మశాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా" అని సీఎం సంతాపం వ్యక్తం చేశారు.

## నలుగురు ఆఫీసర్ల సస్పెన్షన్... బాధ్యులను ఫిక్స్ చేస్తాం

"జరిగిన ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుంది. కొద్దిరోజుల క్రితమే ఒక సంఘటన జరిగింది.. దాని తర్వాత ఇది రెండో ఘటన. రాబోయే రోజుల్లో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం. ఈ ఘటనపై విచారణ చేసి బాధ్యులను ఫిక్స్ చేస్తాం. ఆర్డీఓ, డీఎస్పీ, జిల్లా లేబర్ ఆఫీసర్, ఫైర్ ఆఫీసర్లను తక్షణం సస్పెండ్ చేస్తున్నాం. విచారణ అనంతరం సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటాం. కొందరు విచ్చల విడితనానికి అలవాటుపడి ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారు. వారిని అరెస్టు చేయడంతోపాటు ప్రాసిక్యూట్ చేస్తాం. వాళ్ల ఆస్తులు కూడా జప్తు చేసి బాధితులకు అప్పగిస్తాం. బాణసంచా తయారీ పరిశ్రమకు అనుమతులు వచ్చాక మనుషులను నియమించుకున్నారు తప్ప.. భద్రతా చర్యలు తీసుకోలేదు. పేలుడు పదార్థాలు ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోలేదు. ఎన్ని బాణసంచా కేంద్రాలున్నాయో సమాచారం తీసుకుంటాం. ఉన్న ప్రొసీజర్స్ కూడా సరిపోవడం లేదు. సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూములకు అనుసంధానిస్తాం. బాణసంచా కేంద్రాలకు అనుమతులు కఠినతరం చేస్తాం" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు వెంట హోంమంత్రి అనిత, ఎంపీలు ఉదయ్ శ్రీనివాస్, సానా సతీష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, స్థానిక ప్రజా ప్రతినిధులు ఉన్నారు.













# ఘోర దుర్ఘటన!



- బాణసంచా పరిశ్రమలో భారీ విస్ఫోటం
- పేలుళ్లలో 21మంది మృత్యువాత
- 13మందికి గాయాలు.. పలువురి పరిస్థితి విషమం
- తీవ్ర దిగ్భ్రాంతికి గురైన ముఖ్యమంత్రి చంద్రబాబు
- సహాయక చర్యలకు తక్షణ ఆదేశాలు..
- సంఘటనా ప్రాంతానికి వెళ్లాలంటూ మంత్రులకు ఆదేశాలు
- దురదృష్టకర ఘటనపై పవన్, లోకేష్ విచారం



సామర్లకోట గ్రామీణం (చైతన్య రథం): కాకినాడ జిల్లాలోని సామర్లకోట మండలంలోని బాణసంచా తయారీ పరిశ్రమలో భారీ పేలుడు సంభవించింది. మండలంలోని వేట్లపాలెం పరిధి గోదావరి కెనాల్ పక్కన ఉన్న సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ కేంద్రంలో శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఘటనలో 21మంది ప్రాణాలు కోల్పోయారు. భారీఎత్తున మంటలు ఎగసిపడడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలముకుంది. పేలుడు శబ్దాలు సుమారు 5 కిలోమీటర్లమేర వినిపించాయని స్థానికులు చెప్పారు. శబ్దం తీవ్రతకు పక్క గ్రామంలోని ప్రైవేటు పాఠశాలలో శ్లాబుకు పగుళ్లుపడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది 2 ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదం జరిగిన సమయంలో మొత్తం 34మంది ఆ ప్రదేశంలో పనిచేస్తున్నారు. వీరిలో 21మంది మృతిచెందగా 13మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో 9మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. మృతుల్లో ఎక్కువమంది మహిళలే ఉన్నట్టు సమాచారం. బాణసంచా పరిశ్రమను అడపా నాని కుటుంబీకులు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. పరిమితికిమించి బాణసంచా తయారు చేయడం వల్లే ఘటన జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు.

### భారీ విస్ఫోటం

పేలుడు సంభవించినప్పుడు భారీ శబ్దం వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. పేలుడు దాటికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఐదు గ్రామాల పరిధిలో దట్టమైన పొగలు అలముకున్నాయి. పేలుడు సంభవించే ప్రాంతానికి స్థానికులు చేరుకున్నప్పటికే అందులో చిక్కుకున్న పలువురు అగ్నికి ఆహుతయ్యారు. ఘటనాస్థలిలో శరీరభాగాలు చెల్లాచెదురుగా పడిఉన్నాయి. కొన్ని మృతదేహాలు పూర్తిగా కాలిపోయాయి.

### ఘటనాస్థలికి సీఎం చంద్రబాబు

విజయనగరం జిల్లా పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు పేలుడు ఘటన సమాచారంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు. పేలుడు ఘటనపై ఉన్నతాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు అవసరమైన తక్షణ సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఘటనాస్థలంలో అధికారులు సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. పేలుడు ఘటనలో బాధిత కుటుంబాలను ఆదుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అనంతరం విజయనగరం కార్యక్రమం ముగించుకుని.. ప్రమాద ఘటనా స్థలికి చేరుకున్నారు. శనివారం రాత్రికి వేట్లపాలెం చేరుకున్న సీఎం.. బాణసంచా ప్రమాదంలో గాయపడి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని చూసి సీఎం చంద్రబాబు చలించిపోయారు. బాధిత కుటుంబాలతో మాట్లాడిన సీఎం... అధైర్య పడొద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

### వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచండి: పవన్ కల్యాణ్

పేలుడు ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. దురదృష్టకర ఘటన గురించి తెలియగానే కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడి సహాయక చర్యలకు ఆదేశించామన్నారు. పేలుళ్లకుగల కారణాలపై విచారణ జరుగుతోందని అంటూ.. పరిసర గ్రామాలకు పొగ వ్యాపించిన క్రమంలో ఆయా గ్రామాల ప్రజలకు ధైర్యం చెప్పి. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను ఘటనా స్థలానికివెళ్లి సహాయక చర్యలు చేపట్టాలని దిశా నిర్దేశం చేశారు.

### తీవ్ర దురదృష్టకర ఘటన: లోకేష్

వేట్లపాలెం బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు సమాచారం తెలిసి విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఘటనపై ఎక్స్‌లో పోస్టు పెడుతూ.. "పలువురు మృత్యువాత పడటం మాటలకు అందని విషాదం. మృతులకు నివాళి అర్పిస్తున్నాను. మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుంది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తాం" అని మంత్రి నారా లోకేశ్ బాధిత కుటుంబాలకు భరోసానిచ్చారు. అలాగే, ప్రమాద ఘటనపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

### మృతులు వీళ్లే..

మృతుల్లో ఇప్పటి వరకు 11 మంది మృతదేహాలను పోలీసులు గుర్తించారు. మృతులను అడబాల శ్రీను, కడింపల్లి కృపమ్మ, కడింపల్లి ధనరాజు, సాధనాల సత్యవేణి, వట్లూరి రవి, మందపల్లి చిన్ని, నిమ్మద కరుణ, గంపల మంగ, గొడతా మహేశ్, గొడతా రాము, గొడతా నానిగా పోలీసులు పేర్కొన్నారు. ఇంకా కొద్దిమంది మృతదేహాలను గుర్తించాల్సి ఉంది. ఇదిలావుంటే, ఘోర ప్రమాదం చోటుచేసుకోవడంతో.. పరిశ్రమ యజమాని పరారైనట్టు ఆర్డీవో మల్లిబాబు తెలిపారు. ఘటనలో 15మందికి గాయాలయ్యాయని, 9మంది పరిస్థితి విషమంగా ఉందన్నారు. పరిశ్రమకు ఈ ఏడాది మార్చి 31 వరకు లైసెన్స్ ఉందని వెల్లడించారు. మరోవైపు కాకినాడ జీజీహెచ్‌లో ఆరుగురు బాధితులు చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో వేట్లపాలెం వాసి కప్పా వెంకటలక్ష్మి, పెద్దాపురం వాసి మోర్తా శ్రీను, సామర్లకోటకు చెందిన కె. శ్రీను, చిటికెల లక్ష్మి ఉన్నారు. పొలాల్లో 6 షెడ్లు వేసి బాణసంచా తయారుచేస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. పేలుడుకు ముందు కొందరు కార్మికులు భోజనం కోసం బయటకు వెళ్లారు. దీంతో వారు ప్రాణాలు దక్కించుకున్నారు. పేలుడు శబ్దానికి వేట్లపాలెం గ్రామంలో ఇళ్ల అద్దాలు పగిలిపోయాయి.

### మెరుగైన వైద్యం అందించండి: అనిత

బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనపై హోం మంత్రి అనిత స్పందించారు. కార్మికుల మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. విజయనగరం జిల్లా చీపురుపల్లిలో సీఎం పర్యటన సందర్భంగా అక్కడ ఉన్న ఆమె.. హుటాహుటీన సంఘటన స్థలికి బయల్దేరి వెళ్లారు. కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఎప్పటికప్పుడు మాట్లాడి ఘటనపై ఆరా తీశారు.

### బాధితులకు అండగా ఉంటాం: మంత్రి నారాయణ

పేలుడు ఘటనపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటనకుగల కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అత్యవసర చికిత్స అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఘటనాస్థలికి వైద్యులను పంపించి తక్షణ వైద్యసాయం అందించాలని ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.





# ప్రజారోగ్యానికి ఊపిరి!



- సుపరిపాలన.. ప్రజారోగ్యానికి తొలి ప్రాధాన్యం
- కర్నూలులో స్టేట్ కాన్సర్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు
- సంక్షేమ పథకాలే పేదలకు ఆసరా
- మూడేళ్లలో ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి
- గత ప్రభుత్వ పాలనలో ప్రజలకే కాదు, దేవుడికీ ద్రోహం
- చీపురుపల్లి ప్రజా వేదిక సభలో సీఎం చంద్రబాబు







విజయనగరం (చైతన్య రథం): రాష్ట్రంలో ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. కాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ సహా అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. భవిష్యత్తులో కాన్సర్ సోకకుండా 15 ఏళ్లలోపు బాలికలంతా విధిగా హెచ్‌పీవీ టీకాలు వేయించుకోవాలని పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం రావివలసలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్, పేదల సేవల కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. అనంతరం ప్రజా వేదిక సభకు హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. "ఆడబిడ్డలు సర్వైకల్, బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడకుండా రక్షించేందుకు దేశవ్యాప్తంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్‌వల్లే ప్రపంచవ్యాప్తంగా 74శాతం మరణాలు సంభవిస్తున్నాయి. దేశంలో ఇవి 63శాతం ఉండగా.. మన రాష్ట్రంలో 68శాతంగా ఉన్నాయి. ఏపీలో క్యాన్సర్ కేసులు 2021లో 29,379నుంచి 2025కి 32,657కు పెరిగాయి. క్యాన్సర్ కేసుల్లో సుమారు 65 శాతం మహిళల్లోనే నమోదవుతున్నాయి. బ్రెస్ట్, సర్వైకల్‌వంటి క్యాన్సర్లు మహిళల్లో అధికంగా ఉంటే, పురుషుల్లో నోటి క్యాన్సర్ ఎక్కువుగా వస్తోంది. సర్వైకల్ క్యాన్సర్ రాష్ట్రంలో ప్రధాన సమస్యగా మారింది. ప్రతీ లక్షమంది మహిళల్లో 15నుంచి 20మంది సర్వైకల్ క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఈ వ్యాక్సిన్‌కు రూ.4 వేలు ఖర్చవుతుంది. ప్రజారోగ్యం దృష్ట్యా ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. 3.45 లక్షల బాలికల వ్యాక్సినేషన్ కోసం రూ.14.11 కోట్లు వ్యయం చేస్తున్నాం. రాష్ట్రంలో 15 ఏళ్లలోపు వయసున్న బాలికలు 3,45,377 ఉండగా, విజయనగరం జిల్లాలో 11,989 బాలికలున్నారు. వ్యాక్సినేషన్ కోసం రాష్ట్రంలో 1,645 కోల్డ్ చైన్ పాయింట్లు ఏర్పాటుచేసి 16,912 సిబ్బందిని నియమించాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

### లక్షలో 18మంది క్యాన్సర్ బారిన..

ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వైకల్ క్యాన్సర్ కట్టడికి 90-70-90 వ్యూహాన్ని రూపొందించిందని ముఖ్యమంత్రి చెప్పారు. "మనదేశంతో పాటు జాంబియా, సౌత్ ఆఫ్రికా, ఇండోనేషియా దేశాల్లో క్యాన్సర్ ఎక్కువగా ఉంటోంది. మన దేశంలో లక్షలో 18మందికి క్యాన్సర్ సోకుతోంది. క్యాన్సర్ కలుషిత వాతావరణంతోపాటు మన అలవాట్లే దీనికి ప్రధాన కారణం. సర్వైకల్ క్యాన్సర్ నివారణకు 90 శాతం పిల్లలకు వ్యాక్సిన్ ఇవ్వాలి. ఒకసారి డోస్ తీసుకుంటే రక్షణ పొందవచ్చు. ఈ టీకాలు ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆస్పత్రులు ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా వేస్తారు. యువిన్ యాప్ ద్వారా వ్యాక్సినేషన్ ప్రక్రియను కేంద్రం పర్యవేక్షిస్తోంది. టీకా ఇచ్చాక 30 నిమిషాలు డాక్టర్ల పర్యవేక్షణలో ఉంటారు. దీనివల్ల ప్రమాదం ఉండదు. 15ఏళ్ల వయసున్న బాలికలంతా వ్యాక్సిన్ వేసుకునేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు.

### ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత

రాష్ట్రంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు విస్తృతంగా జరిపిస్తున్నాం. ఇప్పటివరకు 1.72 కోట్లమందికి నోటి క్యాన్సర్ స్క్రీనింగ్, 90.39 లక్షలమంది మహిళలకు బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ జరిగింది. నోటి క్యాన్సర్‌కు సంబంధించి 5,07,590 మందిని, బ్రెస్ట్ క్యాన్సర్‌కు సంబంధించి 2,50,897 మంది, సర్వైకల్ క్యాన్సర్‌కు సంబంధించి 3,40,154 మందిని రిఫర్ చేశాం. కర్నూలులో రూ.50 కోట్లతో స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేస్తున్నాం. గత బడ్జెట్‌కంటే 4 శాతంపెంచి ఈ బడ్జెట్‌లో వైద్య ఆరోగ్యరంగానికి రూ.19305 కోట్లు కేటాయించాం. రాష్ట్ర బడ్జెట్‌లో ఇది 6 శాతంగా ఉండటం ప్రజారోగ్యానికి ఎన్డీఏ ప్రభుత్వ ప్రాధాన్యతకు నిదర్శనం. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రూ.2.5 లక్షల వరకు అందరికీ ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాం. రూ.25 లక్షల వరకూ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందించేలా పాలసీ రూపకల్పన జరిగింది. ప్రజారోగ్యం కోసం సంజీవని ప్రాజెక్టు తెస్తున్నాం. త్వరలో వైద్య సలహాల కోసం ఏఐ డాక్టర్ సేవలనూ అందుబాటులోకి తీసుకొచ్చే ఆలోచన చేస్తున్నాం" అని చంద్రబాబు వివరించారు. ప్రతి ఒక్కరూ మితాహారం తీసుకుంటే ఆరోగ్యం బాగుంటుందని సూచిస్తూ.. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీని తీర్చిదిద్దాలనేది కూటమి ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొన్నారు.

### పింఛనుతో పేదల జీవితాల్లో వెలుగులు

20 నెలలుగా 1న నేను స్వయంగా పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నాను. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 62,76,322 మందికి పింఛన్లు ఇస్తుండగా, నెలకు రూ.2,726 కోట్లమేర ఖర్చు చేస్తున్నాం. ఏడాదికి ఈ పథకం కోసం రూ.33 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. గత ప్రభుత్వంలో ఒక నెల పింఛను తీసుకోకపోతే నిలిపి వేసేవారు. కూటమి అధికారంలోకి వచ్చాక పేదలకు అండగా ఉండాలన్న లక్ష్యంతో.. మూడు నెలలదీ కలిపి ఒకేసారి తీసుకునే వెసులుబాటు కల్పించాం. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడి ఎన్నికలకు వెళితే ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం పరిస్థితి అధ్వాన్నమైంది. కనీసం నవ్వడానికి వీలు లేదు. ఇళ్లలో ఎవరూ సురక్షితంగా ఉండలేకపోయారు. రౌడీయిజం పరాకాష్టకు చేరింది. నాపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టారు. అయినా కుంగిపోలేదు.

తరువాయి 3లో..



# ప్రజారోగ్యానికి ఊపిరి!





*2వ పేజీ తరువాయి..*

ప్రజల కోసమే పనిచేస్తున్నాను. మిత్రుడు పవన్ కల్యాణ్ రాష్ట్రం కోసం అండగా నిలబడ్డారు. వెంటిలేటర్‌పై ఉన్న మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కేంద్రం ఆక్సిజన్ అందిస్తోంది. ప్రజలు ఎన్డీఏను గెలిపించడంతో ఢిల్లీలో కూడా మన పరపతి పెరిగింది” అని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు.

**సమపాళ్లలో అభివృద్ధి, సంక్షేమం**

ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశాం. ఆడబిడ్డల కోసం కోసం స్త్రీ శక్తి తీసుకొచ్చాం. ఇప్పటి వరకూ 47 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు చేశారంటే అదీ ఆడబిడ్డల సంక్షేమంపై మన ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి. దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ కింద రెండు విడతల్లో రూ.6,310 కోట్లు ఇచ్చాం. మెగా డీఎస్సీ ద్వారా 15,941 టీచర్ పోస్టులు భర్తీ చేశాం. గత ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టూ భర్తీ చేయలేదు. విద్యపై అసలు దృష్టే పెట్టలేదు. జనాభా తగ్గుదల ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో చిన్న పిల్లల సంఖ్య తగ్గుతోంది. జనాభానే మన దేశ సంపద. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వస్తోంది. ఇప్పటికే టీసీఎస్, కాగ్నిజెంట్ వచ్చాయి. భోగాపురం ఎయిర్ పోర్టులు రాకతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో అభివృద్ధి జరిగి ఉపాధి పెరుగుతుంది. విజయనగరం జిల్లాలో ట్రైబల్ యూనివర్సిటీ త్వరలోనే ప్రారంభమవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లు పెట్టి పేదల ఆకలి తీర్చాం. ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడివున్న వారందరినీ ఆదుకునేందుకే పీ4 విధానం తీసుకొచ్చాం. పీ4 ద్వారా భవిష్యత్‌లో మంచి ఫలితాలు వస్తాయి. మేము అధికారంలోకి వస్తూనే ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు చేశాం. గత ప్రభుత్వంలో భూములు రికార్డులు తారుమారు చేశారు. అడిగిన భూములు ఇవ్వకపోతే 22ఏ కింద పెట్టేశారు. డిసెంబర్‌లోగా అన్ని భూములు సర్వే చేస్తాం” అని ముఖ్యమంత్రి వివరించారు.

**దేవుడికీ ద్రోహం చేశారు..**

“గత పాలకులు తిరుమల వేంకటేశ్వర స్వామికే అపచారం తలపెట్టారు. స్వామి ప్రతిష్టను దెబ్బతీయాలని చూశారు. కెమికల్స్‌తో లడ్డూ తయారుచేసి స్వామికి నైవేద్యంగా పెట్టారు. ప్రజలకే కాదు దేవుడికీ ద్రోహం చేయాలని చూశారు. అలాంటివారు రాజకీయాల్లో ఉంటే సమస్యలు వస్తాయి. దేవుడికి కూడా ద్రోహం చేసేవారిని వదిలిపెట్టకూడదు. నేను ఆ దేవుణ్ణి బజారులోకి లాగాలనుకోలేదు. కానీ జరిగిన తప్పులను ప్రజలకు వివరించాను. చేసిన తప్పును ఇతరులపై నెట్టే ప్రయత్నం చేశారు. గత ఐదేళ్లలో తిరుమల లడ్డూ నాణ్యత ఎలా ఉందో.. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎలా ఉందో ప్రజలే గమనించాలి. వైసీపీ వాళ్లు అసెంబ్లీలో ప్రజా సమస్యలు చర్చించేందుకు రారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తామంటున్నారు. అడ్డదారులు, బెదిరింపులు, దౌర్జన్యాలతో రాజకీయాలు చేస్తున్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని గంజాయికి నిలయంగా మార్చేశారు” సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో మూడేళ్లలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతీ ఎకరాకూ నీరిస్తామని సీఎం ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.














# ఎకనామిక్ హబ్‌గా ఉత్తరాంధ్ర

- పారిశ్రామికాభివృద్ధిలో బ్లూ జెట్ ఓ మైలురాయి
- పరిశ్రమల గ్రౌండింగ్‌కు ప్రభుత్వ ప్రాధాన్యత
- బ్లూజెట్ ద్వారా రూ.2,300 కోట్ల పెట్టుబడులు..
- 2వేల మందికి ఉద్యోగావకాశాలు
- ప్రముఖ ఔషధ తయారీ రాష్ట్రాలలో ఒకటిగా ఏపీ
- విద్య, ఐటీ మంత్రి లోకేష్ ఉద్ఘాటన
- రాంబిల్లిలో హెల్త్ కేర్ యూనిట్‌కు శంకుస్థాపన



అనకాపల్లి (చైతన్య రథం): ఉత్తరాంధ్ర పారిశ్రామికాభివృద్ధిలో బ్లూ జెట్ హెల్త్ కేర్ పరిశ్రమ ఓ మైలురాయిగా విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ అభివర్ణించారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం సీతపాలెంవద్ద ఇండస్ట్రియల్ పార్క్‌లో ప్రముఖ ఫార్మా సంస్థ బ్లూ జెట్ హెల్త్ కేర్ యూనిట్‌కు శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ.. "రాంబిల్లి ఇండస్ట్రియల్ పార్క్‌లో బ్లూ జెట్ హెల్త్‌కేర్ గ్రీన్‌ఫీల్డ్ ఔషధ తయారీ యూనిట్ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉంది. ప్రాజెక్ట్ ఉత్తరాంధ్ర పారిశ్రామికాభివృద్ధిలో ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని ఆకాంక్షిస్తున్నా. ఆధునిక ఫార్మాస్యూటికల్ తయారీలో ఆంధ్రప్రదేశ్‌ను కీలక గమ్యస్థానంగా బ్లూజెట్ మరింత బలపరుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు పెట్టుబడులు పెట్టాలన్న ప్రశ్నకు మూడు బలమైన సమాధానాలున్నాయి. మొదటిది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. ఒక్కసారి మాతో ఒప్పందం చేసుకున్న తర్వాత అది మీ ప్రాజెక్ట్ కాదు.. మా సొంత ప్రాజెక్ట్‌గానే భావిస్తాం. పెట్టుబడిదారులను బయటి వ్యక్తులుగా కాదు, రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములుగా చూస్తాం" అని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

మాటిస్తే నిలబెట్టుకోవడం రెండో కారణం. విశ్వసనీయతే ప్రపంచ పెట్టుబడిదారుల నమ్మకం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి నాయకత్వానికి దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా విశ్వసనీయత ఉంది. ఆంధ్రప్రదేశ్ మాటిస్తే నిలబెట్టుకుంటుందని పెట్టుబడిదారులు నమ్ముతున్నారు. ఆ విశ్వసనీయతే మాకు అతి పెద్ద బలం. మూడోది డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్. రాష్ట్రంలో, కేంద్రంలో బలమైన నాయకత్వంతో ఆంధ్రప్రదేశ్ వేగంగా, స్థిరత్వంతో, వ్యూహాత్మక స్పష్టతతో ముందుకు సాగుతోంది. ఈ సమన్వయం ప్రాజెక్టులు కాగితాలపై మాత్రమే కాకుండా, గ్రౌండింగ్‌కు దోహదపడుతోంది. ప్రతి విజయవంతమైన ప్రాజెక్టు వెనుక, ప్రతి పరిశ్రమల వెనుక, ప్రతి ఉద్యోగం వెనుక ఒక మానవ కథ ఉంటుంది. గతేడాది నా సొంత నియోజకవర్గమైన మంగళగిరికి చెందిన వేణుబాబు నన్ను కలుసుకున్నారు. అది కేవలం అధికారిక సమావేశం కాదు. ఆశతో నిండిన సంభాషణ. ఆయన బ్లూ జెట్ హెల్త్‌కేర్ సంస్థ సీనియర్ అధికారిగా మాత్రమే కాకుండా, ఏపీకి చెందిన వ్యక్తిలా మాట్లాడారు. దేశవ్యాప్తంగా విస్తరణ ప్రణాళికలున్నాయని చెప్పి.. ఎందుకు మన రాష్ట్రం కాదు? మన ప్రజలకు అవకాశాలు ఎందుకు సృష్టించకూడదు అని ప్రశ్నించారు. ఆ భావనే ఈ ప్రాజెక్టుకు ప్రేరణ అయ్యింది. ఆయన ఆసక్తి వ్యక్తం చేసిన వెంటనే, దాన్ని సాధారణ ప్రతిపాదనగా కాకుండా.. పెట్టుబడిని స్వదేశానికి తీసుకురావడానికి ఒక అవకాశంగా చూశాం" అని లోకేష్ వివరించారు.

### పరిశ్రమల గ్రౌండింగ్‌కు ప్రాధాన్యతే ఏపీ మోడల్

"ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చడం కోసం అవసరమైన అన్ని చర్యలూ చేపట్టాలని వెంటనే సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశాం. ముఖ్యంగా ఎలాంటి ఆలస్యం లేకుండా జాగ్రత్తపడ్డాం. అతి తక్కువ కాలంలోనే రాంబిల్లి ఇండస్ట్రియల్ పార్క్ ఫేజ్-2లో 102 ఎకరాలకు పైగా భూమి కేటాయించాం. అవసరమైన అనుమతులు, ఒప్పందాలు వేగంగా పూర్తయ్యాయి. మౌలిక సదుపాయాలు కల్పించాం. ఈరోజు శంకుస్థాపన చేస్తున్నాం. ఒక సంభాషణ నుంచి భూమిపూజ వరకు వచ్చిన ఈ ప్రయాణం -ఆంధ్రప్రదేశ్ నిజమైన స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది. ప్రతి పెట్టుబడి వెనుక కష్టం ఉంటుంది. ప్రతి పరిశ్రమకు ఒక కథ ఉంటుంది. ప్రతి ఉద్యోగం ఒక కలగా మొదలై.. ప్రభుత్వం, పరిశ్రమ కలిసి నడిచినప్పుడు ఆవిష్కృతమవుతుంది. ఈ ప్రాజెక్ట్ కేవలం మౌలిక వసతులు లేదా పెట్టుబడి గురించి కాదు.. ఇది నమ్మకం గురించి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి తన రాష్ట్రంపై నమ్మకముంచిన కథ. ప్రభుత్వం వేగంగా స్పందించిన తీరుకు నిదర్శనం. వేలాది కుటుంబాల జీవితాలను మార్చే అవకాశాలను సృష్టించడం. ఇదే ఆంధ్రప్రదేశ్ మోడల్. ప్రకటనలకే పరిమితం కాకుండా అమలుకు ప్రాధాన్యత ఇస్తాం" అని మంత్రి లోకేష్ ఉద్ఘాటించారు.

### రూ.2,300 కోట్ల పెట్టుబడి, 2వేల ఉద్యోగాల కల్పన

"బ్లూ జెట్ హెల్త్ కేర్ సంస్థ రూ.2,300 కోట్ల పెట్టుబడి పెట్టడంతోపాటు 1,750మందికి ప్రత్యక్ష, 250మందికి పరోక్ష ఉద్యోగాలను కల్పించనుంది. 2,000 కిలోలీటర్ల సామర్థ్యంతో భారీ ఏపీఐ, ఇంటర్మీడియేట్స్ తయారీ యూనిట్ అభివృద్ధి చేస్తుంది. జీరో లిక్విడ్ డిశ్చార్జ్ వ్యవస్థలు, సుస్థిర వ్యర్థజల శుద్ధి విధానాలువంటి ఆధునిక పర్యావరణ రక్షణ చర్యలు చేపడుతుంది. బాధ్యతాయుత పారిశ్రామికీకరణకు ఇది నిదర్శనం. దేశానికి వచ్చే ప్రతిపాదిత పెట్టుబడుల్లో రాష్ట్రానికి 25.3శాతం రావడం గర్వకారణం. ప్రతి వంద రూపాయల్లో 25 రూపాయలకు పైగా పెట్టుబడులు పెట్టేందుకు ఏపీని ఎంచుకుంటున్నారు" అంటూ మంత్రి లోకేష్ సక్సెస్ రేట్‌ను విశదీకరించారు.

### ఎకనామిక్ హబ్‌గా ఉత్తరాంధ్ర

ఉత్తరాంధ్రను ఎకనామిక్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేస్తాం. గూగుల్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, టీసీఎస్, కాగ్నిజెంట్ ఐటీ పెట్టుబడులువంటి ప్రధాన ప్రాజెక్టులతో ఉత్తరాంధ్ర ప్రధాన పెట్టుబడి గమ్యస్థానంగా మారుతోంది. విశాఖపట్నం పోర్ట్ ద్వారా బలమైన కనెక్టివిటీ, విస్తారమైన భూమి లభ్యత, నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉత్తరాంధ్ర ప్రాంతానికి బలంగా ఉన్నాయి. విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్‌ను ఫార్మాస్యూటికల్స్, మెడికల్ ఉపకరణాలు, పెట్రోకెమికల్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్, ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్ రంగాల కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నాం. భారీ పెట్టుబడులకు రాంబిల్లి ఇండస్ట్రియల్ పార్క్‌ను వ్యూహాత్మకంగా అభివృద్ధి చేయడం జరుగుతుంది" అని మంత్రి వివరించారు.

### ఔషధ తయారీ రాష్ట్రాలలో ఏపీ ఒకటికావాలి

"క్లస్టర్ ఆధారిత పారిశ్రామిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఈవీలు, టెక్స్ టైల్స్, ఐటీ అండ్ డిజిటల్ సర్వీసెస్, ఆక్వా, ఫుడ్ ప్రాసెసింగ్, పునరుత్పాదక శక్తి, ఫార్మాస్యూటికల్స్, హెల్త్‌కేర్‌వంటి రంగాల్లో 22 క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నాం. బ్లూజెట్ ప్రాజెక్టు ఉత్తరాంధ్రలో బలమైన ఫార్మాస్యూటికల్ క్లస్టర్ అభివృద్ధికి తోడ్పడుతుంది. ఈ ప్రాజెక్టు సకాలంలో పూర్తయ్యేలా అన్ని విధాల అండగా నిలుస్తాం. దేశంలో ప్రముఖ ఔషధ తయారీ రాష్ట్రాలలో ఒకటిగా ఏపీని తీర్చిదిద్దాలనేది లక్ష్యంగా పెట్టుకున్నాం" అని లోకేష్ వివరించారు.

### 20 లక్షల ఉద్యోగాల కల్పనే అజెండా..

"2024 ఎన్నికల్లో 94 శాతం సీట్లు సాధించాం. ఇదో చరిత్ర. 50శాతం ఎమ్మెల్యేలు మొదటిసారి ఎన్నికయ్యారు. 25మంది మంత్రుల్లో 17మంది కొత్తవారు. రాష్ట్రాభివృద్ధికి కసితో పనిచేస్తున్నాం. రాష్ట్రంలో ఐదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే మా ఏకైక అజెండా. బ్లూ జెట్ హెల్త్ కేర్ లిమిటెడ్ తమ విస్తరణకు ఏపీని ఎంచుకున్నందుకు సంస్థ యాజమాన్యానికి హృదయపూర్వక అభినందనలు. బ్లూ జెట్‌కు వాట్సాప్ మెసేజ్ దూరంలోనే ఉన్నాను. అన్ని విధాల అండగా నిలుస్తాం. ఈ పెట్టుబడి మా పారిశ్రామిక వ్యవస్థను బలోపేతం చేస్తూ, ఔషధ తయారీ సామర్థ్యాన్ని పెంచుతూ, పెట్టుబడిదారుల నమ్మకాన్ని మరింత బలపరుస్తుంది. ఈ ప్రాజెక్టు విజయవంతం కావాలని, సమయానికి పూర్తికావాలని, బ్లూ జెట్ హెల్త్‌కేర్‌తో దీర్ఘకాల భాగస్వామ్యం కొనసాగాలని ఆశిస్తున్నా" అని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు.

ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ.. "విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ యువ రాష్ట్రంగా ఉంది. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో వేగంగా పారిశ్రామికవృద్ధి జరుగుతోంది. పీఎం నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారు" అన్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ.. పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అద్భుతమైన రాష్ట్రం. చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకెళ్తోంది. రాష్ట్రానికి అనేక కంపెనీలు తీసుకొస్తున్నారు. ఏపీని గ్రోత్ ఇంజన్‌గా తీర్చిదిద్దుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ఎప్పుడూ అతిథి దేవోభవ అనే సిద్ధాంతాన్ని నమ్ముతుంది. విశాఖ అందరికీ స్వాగతం పలుకుతోంది. పెట్టుబడిదారులకు తాము ఎప్పుడూ మద్దతుగా ఉంటామని భరోసానిచ్చారు.

బ్లూ జెట్ హెల్త్‌కేర్ మేనేజింగ్ డైరెక్టర్ శివెన్ అరోరా మాట్లాడుతూ.. "ప్రస్తుత పోటీ వాతావరణంలో స్పీడ్ అనేది చాలా ముఖ్యం. ఏపీలో యూనిట్ స్థాపనకు అన్ని ప్రభుత్వ వ్యవస్థలు మాకు ఎంతగానో సహకరించాయి. బ్లూ జెట్ సంస్థ రాష్ట్రంలో పెద్దఎత్తున ఉద్యోగావకాశాలను కల్పిస్తుంది" అని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఇంఛార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ఏపీఆర్డీసీ ఛైర్మన్ పి నాగేశ్వరరావు, బ్లూ జెట్ హెల్త్‌కేర్ మేనేజింగ్ డైరెక్టర్ శివెన్ అరోరా, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వేణుబాబు, సహ వ్యవస్థాపకులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నరేష్ షా, కలెక్టర్ విజయ కృష్ణన్‌తోపాటు బ్లూ జెట్ హెల్త్‌కేర్ బృంద సభ్యులు, ప్రజా ప్రతినిధులు, ఏపీఐఐసీ, వివిధ శాఖల సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏయూ శతాబ్ది

- పూర్వవైభవానికి ఉత్సవాలే వేదిక కావాలి
- ప్రపంచంలోనే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దుతా
- వైభవంగా శతాబ్ది నిర్వహణకు సకల ఏర్పాట్లు చేయండి
- అధికారులతో సమీక్షలో విద్యా మంత్రి లోకేష్ ఆదేశం









విశాఖపట్నం (చైతన్య రథం): చారిత్రక నేపథ్యమున్న ఆంధ్ర యూనివర్సిటీకి పూర్వవైభవం తెస్తానని, శతాబ్ది ఉత్సవాలను కనీవినీ ఎరుగని రీతిలో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ చేయాలని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల నిర్వహణపై వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్, ఇతర ఉన్నతాధికారులతో విశాఖలో శనివారం సమీక్ష నిర్వహించారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. "ఆంధ్ర యూనివర్సిటీకి ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. యూనివర్సిటీని ప్రపంచంలోనే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దేందుకు శతాబ్ది ఉత్సవాలు వేదిక కావాలి. మార్చి 26నుంచి ఏప్రిల్ 26వరకు పూర్వ విద్యార్థులతో మమేకం కావడంతోపాటు శతాబ్ది ఉత్సవాల్లో వారినీ భాగస్వాములను చేద్దాం. శతాబ్ది ఉత్సవాల్లో ఆంధ్ర యూనివర్సిటీ ఘన చరిత్ర ప్రతిబింబించాలి. ఇందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలి. కమిటీలను సమన్వయం చేసుకోవాలి. మీడియా పబ్లిసిటీకి ప్రాధాన్యతనివ్వాలి. ప్రస్తుత విద్యార్థులతో కళలు, సంగీతం, సాహిత్యంవంటి కార్యక్రమాలను రూపొందించాలి. వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఉత్తరాంధ్ర ప్రజలు, విద్యార్థులను భాగస్వాములను చేయాలి. ప్రముఖులతో వివిధ అంశాలపై సదస్సులు నిర్వహించాలి. యూనివర్సిటీ వందేళ్ల విజన్‌కు అవసరమైన యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులను మంత్రి లోకేష్ దేశించారు.

శతాబ్ది ఉత్సవాల సందర్భంగా యూనివర్సిటీలో చేపట్టబోయే పలు అభివృద్ధి పనులతోపాటు ఏప్రిల్ 26న శతాబ్ది స్థాపన దినోత్సవ అజెండాను వీసీ వివరించారు. అనుబంధ కళాశాలలను ఉత్సవాల్లో భాగస్వాములను చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు పలు సూచనలు చేశారు. యూనివర్సిటీతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ శతాబ్ది ఉత్సవాల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. విజిబిలిటీని క్రియేట్ చేయాలి. శతాబ్ది ఉత్సవాల నిర్వహణ అద్భుత అవకాశం. సద్వినియోగం చేసుకోవాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, పీజీవీఆర్ నాయుడు, విష్ణుకుమార్ రాజు, వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విశాఖ పార్టీ కార్యాలయంలో

# మంత్రి లోకేష్ 82వ ప్రజాదర్బార్

- ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరణ
- సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ





విశాఖపట్నం (చైతన్య రథం): అనకాపల్లి జిల్లాలో బ్లూజెట్ పరిశ్రమ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్.. శనివారం ఉదయం విశాఖ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 82వ ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలకు సంబంధించి ప్రజలు, పార్టీ శ్రేణులనుంచి వినతులు స్వీకరించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులకు పూర్తిస్థాయి వేతన స్కేళ్లను వర్తింపజేయాలని అనకాపల్లి జిల్లాకు చెందిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఫార్మసీలో మాస్టర్స్ చేసిన తనకు ఉద్యోగావకాశం కల్పించాలని విశాఖకు చెందిన ఏ.యామిని కోరారు. అనకాపల్లి జిల్లా సీతపాలెం గ్రామ భూనిర్వాసితుల పునరావాసం, నష్టపరిహారం, సైట్ కేటాయింపుతోపాటు స్థానికులకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు మంత్రి లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. అనకాపల్లి లక్ష్మీదేవిపేటలోని శ్రీ దుర్గాదేవి అమ్మవారి ఆలయ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని శ్రీ కనకదుర్గమ్మ ప్రార్థన సొసైటీ ప్రతినిధులు కోరారు. ఇటీవల ప్రతిపాదిత ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా పవిత్ర ఆలయానికి భంగం కలగకుండా చూడాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పరవాడ ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న పీల దిలీప్‌కుమార్ తమ ఇంటిని అక్రమంగా స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారని, విచారించి తగిన న్యాయం చేయాలని అనకాపల్లికి చెందిన పి సతీష్ కుమార్ మంత్రికి ఫిర్యాదు చేశారు. వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.

చైతన్యరథం

# రూ.5,456.26 కోట్లతో టీటీడీ బడ్జెట్‌కు ఆమోదం

- "శ్రీవారి ముడుపుల పత్రం పథకం" ప్రారంభం
- విద్య, భద్రత, భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యం
- రూ.120 కోట్లతో అత్యాధునిక వంటశాల
- పరిపాలనా భవనంలో కమాండ్ కంట్రోల్ సెంటర్
- టీటీడీ విద్యాసంస్థలకు రూ.118.89 కోట్లు
- టీటీడీపై అసత్య పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు
- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



తిరుమల(చైతన్యరథం): టీటీడీ 2026-27 ఆర్థిక సంవత్సరా నికి రూ.5,456.26 కోట్ల బడ్జెట్‌కు ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపిందని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ బడ్జెట్‌కు ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో ఈవో ఎం.రవిచంద్రతో కలసి శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్య మంత్రి చంద్రబాబు ఆదేశాలతో టీటీడీ బోర్డు సబ్‌కమిటీ సిఫార్సు ల మేరకు టీటీడీ చరిత్రలో తొలిసారిగా తిరుమల తిరుపతి దేవ స్థానం విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో మెరుగైన విద్యను అందించేందుకు గాను రూ.118. 89 కోట్లు కేటాయించారు. ఇందులో భాగంగా డిజిటల్ క్లాస్ రూములు, అదనపు హాస్టల్ బ్లాకులు, వంట గదుల ఆధునికీకరణ, ఇతర మౌళిక సదుపాయాలు వంటి సమూలమైన మార్పులను తీసుకొచ్చేందుకు ఆమోదించారు. భక్తుల విజ్ఞప్తి మేరకు శ్రీవారికి ముడుపులు అందించే దాతల సౌకర్యార్థం "శ్రీవారి ముడుపు పత్రం పథకం"ను ప్రయోగాత్మకంగా ప్రారంభించాలనే నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం భక్తులు మొక్కుల రూపంలో శ్రీవారి హుండీలో కానుకలు వేస్తున్నారు. ఇందుకు బదులుగా భక్తులు తిరుమలలో ఏర్పాటు చేసే కౌంటర్లలో యూపీఐ ద్వారా చెల్లింపు లు చేస్తే అందుకు తగిన ముడుపు పత్రాలు అందజేస్తారు. వాటిని నేరుగా శ్రీవారి హుండీలో వేయవచ్చు. తద్వారా భక్తులు నగదు, నాణేలు తీసుకువచ్చేందుకు ఉన్న ఇబ్బందులు తొలగుతాయి.

అన్న ప్రసాద భవనం, ఆధునిక వంటశాల

తిరుమలలో భక్తుల సౌకర్యార్థం అదనంగా మరో అన్న ప్రసాద భవనం, ఆధునిక వంటశాలను అత్యాధునిక టెక్నాలజీతో నిర్మిం చేందుకు రిలయన్స్ సంస్థ రూ.100 కోట్ల నుంచి రూ.120 కోట్లు విరాళం అందించేందుకు ముందుకు రావడంతో పనులు ప్రారం భించేందుకు ఆమోదించారు. ఆలయాలు, ప్రాకారాలు, రాజ గోపురాలు తదితర నిర్మాణాలకు అయ్యే ఖర్చును దృష్టిలో ఉంచు కుని తదనుగుణంగా శ్రీవాణి ట్రస్టు మార్గదర్శకాలను మార్పు చేసేందుకు ఆమోదం.

### ఒంటిమిట్టలో 108 అడుగుల జాంబవంతుడి విగ్రహం

ఒంటిమిట్టలో 108 అడుగుల జాంబవంతుడి విగ్రహం ఏర్పాటుకు గాను డ్రై ఐల్యాండ్ నిర్మించేందుకు నిర్ణయం. అందు కుగాను రూ.20.17 కోట్లతో పనులకు ఆమోదం తెలిపారు. కోయంబత్తూర్, గువహటి, బెలగావి, అదేవిధంగా పాట్నా వద్ద మోకామ నగరంలో శ్రీవారి ఆలయాల నిర్మాణాలకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు టీటీడీకి కేటాయించిన భూమిని తీసుకునేందుకు ఆమోదించారు.

### అక్షర గోవిందం పేరుతో అక్షరాభాస్య కార్యక్రమం

వకుళమాత ఆలయంలో అక్షర గోవిందం పేరుతో అక్షరాభాస్య కార్యక్రమం ప్రారంభించాలని నిర్ణయించారు. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 1వ తేదీన జరగనున్న సీతారాముల కల్యాణానికి విచ్చేసే దాదాపు 70 వేల మంది భక్తులకు ఈ ఏడాది అదనంగా రూ.50 విలువ చేసే తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని ఉచితంగా అందించాలని నిర్ణయించారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులను ఆకట్టుకునేలా రూ. 4.25 కోట్లతో విద్యుత్ అలంకరణలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ఎల్ఈడీ బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

### భద్రత సిబ్బంది నియామకానికి ఆమోదం

ఆర్మీ వెల్ఫేర్ ప్లేస్‌మెంట్ ఆర్గనైజేషన్ ద్వారా తిరుపతిలో 356 మంది, తిరుమలలో 371 మంది భద్రత సిబ్బంది నియామకానికి ఆమోదం తెలిపారు. అలిపిరి తనిఖీ కేంద్రంలో రూ.8 కోట్లతో ఎక్స్ రే బ్యాగేజ్ స్కానర్లు, డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. తిరుమల, తిరుపతిలోని టీటీడీ గోశాలలు, పలమనేరులోని శ్రీవేంకటేశ్వర ఇంక్యూబేషన్ సెంటర్‌లలో రూ. 11.28 కోట్లతో అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. టీటీడీ ఆలయాల్లో పరిచారకులుగా పనిచేస్తున్న 51 మందికి అర్చకులుగా పదోన్నతి కల్పించేందుకు గాను ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయం తీసుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో శ్రీ వేంకటే శ్వర దివ్య క్షేత్రం నిర్మాణానికి రూ.14.25 కోట్లు కేటాయించారు. తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి ఆలయం చుట్టూ సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు.

### కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు

దేశవ్యాప్తంగా ఉన్న టీటీడీ ఆలయాలు, సత్రాలు, విశ్రాంతి భవనాలు, యాత్రికుల వసతి సముదాయాలు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, కల్యాణ మండపాల భద్రతను పర్యవేక్షించేందుకు తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో రూ.10.75 కోట్లతో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. ఇటీవల చాలామంది తమ స్వప్రయోజనాల కోసం తిరుమలలో అసత్య కథనాలతో రీల్స్ చేసి సోషియల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. ఎంతో భక్తితో తిరుమల పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల మనోభావాలను దెబ్బతినేలా పోస్టు పెట్టేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టీటీడీ హెచ్చరిస్తోంది. ఈ కార్యక్రమం లో టీటీడీ బోర్డు సభ్యులు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు వి.వీరబ్రహ్మం, ఎ.శరత్, సీవీఎస్వో మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### శ్రీ పరాభవ నామ పంచాంగం ఆవిష్కరణ

శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగాన్ని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ఎం.రవిచంద్ర ఆవిష్కరించారు. తిరు మలలోని అన్నమయ్య భవనంలో శనివారం టీటీడీపీ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పంచాంగాన్ని ఆవిష్కరించారు. ధర్మప్రచారంలో భాగంగా టీటీడీ ప్రతి ఏడాదీ తెలుగు సంవత్సరాది అయిన ఉగాది నాటికి పంచాంగాలను ముద్రించి భక్తలోకానికి అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రాబోయే శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగాన్ని ఆకర్షణీయంగా ముద్రించినట్టు తెలిపారు. పంచాంగాన్ని రచిం చిన టీటీడీ ఆస్థాన సిద్ధాంతి తంగిరాల వేంకటకృష్ణ పూర్ణప్రసాద్ సిద్ధాంతి, వైఖానసాగమ పండితులు ఆచార్య వేదాంతం విష్ణుభట్టాచార్యులు సులభంగా, అందరికీ అర్థమయ్యేలా పరి ష్కరించారు. రూ.75 విలువైన ఈ పంచాంగం తిరుమల, తిరు పతిలో ఆదివారం నుంచి భక్తులకు అందుబాటులో ఉంటుంది. మిగతా టీటీడీ సమాచార కేంద్రాలలో వచ్చే వారం నుంచి పంచాంగం అందుబాటులో ఉంటుంది. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు వి.వీరబ్రహ్మం, ఎ.శరత్, సీవీఎస్వో మురళీ కృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బనగానపల్లెలో పింఛన్ల పంపిణీ

- పాల్గొన్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



బనగానపల్లె(చైతన్యరథం): పట్టణంలోని బీసీ కాలనీలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశా రు. బీసీ కాలనీలో లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి వారి యోగ - క్షేమాలు అడిగి తెలుసుకుని అవ్వాతాతలకు పింఛన్లు అందజే శారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కేవలం 20 నెలల పాలన లో రాష్ట్రంలో పింఛన్ లబ్ధిదారులకు రూ.60 వేల కోట్లకు పైగా అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపా రు. చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రజల అభివృద్ధి.. సంక్షేమం కాంక్షించే మంచి ప్రభుత్వం అని ప్రశంసించారు. ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నా సూపర్ సిక్స్ ను సూపర్ సక్సెస్ చేశాం. ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీ చేస్తున్నా మని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి నెలా క్రమం తప్పకుండా దాదాపు గా 63 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు రూ.2,725 కోట్లు పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు.

## ఎస్వీ జూకు త్వరలో 61 వన్యప్రాణుల రాక



తిరుపతి(చైతన్యరథం): ఎస్వీ జూపార్కుకు త్వరలో అరుదైన వన్యప్రాణులు రానున్నాయి. విశాఖ జూపార్కు, హైదరాబాదు జూపార్కు, చెన్నై లోని క్రొకోడైల్ బ్యాంకు ట్రస్టు, గుజరాత్ రాష్ట్రం జాంనగర్‌లోని గ్రీన్స్ జువాజికల్ రెస్క్యూ అండ్ రిహాబిటేషన్ సెంటర్ నుంచి మొత్తం 61 వన్యప్రాణులు తిరుపతికి రానున్నా యి. తిరుపతి: తిరుపతి ఎస్వీ జూపార్కుకు త్వరలో అరుదైన వన్యప్రాణులు రానున్నాయి. విశాఖ జూపార్కు, హైదరాబాదు జూపార్కు, చెన్నైలోని క్రొకోడైల్ బ్యాంకు ట్రస్టు, గుజరాత్ రాష్ట్రం జాంనగర్‌లోని గ్రీన్స్ జువాజికల్ రెస్క్యూ అండ్ రిహాబిటేషన్ సెంటర్ నుంచి మొత్తం 61 వన్యప్రాణులు తిరుపతికి రాను న్నాయి. పరస్పర వన్యప్రాణి మార్పిడి విధానం ద్వారా వీటిని తెప్పించనున్నట్లు అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్ చంద్రప్రసాద్ చెప్పారు. తిరుపతినుంచి గరియల్-2, ఇండినగ్ గౌడ్-2, జపనీస్ కోయల్ -4, మస్కోవి డెక్ -4, గే పిలికాన్ -2, వైటఖ్ ఈబీస్ 2 హైదరాబాద్‌లోని నెహ్రూ జులాజికల్ పార్కుకు పంపిస్తారు. అక్కడినుంచి మగ్గర్ క్రోకోడైల్స్ -4, ఇండియన్ మౌస్ డీర్-6, రింగ్ నెక్కుడ్ పీసెంట్ -2, గోల్డెన్ పీసెంట్-2, సిల్వర్ పీసెంట్ -1, రెడ్ జంగిల్ ఫోవల్ -2, జంధ్యాకోనూరే 2 ఇక్కడికి రానున్నాయి. మద్రాస్ క్రొకోడైల్ బ్యాంకు ట్రస్టు నుంచి మొసళ్లు-5, ఉప్పునీటి మొసళ్లు 2, ఎల్లో అనకొండ-9 ఎస్వీ జూపార్కుకు రానున్నాయి. విశాఖలోని ఇందిరాగాంధీ జువాజికల్ పార్కు నుంచి ఒక తెల్లపుల్లి ఎస్వీ జూపార్కుకు రానుండగా ఇక్కడున్న తెల్లపులిని వారికి పంపిస్తారు. రెండు అడవికుక్కలు, ఒక తోడేలు, రెండు జింకలు, బూడిదరంగు అడవికోళ్లు రెండు విశాఖ జూకు పంపించనున్నారు. దానికి బదులుగా అక్కడి నుంచి ఒక తోడేలు, రెండు అడవికుక్కలు, రెండు అడవిపిల్లులు, రెండు నీల్‌గై, నాలుగు గ్రీన్ ఇగ్వనాలను తిరుపతి జూపార్కుకు అందజేయనున్నారు. జామ్‌నగర్‌కు తెల్లపులి ఒకటి, ఇండియన్ గౌర్ రెండు, బ్లాక్ బక్-10, సాంబార్-10, బార్కింగ్ డీర్-2, మస్క్వేడక్-2, జాగ్వర్ ఒకటి అందజేస్తారు. దీనికి బదులుగా జీబ్రాలు 4, బ్లాక్ పాంథర్ రెండు, జిరాఫీలు రెండు, జాగ్వార్లు రెండు, రెడ్ నెక్కుడు వాలాబీ నాలుగు తిరుపతి ఎస్వీ జూపార్కుకు అందజేస్తారు.

చైతన్యరథం

# కాకినాడ పేలుడు ఘటనపై మంత్రుల స్పందన

- ఆసుపత్రిలో బాధిత కుటుంబాలకు పరామర్శ
- ఘటనాస్థలిని పరిశీలించిన కందుల దుర్గేష్
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యానికి ఆదేశం
- ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా



కాకినాడ(చైతన్యరథం): అమరావతి(చైతన్యరథం): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఘటనపై మంత్రులు స్పందించారు. ఈ ఘటనలో పలువురు మృతిచెందడం మాటలకందని విషాదమని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో చనిపోయిన వారికి నివాళులర్పించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రులు భరోసా ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలం పర్యటనలో ఉన్న మంత్రి కందుల దుర్గేష్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ శనివారం సాయంత్రం హుటాహుటిన ప్రమాద స్థలాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని, ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు. ఈ విషాద సమయంలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

**ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి అచ్చెన్నాయుడు**

వేట్లపాలెం ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. సమగ్ర విచా రణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. భద్రతా ప్రమాణాలను మరింత కఠినంగా అమలు చేయాలని అధికారుల కు సూచించారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అన్ని విధాలు గా అండగా ఉంటుంది. అవసరమైన సహాయాన్ని వెంటనే అందిస్తాం.

**మెరుగైన వైద్య చికిత్స: మంత్రి డోలా**

వేట్లపాలెం ఘటనపై మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 21 మంది చనిపోవడం అత్యంత దురదృష్టకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారికి ప్రభుత్వం మెరుగైన వైద్య చికిత్స అందిస్తోంది. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

తక్షణ వైద్యానికి మంత్రి సత్యకుమార్ ఆదేశం

వేట్లపాలెంలో బాణసంచా పేలుడు ఘటనపై మంత్రి సత్య కుమార్ యాదవ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తక్షణ వైద్య సహాయక చర్యలు చేపట్టాలని వైద్యశాఖ సెక్రటరీ, డీఎంఈ, డీఎంహెచ్ ఓలకు ఆదేశాలు జారీ చేశారు. సూపర్ స్పెషాలిటీ వైద్యులు, ఇతర సిబ్బందిని సంఘటనా స్థలానికి వెంటనే పంపాలని.. అంబులెన్స్ లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

**స్పందించిన మంత్రి మండిపల్లి**

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో బాణసం చా కేంద్రంలో పేలుడు ఘటనపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగా ఢ సానుభూతి తెలిపారు. ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన ప్రత్యేక భద్రతలు, తనిఖీలు నిర్వహించా లని సూచించారు.

**బాధ్యులపై చర్యలు: మంత్రి కొల్లు రవీంద్ర**

ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు మంత్రి కొల్లు రవీంద్ర ప్రగాఢ సానుభూతి తెలిపారు. 21 మంది ప్రాణాలు కోల్పోవడం విచారకరం. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి. సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి.

**అన్ని విధాలా ఆదుకుంటుంది: మంత్రి కొలుసు**

వేట్లపాలెం పేలుడు ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఘటనలో 21 మంది చనిపోవడం అత్యంత దురదృష్టకరం. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేస్తున్నాను. వారికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలబడుతుంది. తక్షణ సహాయ చర్యలు చేపడుతుంది. ఘటనలో గాయపడిన వారికి ప్రభుత్వం మెరుగైన వైద్యసదుపాయాలు అందిస్తుంది.

**బాధిత కుటుంబాలను ఆదుకోవాలి: పీవీఎన్ మాధవ్**

కాకినాడ పేలుడు ఘటనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందిసూ పేలుడు తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన ఉచిత వైద్యం అందించాలి. మృతుల కుటుంబాలకు తగిన ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలి. ఈ ఘటనపై సమ గ్ర దర్యాప్తు జరిపి, భద్రతా ప్రమాణాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రజల వినతులను త్వరగా పరిష్కరించాలి

**- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి**



బనగానపల్లె (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు శాఖల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సూచించారు. బనగానపల్లె లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయన వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధితో కూడిన సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. బాధితుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. న్యాయబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో అక్కడిక్కడే ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించారు. ఎక్కువగా రెవెన్యూ, ఫింఛన్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వంటి సమస్యలు మంత్రి దృష్టికి రాగా ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యలపై మంత్రి స్పందించిన తీరుతో బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.



## రూ.20 కోట్లతో మైనార్టీ యువతకు నైపుణ్య శిక్షణ

**- నంద్యాలలో కేంద్రం ప్రారంభించిన న్యాయ శాఖ మంత్రి ఫరూక్**



అమరావతి/నంద్యాల(చైతన్యరథం): రాష్ట్రంలో మైనారిటీలు ఎక్కువగా నివసించే ప్రాంతాలలో మైనారిటీ యువత కోసం నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నట్లు న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ వెల్ల డించారు. శనివారం నంద్యాలలో నేషనల్ డిగ్రీ కళాశాలలో నేషన ల్ విద్యాసంస్థల చైర్మన్ ఎస్.ఇంతియాజ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పీఎం వికాస్ (ప్రధాన మంత్రి విరాసత్ కా సంవర్ధన్), ఏపీ ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో యువత ఉపాధి కోసం నైపుణ్యాభి వృద్ధి శిక్షణ ఇస్తున్నామన్నారు. పీఎం వికాస్ కింద మంజూరైన రూ.20 కోట్ల నిధులను శిక్షణ కోసం ఖర్చు చేయడం జరుగుతుం దని తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో మొదటి విడతలో నంద్యాలతో పాటు కర్నూలు, ఏలూరు పట్టణాలలో నైపుణ్యాభివృ ద్ధి శిక్షణ కేంద్రాలు ప్రారంభిస్తున్నామన్నారు. రెండో విడతలో హిందూపురం, మదనపల్లె, గుంటూరు, విజయవాడ కేంద్రాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మైనారిటీలు ఎక్కువగా నివసించే ప్రాంతాల లో యువతకు నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయబోతున్నా మని తెలిపారు. ఏఐ, డిజిటల్ మార్కెటింగ్, వేర్ హౌస్ మేనేజ్‌మెం ట్ ఇలా డిమాండ్ ఉన్న కోర్సుల్లో మైనారిటీ యువతకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపా రు. స్వయం ఉపాధి, ఉద్యోగ, వ్యాపార, పారిశ్రామిక రంగాలలో యువత ఉన్నత స్థాయిలో స్థిరపడడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. నేషనల్ విద్యాసంస్థల చైర్మన్ ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ తమ కళాశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రంలో ఆరు నెలల వ్యవధితో వేర్ హౌస్ సూపర్‌వైజర్, డిజిటల్ మార్కె టింగ్ మేనేజర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఒక్కొక్క కోర్సులో 200 సీట్లు ఉన్నాయని, శిక్షణతో పాటు నెలకు రూ. 2000 స్టైపెండ్‌ను కూడా కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు.

## దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం

- జీవో జారీ చేసిన కూటమి ప్రభుత్వం
- "ఇంద్రధనస్సు" పథకాల్లో భాగంగా ప్రారంభం
- సీఎం చంద్రబాబుకు మంత్రి డోలా కృతజ్ఞతలు

మంగళగిరి(చైతన్యరథం): కూటమి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతను ఇస్తూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టింది. ముఖ్యమంత్రి చంద్ర బాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన అన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందుతోంది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దివ్యాంగుల కోసం ప్రకటించిన "ఇంద్రధనస్సు" పథకాలలో భాగంగా రెండు నెలల్లోనే ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి తీసు కువచ్చింది. ఈ మేరకు ఫిబ్రవరి 28న శనివారం జీఎంఎస్ నెం.21 అధికారికంగా జారీ చేసింది. "ఇంద్రధనస్సు" పథకాలు దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యతకు సాక్ష్యం. దివ్యాంగులు ఉపాధి, వైద్య, విద్యా, సామాజిక కార్యక లాపాల్లో భాగంగా తాము కోరుకున్న చోటుకు సౌకర్యవంతంగా చేరుకునేలా ఈ ఉచిత రవాణా సదుపాయం అందిస్తోంది. కూట మి ప్రభుత్వం వారిని సమాజంలో సక్రమ భాగస్వామ్యంగా మార్చే విధంగా పలు సంక్షేమ పథకాలను కొనసాగిస్తోంది. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం రాష్ట్రంలోని అన్ని బస్సుల్లో అందుబాటులో ఉంది..వీటిలో స్త్రీ శక్తి పథకానికి వర్తించే అన్ని బస్సులు కూడా ఉన్నాయి. ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధిం చి జీవో జారీ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు దివ్యాంగుల తరపున మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

# రాష్ట్రానికి దుష్టశక్తిలా వైసీపీ

**- ఆ పార్టీని నమ్మితే అభివృద్ధికి విఘాతం**

**- మంత్రి నిమ్మల రామానాయుడు**

పాలకొల్లు(చైతన్యరథం): నియోజకవర్గంలో శనివారం మంత్రి నిమ్మల రామానాయుడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలపై చర్చ జరిగే దేవాలయం లాంటి అసెంబ్లీ సమావేశాలకు జగన్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు రాక పోవడం ప్రజా స్వామ్యంపై వారికి ఏ మాత్రం విలువ ఉందో అర్థమవుతుందన్నారు. అసెంబ్లీకి ఎస్కేప్, శాసనమండలికి వాకౌట్, రోడ్డు మీదకు వస్తే రప్పా రప్పా సంస్కృతి వైసీపీదని ధ్వజమెత్తారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెద్ద ఎత్తున పెన్షన్ ఇస్తూ మానవత్వంతో పనిచేస్తున్నాం. 2029లో అధికారంలోకొస్తే పొట్టేళ్లు నరికినట్టు రప్పా రప్పా అంటూ రాక్ష సత్వం ప్రదర్శిస్తున్న వైసీపీ కావాలో..మానవత్వంతో పనిచేసే కూటమి ప్రభుత్వం కొనసాగాలో ప్రజలు బేరీజు వేసుకోవాలి. జగన్‌కు ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా తీర్పునిచ్చినా ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకోకుండా ఇంకా తప్పిదాలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వాన్ని మరో 15 ఏళ్లు కాపాడుకో వాల్సిన బాధ్యత ప్రజలపై ఉంది. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే దుష్టశక్తిగా వైసీపీ తయారైంది. వైసీపీ అనుకూల మీడియా అసత్య కథనాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోంది. మాయమాటలు నమ్మితే రాష్ట్ర అభివృద్ధికి ముప్పు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.



# జీవనోపాధికి ఆర్థిక భద్రత

**సామాజిక పింఛన్ల పంపిణీలో మంత్రి పార్థసారథి**





ఏలూరు/ నూజివీడు (చైతన్య రథం): నూజివీడు మండలం సుంకొల్లు ముక్కెళ్లపాడు గ్రామంలో శనివారం నిరుపేదల సేవలో భాగంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను గృహ నిర్మాణమంత్రి కొలుసు పార్థసారథి పంపిణీ చేశారు. తొలుత గ్రామస్తులు మంత్రికి ఘనస్వాగతం పలికారు. మంగళహారతులిచ్చి నుదుటిన తిలకం దిద్దారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు బడుగు, బలహీన వర్గాలు జీవనోపాధికి ఆర్థిక భద్రత కల్పించే సంక్షేమ పథకమన్నారు. జిల్లాలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు 2,57,658మందికి రూ 113.09 కోట్ల రూపాయిలు పంపిణీకి అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. పెన్షన్లు లబ్ధిదారులు సమాజంలో చిరునవ్వులతో జీవిస్తూ రేపటి అవసరాలుకు కొంత సొమ్ము పొదుపు చేసుకోవాలని సూచించారు. మార్చి 1 సెలవు దినం కావడంతో.. లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందులు పడకూడదని ఒక రోజు ముందుగానే పింఛన్ల సొమ్ము పంపిణీకి కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం దశలువారీగా కాకుండా ఒకేసారి పెంచి, మూడు నెలలు ఏరియర్స్ కలిపి ఒకేసారి పంపిణీ చేశామని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వ పాలనలో మంచానపడిన బాధితులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కుల వృత్తిదారులు, ఇతర చేనేత, మత్స్యకార బలహీనవర్గాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామన్నారు. సామాజిక రక్షణ బలోపేతం కావాలని ఉద్దేశంతో పింఛన్లపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు జి బద్రు, యంపిడివో సిహెచ్ రాఘవేంద్రనాథ్, వివిధ శాఖలు అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల ప్రముఖులు, కూటమి నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కఠిన వైఖరి కారణంగా 'విలన్'గా చూస్తున్నారు

- **ఆరోగ్య వ్యవస్థను గాడిన పెట్టేందుకు తప్పదన్న వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్**
- **మరో రెండేళ్లల్లో పూర్తిస్థాయి ఫలితాలు**
- **సీఎం చంద్రబాబుతో పనిచేయడం నిరంతర అభ్యాసం**

అమరావతి (చైతన్యరథం): 'గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో గాడి తప్పిన ప్రజారోగ్య వ్యవస్థను తిరిగి పట్టాలెక్కించేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా పలు అంశాలపై కఠిన వైఖరి అవలంబిస్తున్నందున తనను సంబంధిత వర్గాల్లో 'విలన్'గా చూస్తున్నారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. అయినా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశయాలు, ఆలోచనలకు అనుగుణంగా మార్పు కోసం నిరంతరం కృషి చేస్తున్నానని, ఇందులో భాగంగా తనను 'పాపాల భైరవుని'గా చిత్రీకరించినా ఇబ్బందిపడబోనని మంత్రి చమత్కరించారు. దార్శనికుడు, నిత్య కృషీవలుడైన ముఖ్యమంత్రి నాయకత్వంలో పనిచేయడం 'నిరంతర అభ్యాస ప్రక్రియ' అని... అందుకు తానెంతగానో గర్వపడుతున్నానన్నారు. ఆయన ఆలోచనల మేరకు వ్యవస్థలో మార్పు తేగలిగితే తన పదవికి న్యాయం చేసినట్టు భావిస్తానని మంత్రి అన్నారు.

ఆంగ్ల దిన పత్రిక 'న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్' నిర్వహించిన 'ఏపీ డయలాగ్స్' మొదటి చర్చలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రజారోగ్య రంగానికి సంబంధించిన పలు అంశాలపై స్పష్టమైన అభిప్రాయాల్ని వెలిబుచ్చారు.

## కఠిన వైఖరికి కారణాలు

గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా వచ్చిన పలు సమస్యలను మంత్రి వివరించారు. పాలనా లోపం, నియంత్రణా చర్యల రాహిత్యం కారణంగా సిబ్బంది విధులకు రాకపోవడం, ఏళ్ల తరబడి గైర్హాజరు, ఓపీ, ఐపీ సేవలు తగ్గడం, పరికరాల నిరుపయోగం, నిర్ణయాల్లో పారదర్శకత లోపించడం నెలకొన్నాయని... వీటిని చక్కదిద్దడానికి కొంత కఠిన వైఖరి తప్పదని మంత్రి వివరించారు. మొదటిసారిగా సాయంత్రపు ఓపీ సేవల్ని ప్రవేశపెట్టడంతో రోగులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు పరిశీలనలోకి వచ్చిన 100కు పైగా కేసుల్లో శిక్షల తీవ్రతను ప్రతిపాదనల కంటే పెంచామ న్నారు. ఈ అనారోగ్య వైఖరికి అడ్డుకట్ట వేసేందుకు ఇంకా కఠిన చర్యలకు పూనుకుంటామని స్పష్టం చేశారు.

## విధుల నుంచి తొలగింపు (టెర్మినేషన్)

దీర్ఘకాలికంగా విధులకు హాజరుకాని దాదాపు 200 మంది వైద్యులకు నోటీసులిచ్చామని, నిర్దేశిత సమయంలో విధుల్లో చేరి గైర్హాజరుకు సహేతుక కారణాలు చూపకపోతే విధుల నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు.

## రాజకీయ జోక్యానికి ఫుల్ స్టాప్

వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ జోక్యం, అవినీతి నియామకాలు, పోస్టింగ్‌లు, బదిలీలు, పదోన్నతులు జరిగాయి. కూటమి హయాంలో దీన్ని పూర్తిగా నిర్మూలించాము. గతంలో సాధారణ బదిలీల్లో స్టేషన్ సీనియారిటీ ప్రాతిపదికన తప్పనిసరిగా బదిలీ అయినా వారిలో కొన్ని నెలల్లోనే తిరిగి ఆయా ప్రదేశాలకు మార్చాము. 2025 మే, జూన్ నెలల్లో జరిగిన దాదాపు 25,000 బదిలీల్లో అందరూ కొత్త చోట్ల విధులు నిర్వర్తించేలా చర్యలు చేపట్టామన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డాక్టర్లు సహా 3,7 34 నియామకాలు, 4,891 పదోన్నతులు జరిగాయి. మరిన్ని నియామకాలకు ప్రక్రియ సాగుతోంది. వీటిల్లో ఒక్కో సందర్భంలో కూడా రాజకీయ సిఫారసులు, జోక్యం జరగలేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం బదిలీలపై నిషేధం కారణంగా కేవలం స్పౌజ్ (భార్యాభర్తలైన వైద్యులు ఒకేచోట ఉండేలా), తీవ్ర అనారోగ్య కారణాలకు మాత్రమే బదిలీలను అనుమతిస్తున్నామని వివరించారు.

## జగన్‌రెడ్డి మాటలు, చేతల్లో భారీ వ్యత్యాసం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్య రంగాన్ని కొత్త పుంతలు తొక్కించామని చెప్పుకుంటున్న అంశంపై సవివరంగా వాస్తవ పరిస్థితి మంత్రి వివరించారు.

రూ.16వేల కోట్లకు పైగా అంచనాతో చేపట్టిన 'నాడు-నేడు' పథకం విషయంలో కేవలం 24 శాతం



మాత్రమే ఖర్చు చేసి సమగ్ర మార్పులు చేశామని చెప్పుకోవడాన్ని మంత్రి ఎద్దేవా చేశారు. రూ.8,480 కోట్లతో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలకు నూతన భవనాలను నిర్మించామని ప్రగల్భాలు పలికారని, కేవలం రూ.1500 కోట్లు మాత్రమే వెచ్చించి వాస్తవాల్ని మరుగున పెట్టడం సబబేనా అని మంత్రి సూటిగా ప్రశ్నించారు. జీరో వేకెన్సీ విధానంలో ఖాళీలన్నీ భర్తీ చేశామంటున్న మాజీ సీఎం జగన్‌రెడ్డి పదవి నుంచి వైదొలిగే నాటికి దాదాపు 15వేల ఖాళీలున్నాయని తెలిపారు. పలు ప్రభుత్వాసుపత్రుల అభివృద్ధి పనులు అరకొరగా సాగాయని, ఇది సమగ్ర మార్పునకు తార్కాణమా అని మంత్రి ప్రశ్నించారు. 'నేను అనుకున్నాను కదా...అన్నీ అయిపోయినట్టే' అనే వికృత మానసిక ఆలోచనతో జగన్‌రెడ్డి ఉన్నారని మంత్రి ఎద్దేవా చేశారు.

భారీ స్థాయిలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లకు గ్రామ స్థాయిలో భవన నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వ సాయం లభిస్తున్నా ఇంకా 4,500 భవనాలు నిర్మించాల్సి ఉందని... ఈ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, సెకండరీ ఆసుపత్రుల స్థాయి పెంచే విషయంలో జగన్ ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. బోధనాసుపత్రుల అభివృద్ధి నిధుల్ని దారి మళ్లించిందని మంత్రి తీవ్రంగా విమర్శించారు.

ప్రజలకెంతో ఉపయోగపడే డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద రూ.2,500 కోట్లు, మందుల సరఫరాకు సంబంధించి మరో రూ.600 కోట్ల బకాయిలు పెట్టడం జగన్ ఘనతకు నిదర్శనాలు కావా అని మంత్రి ఎద్దేవా చేశారు.

## పీపీపీ విధానం-జగన్ బెదిరింపులు

పీపీపీని ప్రోత్సహించడం ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ విధానమని, దీనికనుగుణంగానే వైద్య రంగంలో 10 ప్రభుత్వ వైద్య కళాశాలల అభివృద్ధికి చర్యలు చేపట్టామని మంత్రి స్పందించారు. ఈ దిశగా చేపట్టిన ఆదోని, మార్కాపురం, మదనపల్లె, పులివెందుల కాలేజీల నిర్మాణానికి తగు స్పందన రాకపోడానికి జగన్ రెడ్డి బెదిరింపు ఏమాత్రం కారణం కాదని మంత్రి స్పష్టం చేశారు. పీపీపీ విధానంలో మొదటి నాలుగు కాలేజీలకు సంబంధించి టెండరింగ్ ప్రక్రియ జరుగుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం 20 శాతం నుంచి 30 శాతం వరకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) సాయం అందించడంపై వార్తలొచ్చాయని, దీంతో ఆసక్తిదారులు పునరాలోచనలో పడ్డారని మంత్రి వివరించారు. ఈ సాయంపై కేంద్రంతో చర్చిస్తున్నామన్నారు.

## చంద్రబాబుతో పనిచేయడం-నిరంతరం నేర్చుకోవడం

దార్శనికుడు, నిరంతర కృషీవలుడైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో పనిచేయడం నిరంతర జ్ఞాన సముపార్జన వంటిదని, ప్రతి సమావేశంలోనూ కొత్త విషయాలు, ఆలోచనా తీరు అవగతమవుతాయని మంత్రి తెలిపారు. 'ఏదైనా విషయంపై ప్రశ్నిస్తే...ఆ ప్రశ్న ముందుగానే తెలిసినట్లు ఆయన సమాధానమిస్తారని'అన్నారు. ముఖ్యమంత్రి దార్శనికత వల్లే ప్రజారోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం జరిగిందని, జబ్బులకు వైద్యాన్ని అందించే విధానం నుంచి జబ్బుల్ని నివారించి, ముందుగానే హెచ్చరించి, తీసుకోవాల్సిన వైద్యం, జాగ్రత్తలపై వ్యక్తి స్థాయిలో సలహాలందించే దిశగా నడుస్తున్నామన్నారు.

## కూటమి సజావుగా ముందుకు సాగుతోంది

మూడు పార్టీల కూటమి పాలన సజావుగా సాగుతోందని, ఎటువంటి ఇబ్బందుల్లేవని స్పష్టం చేశారు. అవకాశాలు, ఆశావహుల మధ్య ఎప్పుడూ అంతరముంటుందని, వీలైనంత వరకు అందరికీ నామినేటెడ్ పదవులను సీఎం కల్పిస్తున్నారన్నారు.

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సాయిప్రసాద్

- సచివాలయంలో బాధ్యతల స్వీకరణ
- కె.విజయానంద్ పదవీ విరమణ
- అధికారులు, ఉద్యోగుల శుభాకాంక్షలు



అమరావతి(చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా జి.సాయిప్రసాద్ శనివారం సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సీఎస్‌గా పనిచేసిన కె.విజయానంద్ శనివారం పదవీ విరమణ చేశారు. ఆయన నుంచి సాయిప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ముందుగా తిరుమల తిరుపతి దేవస్థానం, విజయవాడ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానాల వేద పండితుల ఆశీర్వచనాల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమం అనంతరం ఉదయం 11.33 గంటలకు ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఎస్.ఎస్.రావత్, యం.టి. కృష్ణబాబు, ఎక్స్ అఫిషియో స్పెషల్ సీఎస్ బి.రాజశేఖర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు శ్యామలరావు, ముఖేశ్ కుమార్ మీనా, కాంతిలాల్ దండే తదితర ముఖ్య కార్యద ర్శులు, ఎస్.సత్య నారాయణ, ఎంఎం నాయక్, ప్రతిభాదేవి తదిత ర కార్యదర్శులు, వివిధ శాఖాధిపతులు, సచివాలయ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాష్ట్ర 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ సహా వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఆయన 1991 ఐఏఎస్ బ్యాచ్ ఏపీ క్యాడర్‌కు చెందిన వారు.

## చర్చ నుంచి తప్పించుకున్నా..
# దేవుడి నుంచి తప్పించుకోలేరు

- కల్తీ నెయ్యిపై వైసీపీ దాగుడుమూతలు
- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి
- దావగూడూరులో పింఛన్ల పంపిణీ

కొండపి(చైతన్యరథం): కల్తీ నెయ్యిపై చర్చకు రాకుండా వైసీపీ పారిపోతోంది..చర్చ జరగకుండా సభ నుంచి తప్పించు కున్నా.. చేసిన తప్పులకు దేవుడి నుంచి తప్పించుకోలేరని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి హితవుపలికారు. జరుగుమల్లి మండలం దావగూడురులో శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాసుల కక్కుర్తితో లడ్డూలు కల్తీ చేసి హిందువుల మనోభావాలు తీవ్రంగా గాయపరిచారని మండిప డ్డారు. భగవంతుడికి కొట్టే కొబ్బరికాయ కుళ్లిపోతేనే భక్తులు బాధపడతారు. అలాంటిది దేవాదిదేవుడికి నైవేద్యంగా పెట్టే లడ్డూ లను కల్తీ చేశారంటే వీరిని ఏమనాలి? జగన్‌కి హిందూ ధర్మం పట్ల ఏ మాత్రం విశ్వాసం లేదు. కడప జిల్లాలో విగ్రహ ప్రతిష్ఠకు వెళ్లిన జగన్ తీర్థం ఇస్తే కింద పడేశారు. తీర్థం స్వీకరించడానికి ఇష్టపడని జగన్ విగ్రహ ప్రతిష్ఠకు వెళ్లడం దేనికి? అని



ప్రశ్నిం చారు. దేశంలోనే పెద్ద మొత్తం లో సామాజిక భద్రత పింఛన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలిపారు. చెప్పిన మాట ప్రకారం వృద్ధులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు దీర్ఘ కాలిక వ్యాధిగ్రస్తులకు రూ.15 వేలు ఇస్తున్నాం. పింఛన్ రూ.4 వేలకు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుదే. పింఛన్ల పెంపుపై మాట తప్పి వృద్ధులను సైతం మోసం చేసిన ఘనుడు జగన్.

## టెక్కలిలో మంత్రి అచ్చెన్నాయుడు పర్యటన

**పింఛన్ల పంపిణీ, అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

కోటబొమ్మాళి/టెక్కలి(చైతన్యరథం): టెక్కలి నియోజకవర్గంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం పర్యటించారు. పట్టుపురం గ్రామంలో ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీ పంపిణీ చేశారు. అనంతరం రూ.1.63 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలలో 99% పూర్తి చేశాం. సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు రాష్ట్రంలో 6 వేల సెల్ టవర్లు ఏర్పాటు చేశారు. అర్హులైన పేదలందరికీ పక్కా ఇళ్లు లక్ష్యంగా 2029 నాటికి 18 లక్షల ఇళ్లు నిర్మాణం లక్ష్యంగా పనిచేస్తున్నాం. టీడీపీ హయాంలో మంజూరైన ఇళ్ల బిల్లులు త్వరలో చెల్లిస్తామని తెలిపారు. వైసీపీ పాలనలో పాడి పరిశ్రమ నిర్వీర్యం అయిందని తెలిపారు. అనంతరం "మినీ గోకులం" షెడ్డును ప్రారంభించారు.



# ఐదేళ్లూ మొద్దునిద్ర..ఇప్పుడు నీతులా?

- రాష్ట్రాన్ని 'అనారోగ్య ఆంధ్రప్రదేశ్'గా మార్చారు
- వైసీపీ పాలనలో రోగుల ప్రాణాలు తీశారు
- నాడు బాధితులు ఎవరినైనా పరామర్శించారా?
- కుట్రలు, కుతంత్రాలకు కేరాఫ్ జగన్
- నేడు తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటున్నాం
- ఏపీడబ్ల్యూసీఎఫ్‌సీ చైర్మన్ పీతల సుజాత

మంగళగిరి(చైతన్యరథం): వైసీపీ అంటేనే కుట్రలు, కుతంత్రా లకు కేరాఫ్ అడ్రస్ అని మాజీ మంత్రి, ఏపీ డబ్ల్యూసీఎఫ్‌సీ చైర్మన్ పీతల సుజాత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసి ఇంట్లో కూర్చోబెట్టినా జగన్‌రెడ్డి, ఆ పార్టీ ఎమ్మె ల్యేలలో మార్పు రాలేదని విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాల యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ చట్టసభలకు వచ్చి ప్రజల పక్షాన నిలబడే ధైర్యం లేని వైసీపీ నేత లు బయట కూర్చుని దేవాలయాలపై, కల్తీ నెయ్యిపై విషప్రచారం చేయడం సిగ్గుచేటు. ప్రజారోగ్యం విషయంలో కూడా తమ పత్రికల్లో తప్పుడు వార్తలు రాస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నా రు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు.

### ఆ కుటుంబాలను పరామర్శించారా?

జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రం వింత వ్యాధుల కు నిలయంగా మారింది. ఏలూరులో వాటర్ కంటామినేషన్ వల్ల వందలాది మంది ఆసుపత్రి పాలైతే మీరు తీసుకున్న చర్యలేమిటి? జంగారెడ్డిగూడెంలో మీ వారు అమ్మిన కల్తీ సారా తాగి 25 మంది ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబాలను పరామర్శించారా? మీ పాలనలో నంద్యాల, రామతీర్థం, కాకినాడ వంటి ప్రాంతాల్లో అతిసారం ప్రబలి జనం పిట్టల్లా రాలిపోయారు. రాజమండ్రిలో అప్పటి ఎంపీ భరత్‌ని ప్రజలు నిలదీసి "చీరలు వద్దు.. తాగడానికి మంచి నీళ్లు ఇవ్వండి మహాప్రభూ" అని వేడుకున్న పరిస్థితిని రాష్ట్రం మర్చిపోలేదు. ఆదివాసీ గ్రామాల్లో ఫుడ్ పాయిజన్ జరిగి ప్రజలు అల్లాడిపోతుంటే మీరు తాడేపల్లి ప్యాలెస్‌లో మొద్దు నిద్ర పోయారు తప్ప, ఏనాడైనా బాధితులకు ధైర్యం చెప్పారా? అని ప్రశ్నించారు. మీ సాక్షి పత్రిక, ఛానల్‌లో అబద్ధాలు ప్రచారం చేస్తే జనం నమ్మేస్తారనుకుంటున్నారా? మీ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజ ల ప్రాణాలను గాలికి వదిలేసిన పాపం మీదని ధ్వజమెత్తారు.

### మీ పాపాలను ప్రజలు మరువరు

గత ప్రభుత్వంలో ఆసుపత్రుల్లో పేషెంట్ల వేళ్లను ఎలుకలు కొరి కేస్తుంటే రక్తం ఓడుతున్న శరీరాలతో రోగులు భయంతో పారిపో యిన దారుణాలను ఈ రాష్ట్రం ఎప్పటికీ మర్చిపోదు. సంక్షేమ హాస్టళ్లలో పాములు, ఎలుకల మధ్య విద్యార్థులు బిక్కుబిక్కుమం టూ గడిపిన రోజులు మీ పాలనలో లేవా? మీ టైంలో కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లిన పాపాన పోలేదు. కోవిడ్ వస్తే "పారాసిట మాల్ వేసుకోండి" అని వెటకారంగా మాట్లాడి లక్షలాది మంది ప్రాణాలతో చెలగాటమాడారు. లక్ష మంది చనిపోతే తప్పుడు లెక్క లతో కప్పిపుచ్చారు. ఆఖరికి ఆసుపత్రుల్లో కరెంట్ లేక టార్చ్ లైట్ల వెలుగులో ఆపరేషన్లు చేసిన ఘనత మీది కాదా? అరబిందో వంటి అనుభవం లేని సంస్థలకు టెండర్లు కట్టబెట్టి 108 వ్యవస్థను భ్రష్టు పట్టించారు. గంటల తరబడి అంబులెన్స్ రాక 'గోల్డెన్ అవర్'లో ప్రాణాలు కోల్పోయిన వేలాది మందికి మీరేం సమాధానం చెబుతారు? అంబులెన్స్‌లు పాడైపోయి మూలన పడితే పట్టించు కోని మీరు..ఈరోజు కూటమి ప్రభుత్వంపై అబద్ధాలతో బురద జల్లితే ప్రజలు నమ్మరని హితవుపలికారు.



### దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా జగన్ మాటలు

దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు ఈరోజు జగన్ మాట్లాడటం హాస్యాస్పదం. మా కూటమి ప్రభుత్వంలో ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే ముఖ్యమంత్రి సమీక్షలు నిర్వహించి మంత్రులను, అధికా రులను క్షేత్రస్థాయికి పంపిస్తున్నారు. బాధితులకు అండగా ఉంటూ తక్షణ సాయం అందిస్తూ ప్రజల్లో భరోసా కల్పిస్తున్నాం. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే 190 కొత్త అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చాం. ఫోన్ చేసిన వెంటనే పట్టణాల్లో 18 నిమిషాలు, గ్రామాల్లో 23 నిమిషాల్లో అంబులెన్స్ చేరుకునేలా చర్యలు తీసుకున్నాం. ప్రజల ప్రాణాలను కాపాడటమే మా మొద టి ప్రాధాన్యత. గతంలో 104 వాహనాల్లో కేవలం షుగర్, బీపీ పరీక్షలు మాత్రమే చేసేవారు. కానీ నేడు దేశంలోనే మొదటిసారిగా 47 రకాల డయాగ్నోస్టిక్ పరీక్షలను నేరుగా మీ ఇంటి వద్దకే వచ్చి చేస్తున్నాం. సీబీసీ, లివర్ టెస్టులు, లిపిడ్ ప్రొఫైల్, కిడ్నీ పరీక్షలు (ఆర్‌ఎఫ్‌టీ) వంటి 20 సాధారణ పరీక్షలతో పాటు మరో 27 ప్రత్యేక పరీక్షలను గ్రామాల్లోనే నిర్వహిస్తున్నాం. ప్రతిఒక్కరి ఆరో గ్య సమాచారాన్ని డిజిటలైజ్ చేసి భవిష్యత్తులో వచ్చే వ్యాధులను అంచనా వేసేలా అత్యాధునిక విధానాన్ని ప్రవేశపెటామని తెలిపారు.

### ఏ ఘటన జరిగినా ప్రభుత్వం స్పందిస్తోంది

వైసీపీ హయాంలో రాష్ట్రాన్ని 'అనారోగ్య ఆంధ్రప్రదేశ్'గా మార్చి వెళ్లారు. చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్'గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళుతోందని తెలిపారు. కల్తీ పాల ఘటన వెలుగులోకి వచ్చిన గంట ల్లోనే మా ప్రభుత్వం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసింది. బాధితులను వెంటనే ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు తరలించి వారికి అవసరమైన వెయ్యి రకాల టెస్టులు, డయాలసిస్, ఆఖరికి వెంటిలేటర్ సాయం కూడా ప్రభుత్వ ఖర్చులతోనే అందిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా డెయిరీలపై ఆకస్మిక తనిఖీలు చేయించి కల్తీకి పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకున్నాం. బాధి తులకు తక్షణ ఆర్థిక సాయం కూడా ప్రకటించాం. శ్రీకాకుళంలో డయేరియా ప్రబలినప్పుడు మంత్రి నారాయణ, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. నిర్లక్ష్యం వహించిన మున్సిపల్ కమిషనర్‌ను వెంటనే సస్పెండ్ చేశాం. 50 మెడికల్ టీములతో ఇంటింటా సర్వే చేయించి, మృతి చెందిన కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించాం. ఇది మా ప్రభుత్వానికి ప్రజల ప్రాణాల పట్ల ఉన్న చిత్తశుద్ధి. ప్రజారోగ్య పరిరక్షణే మా కూటమి ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం. ఎక్కడ ఏ చిన్న సమస్య వచ్చినా మా మంత్రులు, అధికారులు యుద్ధ ప్రాతిపదికన స్పందిస్తారు. ప్రజలకు రక్షణగా ఉండటంలో మా ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని స్పష్టం చేశారు.

# ఒకరోజు ముందే పింఛన్లతో పండుగ

**- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**
**- వేల్పులగుంటలో లబ్ధిదారులకు పంపిణీ**
**- అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపనలు**



ఆత్మకూరు/నెల్లూరు(చైతన్యరథం): ప్రతినెలా క్రమం తప్పకుం డా కోట్లాది రూపాయలతో పంపిణీ చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదల కళ్లల్లో ఆనందాన్ని నింపుతున్నాయని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం అనుమసముద్రంపేట మండలం వేల్పులగుంట గ్రామంలో ఎన్టీఆ ర్ భరోసా సామాజిక పింఛన్లను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. ఒకటో తేదీ ఆదివారం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఒక రోజు ముందుగానే పింఛన్ల పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్రంలో 62.76 లక్షల మంది లబ్ధిదారులకు ప్రతినెలా రూ. 2,725 కోట్లను ఇంటి వద్దకే అందిస్తున్నామని తెలిపారు. నెల్లూరు జిల్లాలో 2,89,674 మందికి సుమారు రూ.127 కోట్ల పింఛన్లు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. గ్రామంలో రూ.11 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించడంతో పాటు రూ.2 లక్షలతో కొత్త రోడ్లకు శంకుస్థాపన చేశారు. రూ.31.60 లక్షల జేజేఎం నిధులతో రక్షిత మంచినీటి పథకానికి శంకుస్థాపన చేశారు. మండలంలోని చివరి గ్రామమైన వేల్పులగుంటకు సోమ శిల ఉత్తర కాలవ ద్వారా లిఫ్ట్ ఇరిగేషన్ పథకం అమలు చేసి వెయ్యి ఎకరాలకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

వేల్పులగుంట ఎస్సీ కాలనీలో శ్రీవాణి నిధులతో నిర్మించనున్న వినాయకస్వామి దేవస్థానానికి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాగరాజా కుమారి, ఆర్డీవో పావని, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# శింగరకొండ తిరునాళ్లు ప్రారంభం

**- దర్శించుకున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్**
**- ప్రసన్నాంజనేయునికి పట్టువస్త్రాల సమర్పణ**



అద్దంకి(చైతన్యరథం): శింగరకొండలో కొలువుదీరిన ప్రసన్నాం జనేయ స్వామి వారి దేవస్థానం 71వ వార్షికోత్సవ తిరునాళ్లు ప్రారంభం సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకో వాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. తాగునీరు, క్యూ లైన్లు, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్ సరఫరాతో పాటు అన్నీ సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. తిరునాళ్లు ప్రశాంత వాతా వరణంలో విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. అదే విధంగా శింగరకొండపై వేంచేసి ఉన్న లక్ష్మీ నరసింహ స్వామికి కూడా పట్టు వస్త్రాలు సమర్పించారు.

**విద్యార్థులకు ఉచితంగా 8 వేల సైకిళ్ల పంపిణీ పూర్తి**

నియోజవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8 వేల మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ పూర్తి చేసినట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. సంతమాగులూరు మండలం ఏల్చూరులో శనివారం మంత్రి గొట్టిపాటి పర్యటించారు. ఏల్చూరు ఉన్నత పాఠశాలలో 454 మంది విద్యార్థులకు ఆయన సైకిళ్లను అందజేశారు. పాఠశాల విద్యార్థులతో పాటు కొందరు ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ చదివే పేద విద్యార్థులకు కూడా దాతల సహా యంతో సైకిళ్లను పంపిణీ చేశామని చెప్పారు. అద్దంకి నియోజక వర్గంలో మరో 3 వేలు సైకిళ్లు ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందించాల్సి ఉందని తెలిపారు. వాటిని కూడా మార్చి నెలాఖరు, విద్యా సంవత్సరం పూర్తయ్యే నాటికి పంపిణీ చేస్తామని మంత్రి గొట్టిపాటి ప్రకటించారు.

# సీమ ప్రజలకు వెన్నుపోటు పొడిచింది జగన్‌రెడ్డే

- **ఐదేళ్లూ ఆ ప్రాంతానికి అన్యాయం చేశారు**
- **నేడు సీమ అభివృద్ధిపై చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం**
- **కల్తీ నెయ్యిపై చర్చకు రాకుండా పారిపోతున్నారు**
- **ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి**



బనగానపల్లె(చైతన్యరథం): వైసీపీలా మాది మాటల ప్రభుత్వం కాదు..చేతల ప్రభుత్వమని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్పష్టం చేశా రు. బనగానపల్లెలో పింఛన్ల పంపిణీ అనంతరం మీడియాతో మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు రాయలసీమ అభివృద్ధిని వైసీపీ పట్టించుకోలేదు. నాడు అభివృద్ధి చేయడం చేతకాక నేడు సీమలో ఉద్యమం పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారు. గతంలో రాయలసీమలో సాగునీరు అందించే కాలువలను బాగు చేసిన పరిస్థితి కూడా లేదు. రాజకీయ నిరుద్యోగులు..ఉనికి కోసం సీమ ప్రజలను రెచ్చగొడుతున్నారు. గతంలో రాయలసీమలో వైసీపీకి అత్యధిక సీట్లు ఇస్తే సీమ అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలి. రాయ లసీమకు అధికారంలో ఉన్నప్పుడు ఏమి చేయకపోవడం వల్లే మీకు.. సీమలో కేవలం 6 సీట్లకే పరిమితమయ్యారని మండిప డ్డారు. తిరుమలలో లడ్డు కల్తీపై చర్చకు సిద్ధంగా ఉన్నాం. తిరుమల వెంకటేశ్వరుని స్వామి ప్రతిష్టను వైసీపీ అండ్ కో బజారుకు లాగారు. హిందూమతం, హిందువుల మనోభావాలపై వైసీపీకి ఏ మాత్రం గౌరవం లేదు. తిరుమలలో అంశంపై అసెంబ్లీలో చర్చకు రమ్మంటే పారిపోతున్నారు. వెంకటేశ్వర స్వామితో పెట్టుకోవడం వల్లే 150 సీట్ల నుంచి 11 సీట్లకు పరిమితమయ్యారు. ఇదే వ్యవహార శైలి కొనసాగితే సింగిల్ డిజిట్‌కు పరిమితమవు తారు. కల్తీ లడ్డుపై అసెంబ్లీలో చర్చకు రాకుండా పారిపోవడం, ధర్నాలు చేస్తూ రాజకీయ డ్రామా ఆడుతున్నారు. కరపత్రికను అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తు న్నారని ధ్వజమెత్తారు. బనగానపల్లెను రాష్ట్రంలో మోడల్ నియో జకవర్గంగా తీర్చిదిద్దుతున్నాం. జీఎన్ఎస్ఎస్, దద్దనాల లిఫ్ట్ ఇరిగేషన్ వంటి పథకాలను వైసీపీ నిర్వీర్యం చేసింది. నా సొంత నిధులు రూ.27 లక్షలతో దద్దనాల ప్రాజెక్టును తిరిగి పునరుద్ధ రించాను. మాజీ ఎమ్మెల్యేకి ఛాలెంజ్ చేస్తున్నా.. ఎవరి హయాంలో బనగానపల్లిలో అభివృద్ధి జరిగిందో చర్చకి సిద్ధమని సవాల్ విసిరారు.

# సంగమేశ్వరం రిజర్వాయర్‌కు రూ.166 కోట్లు

**- రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు**
**- సీఎం చంద్రబాబుకు మంత్రి స్వామి కృతజ్ఞతలు**



కొండపి (చైతన్యరథం): సంగమేశ్వరం రిజర్వాయర్ నిర్మాణ పనుల కోసం రూ.166.40 కోట్లు విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసినందుకు రాష్ట్ర సాంఘి క సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ముఖ్యమం త్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రకాశం జిల్లా పొన్న లూరు మండలం చెన్నిపాడు గ్రామం సంగమేశ్వర దేవాలయం సమీపంలో పాలేరు నదిపై రిజర్వాయర్ నిర్మాణ పనుల కోసం సాస్కి నిధులు రూ.166.40 కోట్లకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నిమ్మల రామానాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ సంగమేశ్వరం రిజర్వాయర్ ద్వారా కొండపి నియోజకవర్గంలో 9500 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణతో పాటు 60 గ్రామాలకు తాగునీరు అందుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే 2026 – 27 బడ్జెట్‌లో ఈ రిజర్వాయర్‌కి రూ.25 కోట్లు కేటాయించిందని చెప్పారు. వైసీపీ హయాంలో ఈ రిజర్వాయర్‌ను పట్టించుకున్న పాపానపోలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో రిజర్వాయర్‌ను పూర్తి చేసి కొండపి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని తెలిపారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఘన స్వాగతం



రేణిగుంట (చైతన్యరథం): తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం శనివారం రాత్రి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌కు ఘన స్వాగతం లభించింది. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్, చిత్తూరు జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ నినాల జయసూర్య, ఏపీ ఉన్నత న్యాయస్థానం న్యాయమూ ర్తి, జస్టిస్ డొనాది రమేష్, ఏపీ ఉన్నత న్యాయస్థానం న్యాయమూ ర్తి జస్టిస్ మహేశ్వరరావు కుంచెం, ఉన్నత న్యాయస్థానం న్యాయ మూర్తి జస్టిస్ టి.సి.డి.శేఖర్, డీఐజీ షిమోజిబాయ్, చిత్తూరు జిల్లా ఉమ్మడి డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ జడ్జి అరుణ సారిక, అడిషనల్ జిల్లా జడ్జి గురునాధం, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

**నేటి కార్యక్రమాలు**

తిరుపతిలో ఆదివారం ఆయన కోర్టు భవనాలకు శంకుస్థాపన చేస్తారు. అమరావతిలో జ్యుడీషియల్ అకాడమీ భవనం, హైకోర్టు అతిథి గృహభవనానికి శంకుస్థాపన చేయనున్నారు. అలాగే న్యాయమూర్తుల నివాస గృహాలను ప్రారంభించనున్నారు. సాయం త్రం విజయవాడలో ఆర్బిట్రేషన్ సదస్సులో పాల్గొననున్నారు.

## హైకోర్టుకు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తి!

**కేంద్రానికి సిఫారు చేసిన కొలీజియం**



అమరావతి(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ రానున్నారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలో గురువారం సమావేశమైన కొలీజియం ఆమె పేరును కేంద్రానికి సిఫారు చేసింది. ఈ ప్రతిపాదనను రాష్ట్రపతి ఆమోదముద్ర వేస్తే ఏపీ హైకోర్టు తొలి మహిళ ప్రధాన న్యాయమూర్తిగా ఆమె రానున్నారు. హైకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్ పదవీకాలం ఏప్రిల్ 24తో మొగియనుంది. ఈ నేపథ్యంలో రెండు నెలల ముందుగానే లిసా గిల్‌ను న్యాయమూర్తిగా ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలని కొలీజియం నిర్ణయించింది. ధీరజ్‌సింగ్ ఠూకూర్ వైదొలిగిన మరుసటిరోజు నుంచే గిల్‌ను సీజేగా ప్రతిపాదిస్తూ సిఫార్సు చేసింది. ప్రస్తుతం ఆమె పంజాబ్–హరియాణా హైకోర్టులో సేవలందిస్తున్నారు. అక్కడ సీనియారిటీ పరంగా మూడో స్థానంలో ఉన్నారు. స్వస్థలం చండీగడ్. అక్కడి కార్మెల్ కాన్వెంట్ స్కూల్ పాఠశాల విద్య ప్రభుత్వ మహిళా కాలేజీలో 'హ్యూమాని టీస్‌లో డిగ్రీ చదివారు. పంజాబ్ యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ, ఎఎల్ఎం పూర్తిచేశాడు. 1990లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకొని పంజాబ్–హరియాణా హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించా రు. సుదీర్ఘకాలం చండీగడ్‌కు, పలు ప్రభుత్వరంగ బోర్డులకు, కార్పొరేషన్లకు ప్రాతినిధ్యం వహించారు. 2014 మార్చి 31న పం జాబ్–హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితు లయ్యా రు.

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల పదవుల భర్తీలో సీజే జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కాలీజియం కొత్త సంప్ర దాయానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుత సీజే పదవీవిరమణ కాలం ముగియడానికి 2 నెలలు ముందే స్థానంలోకి కొత్త న్యాయమూర్తిని ప్రతిపాదించాలని నిర్ణయించింది. న్యాయ పరిపాలన వ్యవస్థను బలోపేతం చేసి దాని సామర్థ్యం. నాణ్యతను మొచడానికి ఈ విధాన నిర్ణయం తీసుకున్నట్లు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. అందులో భాగంగా నీవేగా ప్రతిపాదించిన వారికి 2 నెలల ముందుగానే సంబంధిత హైకోర్టుకు బదిలీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది. దీనివల్ల సీజేగా బాధ్యతలు చేపట్టేలోపు ఆ హైకోర్టు వాతావరణానికి అలవాటుపడటానికి వీలవుతుందని పేర్కొంది. ఇందులో భాగంగానే జస్టిస్ గిల్ మొదట ఏపీ హైకోర్టుకు న్యాయమూర్తిగా బదిలీ చేసి, ప్రస్తుత సీజే పదవీ విరమణ చేశాక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టేందుకు వీలు కల్పిస్తున్నట్లు వెల్లడించింది. మరోవైపు ఏపీ హైకోర్టు ప్రస్తుత జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ పదోన్నతిపై సుప్రీంకో ర్టు న్యాయమూర్తిగా వెళ్లే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. ఒకవేళ ఆయన అలా వెళ్తే ఆ స్థానంలో జస్టిన్ గిల్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్లతో పించనుదారులకు గౌరవం : మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి



పాడేరు (చైతన్యరథం): ఎన్టీఆర్ భరోసా పెన్షన్లతో వితంతువులు, వృద్ధులు, వికలాంగులు, వివిధ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి గౌరవం పెరిగిందని టీడీపీ పాడేరు నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ మాజీ శాసనసభ్యులు గిడ్డి ఈశ్వరి పేర్కొన్నారు. పాడేరు మండలం మోదపల్లి పంచాయతీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతినెల ఒకటో తేదీన వితంతువులకు, వికలాంగులకు వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి అందించే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరి మాట్లాడుతూ... ఎన్టీఆర్ భరోసా పెన్షన్లతో పేదలకు మరింత భరోసా పెరిగిందన్నారు. ఎన్నడూ లేని విధంగా సామాజిక పెన్షన్లు పొందే వారికి ఆదరణ పెరిగిందన్నారు. ఇదివరకు మాదిరిగా కాకుండా పెన్షన్ దారుల పట్ల ప్రేమ, అభిమానం పెరిగేలా చంద్రబాబునాయుడు చేశారన్నారు. చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందించడంతో పెన్షన్లు అందుకునే ప్రతి కుటుంబానికి ఓ పెద్దన్నగా నిలిచారన్నారు.

## కిడ్నీ బాధితులను ఆదుకుంటాం అధైర్యపడొద్దు

**●నాణ్యమైన వైద్యసేవలు అందించడమే కూటమి ప్రభుత్వ బాధ్యత**

**● లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి**



రంపచోడవరం (చైతన్యరథం): కిడ్నీ సంబంధిత బాధితులు అపోహలకు లోను కావొద్దని నాణ్యమైన వైద్యసేవలు అందించడమే కూటమి ప్రభుత్వ బాధ్యతగా ముందుకు సాగుతుందని రంప చోడవరం ఎమ్మెల్యే రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి పేర్కొన్నారు. రాజవొమ్మంగి మండలం ఉర్లకులపాడు గ్రామంలో ఇటీవల కాలంలో కిడ్నీ తదితర వ్యాధులతో సతమతం అవుతున్న బాధితులను శనివారం ఆమె ‑ాపీజ చైర్మన్ లోతా లక్ష్మణరావుతో కలిసి పరామర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రజలు అపోహలకు తావులేకుండా ఉండాలన్నారు. ఇప్పటికే ఈ విషయంలో సంబధిత అధికారులతో రక్త , నీటి నమునాలు సేకరించినట్లు పేర్కొన్నారు. నీటి నమునాలు మంచిగానే ఉన్నాయని తెలిపారు. అలాగే తదితర కారణాలతో చనిపోయిన వారి కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఆయా కుటుంబాలకు పండ్లు, బియ్యం తదితర వస్తువులు అందజేశారు. అలాగే ప్రజలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టిలో పెట్టాలని సూచించారు. ఇప్పటికే ఈ సంఘటనపై అసెంబ్లీ సమావేశాల్లో ఉన్నాకూడా కూటమి నాయకులతో కలిసి సంబధిత అధికారులతో ఇక్కడ వైద్య శిబిరాలు, మంచినీటి నమూనాలు చేయించినట్లు పేర్కొన్నారు. అలాగే ఇటీవలకాలంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు కూటమి నాయకులకు పరామర్శించారు. ఇప్పటికే ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్వల్పమైన వ్యాధులకు కూడా సక్రమంగా మందులు వాడక పోవశీటతో కూడా దీర్ఘకాలిక వ్యాధులుగా మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ముందుగా గుర్తించి సరైన ఆహారపు అలవాట్లు, వ్యాయామంతో పాటూ మంచి వైద్యం పొందాలని కోరారు.

## టైలర్ల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**● టైలర్లు అందరూ ఐక్యంగా ఉండాలి : చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు**

వినుకొండ (చైతన్యరథం): టైలర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు అన్నారు. ప్రపంచ టైలర్స్ డే సందర్భంగా వినుకొండ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవను ఏర్పాటు చేసిన సభకు చీఫ్ విప్ జీవి ఆంజనేయులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలిత కుట్టుమిషన్ సృష్టికర్త ఎలియన్స్‌వే చితపడానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ జీవి మాట్లాడుతూ... టైలర్లు అందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. టైలర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మహిళా టైలర్లకి కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చి, ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వినుకొండ టైలర్స్ అసోసియేషన్ బిల్డింగ్ నిర్మాణానికి అవసరమైన ఐదు సెంట్లు స్థలాన్ని తప్పనిసరిగా అందిస్తానని, అంతేకాకుండా అసోసియేషన్ బిల్డింగ్ నిర్మాణానికి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చీఫ్ విప్ జీవి వెల్లడించారు. కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ నాయకులు, టైలర్లు పాల్గొన్నారు.

## పేదల సేవలో ప్రభుత్వ విప్ గణబాబు... పెన్షన్లు పంపిణీ

విశాఖపట్నం (చైతన్యరథం): ఒక రోజు ముందుగానే విశాఖపట్నం 56వార్డ్‌లో ఇంటి వద్దకే ఎన్టీఆర్ పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పేదల సేవలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గణబాబు ఎన్టీఆర్ పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మార్చి నెలకు సంబంధించిన పెన్షన్లను, లబ్ధిదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు అందజేశారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు మరియు డయాలసిస్ రోగుల వద్దకు నేరుగా వారి ఇంటికే వెళ్లి పెన్షన్ నగదును పంపిణీ చేశారు. 56వ వార్డు పరిధిలోని పోస్టాఫీసు వీధి, దుర్గానగర్, పల్లి వీధి, గోకుల్ నగర్, మలసూరి వీధి, తోట వీధి మరియు గొల్ల కంచరపాలెంలో పర్యటించారు. ప్రభుత్వ విప్ గణబాబు మాట్లాడుతూ... పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది, ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎటువంటి జాప్యం లేకుండా, పారదర్శకంగా ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తున్నామని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే విజయ్ చంద్ర



పార్వతీపురం (చైతన్యరథం): పార్వతీపురం పట్టణంలోని 14 వార్డు గొల్ల వీధిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను శనివారం ఉదయం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర పంపిణీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే విజయ్ చంద్ర ఏ అవసరమొచ్చిన ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతినెల మొదటి తేదీన పెన్షన్లు పంపిణీ చేయడం ప్రభుత్వ సంకల్పానికి నిదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన పెన్షన్లు లబ్ధిదారుకు చాలీ చాలక పోవడంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పింఛన్ మొత్తాన్ని పెంచి తూచా తప్పకుండా అందిస్తున్నారని స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, సిబ్బంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం లక్ష్యంగా నిరంతరం పనిచేస్తా : యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం (చైతన్యరథం): దేశంలోనే ఎక్కడ లేని విధంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం రాష్ట్రంలో జరుగుతుందని ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శనివారం ఉదయం ఆయన ఉంగుటూరు మండలం కొయ్యగూరపాడు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు స్వయంగా అందజేసి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో 2.30 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన గోకులం షెడ్డును ప్రారంభించారు. అక్కడి నుండి పొణుకుమాడు గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే, తానా సెక్రటరీ కసుకుర్తి రాజాతో కలిసి ఎన్ఆర్ఐ తానా తరఫున రైతులకు 10 లక్షల రూపాయల విలువైన స్పేయర్లు, టార్పాలిన్ పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు, అధికారులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ... ప్రతి నెలా ఒకటవ తేదీన అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పెన్షన్లను ఇంటింటికి వెళ్లి అందజేస్తున్నామని తెలిపారు. ఒకటవ తేదీ ఆదివారం కావడంతో, లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా శనివారమే ఈ పంపిణీ చేపట్టామని చెప్పారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నప్పటికీ, ప్రజా సంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు గ్రామాల్లో పెన్షన్ల పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. గన్నవరం నియోజకవర్గంలో మొత్తం 47,406 మంది లబ్ధిదారులకు 20 కోట్ల 38 లక్షల 66 వేల రూపాయల మొత్తాన్ని పెన్షన్ల రూపంలో అందజేసినట్లు వివరించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గాన్ని నిలువుదోపిడీ చేశారని ఆయన విమర్శించారు.

## సంక్షేమ పాలనకు ప్రతీక కూటమి ప్రభుత్వం : కిడారి శ్రావణ్



అరకు (చైతన్యరథం): సంక్షేమ పాలనకు ప్రతీక కూటమి ప్రభుత్వమని రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ వ్యాఖ్యానించారు. అరకు నియోజకవర్గం అనంతగిరి మండలం చిలకలగెడ్డ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో కిడారి శ్రావణ్ కుమార్ పర్యటించారు. మండల ప్రధాన కార్యదర్శి నరేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఒక్కరోజు ముందుగానే సామాజిక పెన్షన్లను పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్థులతో మమేకమై వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ... నందమూరి తారకరామారావు ప్రారంభించిన సంక్షేమ విధానాలను నేడు నారా చంద్రబాబునాయుడు సమర్థవంతంగా కొనసాగిస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం ప్రజల సంక్షేమమేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వృద్ధులకు రూ.4,000, వికలాంగులకు రూ.6,000, ఒంటరి మహిళలకు రూ.4,000, వితంతువులకు రూ.4,000, చికిల్ సెల్ అనీమియా బాధితులకు రూ.10,000, ప్యారాలసిస్ వంటి తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న వారికి రూ.15,000 పెన్షన్లు అందజేస్తున్నామని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిలిచిపోయాయని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి మళ్లీ పుంజుకుందని తెలిపారు. భవిష్యత్తులో ప్రతి కుటుంబానికి ఆర్థిక స్థిరత్వం కల్పించే దిశగా మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని, నిరుద్యోగ యువతకు ఉపాధి-ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా కల్పిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా పెన్షన్ లబ్ధిదారులతో పాటు పంచాయతీ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. లబ్ధిదారుల ముఖాల్లో చిరునవ్వులు కనిపించగా, కూటమి ప్రభుత్వ సంక్షేమ పాలనకు ఇది నిదర్శనమని స్థానికులు పేర్కొన్నారు.

# నూజివీడులో రూ.3.02 కోట్లతో అభివృద్ధి పనులు

● గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన త్రాగునీరు రెండు పూటలూ పుష్కలంగా అందిస్తాం

●ప్రజలు కలిసికట్టుగా ఉంటే అభివృద్ధి, సంక్షేమం ఊహించని స్థాయిలో జరుగుతుంది : రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి



నూజివీడు (చైతన్యరథం): నూజివీడు మండలం సుంకొల్లు, ముక్కొల్లపాడు గ్రామాల్లో శనివారం రూ.3.02 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శ్రీకారం చుట్టారు. ముందుగా గ్రామ ప్రజలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. మోటారు సైకిల్ మీద ప్రయాణం చేస్తూ ప్రజలను పేరుపేరున పలకరిస్తూ, ఎండను కూడా లెక్క చెయ్యక పలు అభివృద్ధి కార్యక్రమాలను శ్రీకారం చుట్టారు. గ్రామ ప్రజలు కొన్ని సమస్యలు తెలియజేయగా స్పందిస్తూ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులతో ఫోన్లో మాట్లాడి పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షిత తాగునీరు రెండు పూటలు పుష్కలంగా అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రాష్ట్రంలో అర్హులు అయిన నిరుపేదలు ధరఖాస్తు చేసుకున్న ప్రతి కుటుంబానికి పక్కా గృహాన్ని మంజూరు చేస్తామని తెలిపారు. ఆరోగ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేలా జిల్లాలో గ్రామీణ ప్రాంతాలు ప్రజలందరికీ సురక్షిత తాగునీరు అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రజలందరూ ఆరోగ్యవంతంగా సుఖ సంతోషాలుగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలకు సురక్షిత తాగునీటిని కూడా అందించ లేకపోయారని అన్నారు. జలజీవన పథకం కింద కేంద్రం నుండి వచ్చిన నిధులను కూడా సరిగా ఖర్చు పెట్టకపోగా రాష్ట్ర వాటాను కూడా ఇవ్వలేక పోయిందని అన్నారు.

# ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి పనులపై సమీక్ష



ఏలూరు (చైతన్యరథం): వైద్యం కొరకు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి వారికి ఆరోగ్య భరోసాను కల్పించే విధంగా వైద్యులు వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, జిల్లా కలెక్టర్ కె వెట్రీ సెల్వి వైద్యాధికారులకు సూచించారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ గౌతమీ సమావేశం మందిరంలో శనివారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ప్రభుత్వ ఆసుపత్రిలో అమలు జరుగుతున్న మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులపై ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ కుమార్, జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి, ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్యతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రికి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా వైద్యాధికారులు వైద్య సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. ముఖ్యంగా గుండె చికిత్సకు సంబంధించి విజయవాడ వంటి ఇతర ప్రాంతాలకు రిఫర్ చేస్తున్నారని, ఏలూరు జిజిహెచ్‌లోనే హృదయ చికిత్సకు అవసరమయ్యే ఎక్విప్మెంట్‌ను ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారి రఘునందన్ రావుకు సూచించారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలను అందించేందుకు నవభారత్, గోద్రెజ్ వంటి కంపెనీలు దాతృత్వంతో ముందుకు వస్తున్నాయని, వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. టాయిలెట్స్, శానిటేషన్ ఇతర పనుల రిపేరు కొరకు దాతలు రూ.50 లక్షలు ఇవ్వగా, ఎంపీ ల్యాండ్స్ నుంచి రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎంపీ తెలిపారు. ఆక్సిజన్, వైద్య పరికరాలతో కూడిన అంబులెన్స్ కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

# అర్హులందరికీ పింఛన్లు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● లబ్ధిదారులకు పింఛన్లు అందజేసిన ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ఎన్టీఆర్ భరోసా పథకం కింద సామాజిక భద్రతా పింఛన్లు అర్హులైన వారందరికీ అందిస్తున్నామని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం కోలమూరు గ్రామంలో కొత్తగా మంజూరైన నూతన పింఛన్లను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి స్థానిక నేతలతో కలిసి అర్హులైన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ... పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే భార్యకు పింఛన్ ఇచ్చే విధానాన్ని గత వైసీపీ ప్రభుత్వం విస్మరించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ విధానాన్ని అమలు చేసేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. ఈరోజు రూరల్ నియోజకవర్గానికి సంబంధించి నూతనంగా మంజూరైన 51 మంది లబ్ధిదారులకు ఈ నెల నుండి పింఛన్ అందిస్తున్నామని తెలిపారు. ఐదేళ్ల పాలనలో జగన్ దోచుకోవడం దాచుకోవడం తప్ప చేసిందేమీ లేదని అన్నారు. వైసీపీ పాలనకు కూటమి ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు తెలుసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందన్నారు.

# స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ రథం వాహనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్రంగా మార్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో స్వచ్ఛ రథం వాహనాన్ని కొవ్వూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్ మరియు ఇతర వ్యర్థాలను సమూలంగా తొలగించి తద్వారా ప్రజలకు పారిశుద్ధంపై మరియు పరిసరాల పరిశు భ్రతపై అవగాహన కల్పించి తదనుగుణంగా గ్రామాలన్నీ స్వచ్ఛ గ్రామాలుగా ఉండాలనే సంకల్పంతో స్వచ్ఛ రదాన్ని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావడం జరిగిందన్నారు. గ్రామాలలో ఉన్న ప్రజలు వారి వద్ద ఉన్న ప్లాస్టిక్ మరియు ఇతర వ్యర్థాలను ప్రభుత్వం నిర్దేశించిన రేటుకు స్వచ్ఛ రథం వద్ద అందించి ఆ రేటుకు సమాన రీతిలో నిత్యఆవసరాలను పొందవలసిందిగా తెలియజేశారు. ఈకార్యక్రమం వలన ప్రజలకు వారి వద్ద ఉన్న ప్లాస్టిక్, ఎల(క్ట్రానిక్ మరియు ఇతర వ్యర్థాల వలన ప్రత్యక్షంగా లబ్ధి చేకూరడమే కాకుండా గ్రామాలన్నీ పరిశు భ్రంగా ఉంటాయని, ఈకార్యక్రమమునకు ప్రజలందరూ సహకరించి విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొటారు వెంకట్రావు, కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, కూచిపూడి లక్ష్మణరావు, ఇందుగుల రామకృష్ణ, కూచిపూడి హనుమంతురావు, చెవ్వూరి రాము, అన్నమరెడ్డి రమణ, దండమూడి శేషు తదితరులు పాల్గొన్నారు.

# పేదల పట్ల ఎవరి చిత్తశుద్ధి ఏంటో తేలుద్దాం

●తిండి గింజల కోసం వచ్చి పోయే వలస పక్షులు లాగా...

●పిచ్చి వాళ్ళ లాగా రాజకీయం చేయటం కాదు

●వైసీపీ నాయకులకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్ట్రాంగ్ కౌంటర్



దెందులూరు (చైతన్యరథం): పెదవేగి మండలం మొండూరు గ్రామంలో శనివారం ఉదయం జరిగిన నూతన స్పౌస్ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ లబ్ధిదారులకు పింఛన్లను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ... రాష్ట్రంలోని కూటమీ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ఎంతో చిత్తశుద్ధితో కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రం కోసం, ప్రజల కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా తల్లికి వందనం పథకం ఎంతమంది పిల్లలు ఉంటే వారందరికీ అమలు చేస్తామని చెప్పామని, అదేవిధంగా పథకాన్ని కూడా అమలు చేయడం జరిగిందని తెలిపారు. దెందులూరు నియోజకవర్గంలో కొందరు పిచ్చి వాళ్ళ లాగా మతిభ్రమించి పదవి పోతే జీర్ణించుకోలేక ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ రెచ్చగొట్టాలని ప్రయత్నిస్తున్నారని, ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా కూడా ఇంకా వాళ్ల తీరులో మార్పు రాకపోవడం వాళ్ళ బుద్ధిమాంద్యానికి నిదర్శనమని అన్నారు. ఎంత గొప్ప రైతైనా సరే ఎటువంటి పంట వేసిన లేదా వ్యవసాయం చేపట్టినప్పుడు ఎక్కడో దగ్గర ఒక చెడ్డ విత్తనం వల్ల గాని లేదా ఏదో ఒక చోట సమస్య రాకుండా ఉండదని, అదేవిధంగా రాష్ట్రంలో ఎన్నో లక్షల మందికి తల్లికి వందనం అమలు చేస్తుంటే వారిలో కొంతమందికి కరెంట్ బిల్లులు తేడా వల్ల గాని, లేదా గత వైసీపీ ప్రభుత్వంలో చేసిన అస్తవ్యస్త మ్యాపింగులు వల్ల గాని, సాంకేతిక సమస్యల వల్ల గాని, తల్లిదండ్రుల ఎకౌంటు లింకు సమస్య వల్ల గాని, కొంతమందికి ఆగి ఉండొచ్చు అని అయితే అటువంటి వారికి కూడా పథకాన్ని అమలు చేసే లక్ష్యంగా ఆయా పాఠశాలల హెడ్మాస్టర్లు, సంబంధిత సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లకు, పంచాయతీ సెక్రటరీలు మరియు ప్రజా ప్రతినిధులు కూటమి నాయకులు బాధ్యత తీసుకుని కృషి చేయాలని సూచించారు. అయితే ఇటువంటి అంశంలో వైయస్సార్ పార్టీ వాళ్లకు కక్షపూరితంగా తల్లికి వందనం ఇవ్వలేదని కొందరు మాట్లాడుతున్నారని, అటువంటి వాళ్ళు దమ్ముంటే రాని వాళ్ళ వివరాలతో సహా బయటకు వచ్చి వీడు ఫలానా వైయస్సార్ నాయకుడు కాబట్టే మీరు ఇవ్వలేదు అని ఇదే కారణం అని మీరు చెప్పగలరా? అని ప్రశ్నించారు. సాంకేతిక సమస్యలతో పథకం చేకూరని వాళ్ళకు ఎందుకు అమలు జరగలేదు అనే ప్రతి వివరం కూడా తమ వద్ద సమగ్రంగా ఉందని, అయితే ఆ సమస్యలను కూడా పరిష్కరించి అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూర్చేందుకు కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరూ కూడా కృషి చేస్తారని ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు.

# అగ్నిప్రమాదం అత్యంత విచారకరం

● కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ ఆవేదన



కాకినాడ (చైతన్యరథం): సామర్లకోట మండలం వేట్లపాలెంలో 'సూర్య ఫైర్ వర్క్స్' బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ఘోర అగ్నిప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందని కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మధ్యాహ్నం ప్రమాద స్థలాన్ని సందర్శించి, సహాయక చర్యలను పర్యవేక్షించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ దుర్ఘటనలో కార్మికులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని, మృతుల కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. విజయనగరం పర్యటనలో ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి ఈ ప్రమాద వార్త తెలియగానే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్, ఎస్పీలను అప్రమత్తం చేశారని, హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని స్వయంగా సమీక్షించాలని ఆదేశించినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంత్రులు, ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర హోంమంత్రి కూడా పరిస్థితిని సమీక్షించేందుకు స్వయంగా ఇక్కడికి రానున్నారని స్పష్టం చేశారు. కలెక్టర్ శ్రీ షణ్మోహన్, ఎస్పీ శ్రీ బిందు మాధవ్ పర్యవేక్షణలో రెవెన్యూ, వైద్య, పోలీస్, అగ్నిమాపక శాఖలు సమన్వయంతో సహాయక చర్యలు ముమ్మరంగా చేపడుతున్నాయని తెలిపారు. క్షతగాత్రులను కాకినాడ జీజీహెచ్‌కు తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

# పింఛన్‌తో పేదలకు సామాజిక భద్రత

**• సంక్షేమం, అభివృద్ధి, పారదర్శకత అనే మూడు సూత్రాలతో ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం : నెట్టెం రఘురాం**



జగ్గయ్యపేట (చైతన్యరథం): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పథకం పేద ప్రజలకు ఎంతో లబ్ధి కలగజేస్తుందని మాజీ మంత్రి, కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం వ్యాఖ్యానించారు. శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పథకాన్ని ఆయన నియోజకవర్గంలోని గౌరవరం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూరదృష్టి, సంకల్పబలం ఫలితంగానే ఎన్టీఆర్ భరోసా పథకం సమర్థవంతంగా అమలవుతోందని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వం అండగా నిలిచి నిజమైన సామాజిక భద్రతను కల్పిస్తోందని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధి, పారదర్శకత అనే మూడు సూత్రాలతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రతి ఇంటికీ ప్రభుత్వ భరోసా చేరాలనే లక్ష్యంతో పథకాలు అమలు అవుతున్నాయని అన్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములై, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు తమ వంతు కృషి కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తగా మంజూరైన మూడు వితంతు పింఛన్లు, రెండు దివ్యాంగ పింఛన్లు లబ్ధిదారులకు అందజేశారు.

# అర్హులందరికీ పెన్షన్లు పంపిణీ చేస్తాం

**• ఇంటింటికి పెన్షన్లు అందజేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 18వ డివిజన్ 60వ సచివాలయంలో పరిధిలోని అడపా బజార్ నందు ఎమ్మెల్యే గళ్ళా మాధవి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి పెన్షన్ మొత్తాన్ని రూ.4,000కి పెంచడం ఎంతో శుభపరిణామమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే ప్రతి ఇంటికి వెళ్లి పెన్షన్లు అందించడం జరిగిందని, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో దాదాపు 21 వేల మంది పెన్షన్‌దారులు ఉన్నారని, ప్రతి నెల సుమారు రూ.99 కోట్లకు పైగా మొత్తాన్ని అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం చెల్లిస్తోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఆపన్నులకు ఆపన్నహస్తంగా నిలిచే సంక్షేమ పథకాలలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం ముఖ్యమైనదని, అయితే 60వ సచివాలయం పరిధిలో కొంతమంది అర్హులైన వారు ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ పెన్షన్ అందుకోలేకపోతున్న సమస్యను స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ లబ్ధి పొందలేకపోతున్న వారందరి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో ప్రతి అర్హుడికి పెన్షన్ అందేలా చర్యలు తీసుకునే దిశగా కృషి చేస్తామని, కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి అనే రెండు కళ్లతో ముందుకు సాగుతోందని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

# నందిగామలో సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ

నందిగామ (చైతన్యరథం): నందిగామ పట్టణం 9వ వార్డు ముక్కపాటి కాలనీలో శనివారం నాడు సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మార్చి 1వ తేదీ ఆదివారం కావడంతో లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఒకరోజు ముందుగానే పెన్షన్లు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్లు అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ప్రజల సంక్షేమమే లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ప్రతి అర్హుడికి సమయానికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. పెన్షన్ పొందిన వృద్ధులు, విధవలు, దివ్యాంగులు మరియు ఇతర లబ్ధిదారులు ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి ప్రజల పట్ల ఉన్న నిబద్ధతకు హర్షధ్వానాలతో అభినందనలు తెలియజేశారు. ఆదివారం కావడంతో ముందుగానే పెన్షన్లు అందజేయడం పట్ల వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ శ్రీమతి మండవ కృష్ణకుమారి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు మరియు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

# రూ.8.40 కోట్లతో రోడ్ల మరమ్మతులకు ప్రత్తిపాటి శ్రీకారం

**• ప్రాధాన్యతా క్రమంలో ప్రభుత్వం రోడ్ల సమస్యను పరిష్కరిస్తుందని వెల్లడి**



చిలకలూరిపేట (చైతన్యరథం): నియోజకవర్గంలోని అన్నిప్రధాన, ఇతర ఆర్ బీ రోడ్ల నిర్మాణం, విస్తరణ, మరమ్మతులు, అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని, అసెంబ్లీలో సమస్యను ప్రస్తావించానని, ప్రాధాన్యతా క్రమంలో ప్రభుత్వం త్వరలోనే రోడ్లసమస్యను పరిష్కరిస్తుందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. రూరల్ మండలం కట్టుబడివారిపాలెం, నాదెండ్ల మండలంలో సాతులూరు గ్రామలలో రూ.8.40 కోట్లతో చేపట్టిన రోడ్ల మరమ్మత్తుల పనులకు శంకుస్థాపన చేశారు. యూటీ నుంచి కట్టుబడివారిపాలెం (కమ్మవారి పాలెం మీదుగా), వేలూరు - గణపవరం రోడ్డుకు 4కోట్ల రూపాయల నిధులతో అలానే సాతులూరు గ్రామం నుండి దింతెనపాడు గ్రామం వరకు 4.40 కోట్ల రూపాయల నిధులతో రోడ్ల మరమ్మతులకు శనివారం ప్రత్తిపాటి కూటమినాయకులతో పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. రోడ్ల నిర్మాణంపై ప్రభుత్వం ఎప్పుడూ సానుకూలమే.. నియోజకవర్గంలోని రోడ్ల సమస్యను మొన్ననే అసెంబ్లీ ద్వారా ప్రభుత్వానికి తెలియచేశానని, రోడ్ల నిర్మాణంపై ప్రభుత్వం ఎప్పుడూ సానుకూలంగానే ఉంటుందని ప్రత్తిపాటి చెప్పారు. చిలకలూరిపేట నుంచి కోటప్పకొండకు వెళ్లే అన్నిరోడ్లను అభివృద్ధి చేయాలని కోరానన్నారు. నరసరావుపేట రోడ్డు విస్తరణ అంశం కూడా ప్రభుత్వ దృష్టిలో ఉందన్నారు. యూటీ నుంచి చిలకలూరిపేట ఆర్ బీ రోడ్డు మరమ్మతు పనుల్ని రూ.4కోట్లతో చేపట్టామని, ఈ రోడ్డు పూర్తయితే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ప్రత్తిపాటి తెలిపారు.

# ప్రజల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే బొండా ఉమా

**• భవిష్యత్తులో కూడా మరింత బాధ్యతతో ముందుకు సాగుతాం**



విజయవాడ (చైతన్యరథం): ప్రజల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యమని, భవిష్యత్తులో కూడా మరింత బాధ్యతతో ముందుకు సాగుతామని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యానించారు. శనివారం ఉదయం 25వ డివిజన్ సీతారామాపురం, ఓల్డ్ ఎంప్లాయిమెంట్ ఆఫీస్ వీధిలో సామాజిక పెన్షన్లు పంపిణీ చేశారు. నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమమహేశ్వరరావు స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వృద్ధులు, వికలాంగులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ నగదును అందజేశారు. వృద్ధుల ఆశీర్వాదాలు తీసుకుంటూ, వికలాంగుల సమస్యలు అడిగి తెలుసుకుంటూ ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడం మా కూటమి ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. "సూపర్ సిక్స్" హామీలు ఇచ్చినప్పుడు ప్రతిపక్ష పార్టీలు ఎగతాళి చేశాయని, ఇవి కేవలం ఓట్ల కోసం చెప్పిన మాటలేనని విమర్శించాయని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీ కూడా మిగలకుండా అమలు చేసి చూపిస్తున్నామని అన్నారు. రాష్ట్ర విభజన అనంతరం తొలిసారి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు పింఛన్ కేవలం రూ.200 మాత్రమే ఉండేదని, దాన్ని రూ.2000కు పెంచి పది రెట్లు పెంచామని వివరించారు. అనంతరం ఇచ్చిన మాట ప్రకారం రూ.3000 పింఛన్‌ను రూ.4000కు పెంచామని తెలిపారు. వికలాంగులకు రూ.3000 పింఛన్‌ను రూ.6000కు పెంచి దేశంలోనే ఆదర్శంగా నిలిచామని గర్వంగా పేర్కొన్నారు.

# వైసీపీ విధ్వంసకర రాజకీయాలు - సంక్షేమం, అభివృద్ధే కూటమి ధ్యేయం



మైలవరం (చైతన్యరథం): గొల్లపూడిలో నిర్వహించిన సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఈ క్రమంలో ఆయన వైసీపీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వైసీపీ విధ్వంసకర రాజకీయాలు చేస్తోందని, శాసనమండలిలో చర్చకు రాకుండా పారిపోతుందని ఆరోపించారు. గత ఐదేళ్లలో ఇరిగేషన్ రంగాన్ని వైసీపీ పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆయన విమర్శించారు. రైతులకు నష్టం కలిగించే విధానాలు అమలు చేశారని పేర్కొన్నారు. దేశంలోనే అత్యధిక మొత్తంలో సామాజిక భద్రత పింఛన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, కూటమి ప్రభుత్వం నిరుపేదల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందన్నారు. పెన్షన్ల పంపిణీలో పులివెందుల ఎమ్మెల్యేగా మీ బాధ్యతను నిర్వర్తించారా అని ఆయన ప్రశ్నించారు. ప్రజా రాజధాని అమరావతి, జీవనాడి పోలవరం ప్రాజెక్టు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతుంటే వైసీపీ, ఆ పార్టీకి చెందిన 11 మందికి వాటితో పనిలేదని ఎద్దేవా చేశారు. నిరుపేద ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి అర్హుడికి పింఛన్ అందేలా చర్యలు తీసుకుంటున్నామని దేవినేని ఉమా స్పష్టం చేశారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే సీఎం చంద్రబాబు లక్ష్యం



తోట్లవల్లూరు (చైతన్యరథం): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఏపీ గౌడ కార్పొరేషన్ ఛైర్మన్, కృష్ణ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి గురుమూర్తి అన్నారు. శనివారం కృష్ణా జిల్లా తోట్లవల్లూరు గ్రామంలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో వీరంకి గురుమూర్తి పాల్గొన్నారు. అర్హులందరికీ ఆయన పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఏపీలో సామాజిక భద్రతా పించన్లను ప్రవేశపెట్టింది టీడీపీ ప్రభుత్వమే. రూ.35 ఉన్న పెన్షన్‌ను చంద్రబాబు సీఎం కాగానే దానిని రూ.75కు పెంచారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రోజే పెన్షన్లను రూ.1,000కి పెంచారు. తరువాత రూ.2వేలు చేశారు. అంటే ఐదేళ్లలో 10రెట్లు పెంచిన ఘనత తెలుగుదేశం పార్టీదే. జగన్మోహన్‌రెడ్డి పెన్షన్లను రూ.3000లకు పెంచుతానని ఎన్నికల ప్రచార సమయంలో, వైసీపీ మేనిఫెస్టోలో, పాదయాత్రలో ప్రకటించి అధికారంలోకి వచ్చాక కేవలం రూ.250 మాత్రమే పెంచి రూ.2000 నుంచి రూ.2250 చేశారు. ఫలితంగా పెన్షన్‌దారులు ఐదేళ్ళ కాలంలో రూ.28,000 నష్టపోయారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెల నుంచే రూ.3 వేలు ఉన్న పెన్షన్‌ను రూ.4 వేలుకు పెంచడంతో పాటు, ఇచ్చిన హామీ మేరకు మొదటి నెలలో రూ.7 వేలు అందించడం జరిగిందన్నారు.

చైతన్యరథం




# గ్రీన్ స్పేస్ డెవలప్మెంట్ పనులు ప్రారంభం

## కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు రూరల్ (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలోని 17వ డివిజన్ హరనాధపురం సెంటర్‌లో 1కోటి 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సూర్య నమస్కారాలు (గ్రీన్ స్పేస్ డెవలప్మెంట్) పనులను మునిసిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ , రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రారంభించారు. నగర మేయర్ దేవరకొండ సుజాత, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. నెల్లూరు రూరల్ లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని గిరిధర్‌రెడ్డి వెల్లడించారు. నెల్లూరు రూరల్ లో కూడా కార్పొరేషన్ స్కూల్స్ ను వీఆర్ హై స్కూల్ తరహాలో తీర్చిదిద్దుతామని మునిసిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. రానున్న రెండు సంవత్సరాలలో నెల్లూరు రూరల్ ను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. నెల్లూరు నగర కార్పొరేషన్ లో అభివృద్ధి పనుల జాతర కొనసాగుతోందన్నారు. చరిత్ర చూడని అభివృద్ధి నెల్లూరులో జరుగుతుందన్నారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. ప్రజల కష్టాలు, బాధలు తెలిసిన నాయకుడు మంత్రి నారాయణ. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అని పేర్కొన్నారు. నెల్లూరులో వీఆర్ హై స్కూల్‌ను అంతర్జాతీయ స్థాయిలో తీర్చి దిద్దిన ఘనత మంత్రి నారాయణదేనన్నారు. క్లస్టర్ ఇంఛార్జులు, కో క్లస్టర్ ఇంఛార్జులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధసంఘాల అధ్యక్షులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల బుక్‌లెట్ ఆవిష్కరణ

తిరుమల (చైతన్యరథం): ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల బుక్లెట్‌ను ఈవో ముద్దాడ రవిచంద్రతో కలిసి తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆవిష్కరించారు. తిరుమల అన్నమయ్య భవన్ లో శనివారం పాలకమండలి సమావేశం అనంతరం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ మార్చి 27 నుంచి ఏప్రిల్ 5 వరకు ఒంటిమిట్ట శ్రీ కోందండరాముని బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 1న రాష్ట్ర పండుగగా శ్రీ సీతారాముల కల్యాణాన్ని తితిదే అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు వి. వీరబ్రహ్మం, డాక్టర్ శరత్, సీవీఎస్వో మురళీకృష్ణ, పలువురు బోర్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామి అనుగ్రహంతో శ్రీ పరాభవ నామ సంవత్సరంలో ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సకల ఐశ్వర్యాలు సమకూరాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ధర్మ ప్రచారంలో భాగంగా తితిదే ప్రతి ఏడాది ఉగాది నాటికి పంచాంగాలను ముద్రించి అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రాబోయే శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగాన్ని ఆకర్షణీయంగా ముద్రించింది. పంచాంగాన్ని తితిదే ఆస్థాన సిద్ధాంతి తంగిరాల వెంకటకృష్ణ పూర్ణ ప్రసాద్ సిద్ధాంతి రచించారు. రాజాధి నవనాయకుల ఫలితాలతోపాటు రాశిఫలాలు, వధూవర గుణమేళనం, వివాహాది సుముహూర్త నిర్ణయాలు, తితిదేలో నిర్వహించే విశేష ఉత్సవాలు తదితర విషయాలను వివరించారు.



# ముప్పై ఏళ్లుగా పట్టించుకోని ఇఫ్కో కిసాన్ సెజ్‌లో కదలిక తెచ్చాం

## కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

కోవూరు, (చైతన్యరథం): గత ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల కారణంగా అభివృద్ధి కుంటు పడిందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి విమర్శించారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ సందర్భంగా కొడవలూరు మండలంలోని గౌతం నగర్‌లో గడప గడపకూ వెళ్లారు. గ్రామంలోని వృద్ధులు, దివ్యాంగులను ఆప్యాయంగా పలకరిస్తూ యోగ క్షేమాలు అడిగి తెలుసు కున్నారు. అనంతరం గౌతం నగర్ గ్రామంలో 36 లక్షలతో నిర్మించనున్న విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణానికి శంఖుస్థాన చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ 1 వ తేదీ ఆదివారం వస్తే అవ్వా తాతల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఒకరోజు ముందుగానే పెన్షన్ల పంపిణీ చేసే కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక వృద్ధులు, దివ్యాంగులకు సంబంధించిన పెన్షన్ల పెంపు నిర్ణయమే చంద్రబాబు చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. గతంలో వైద్యం కోసం పట్టణాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నివారించి ప్రతి గ్రామంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలనేది కూటమి ప్రభుత్వ సంకల్పమన్నారు. గత 30 ఏళ్లుగా నిరాదరణకు గురైన ఇఫ్కో కిసాన్ సెజ్ లో పరిశ్రమల స్థాపన దిశగా కృషి చేసిన ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని ఆమె అభినందించారు. శంకుస్థాపన జరగనున్న గాయత్రి ఇథనాల్ పవర్ ప్లాంట్ ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. కిసాన్ సెజ్‌లో పరిశ్రమలు పెట్టేందుకు పలువురు పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారని విపిఆర్ ఫౌండేషన్ ద్వారా స్కిల్ డెవలప్‌మెంటు సెంటర్ ఏర్పాటు చేసి యువతకు శిక్షణ యిచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి తనను ఉద్దేశించి చేసిన వాఖ్యలపై ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఉచితంగా అందచేస్తున్న తోపుడు బళ్ళు తదితర సేవా కార్యక్రమాల గురించి ఆమె వివరించారు. కుమార్తెను ముందు పెట్టి రాజకీయాలు చేస్తున్న కాకాణి డబ్బుంది కాబట్టే కాకాణి కుమార్తె రాజకీయాల్లోకి వచ్చిందంటే ఎలావుంటుందని చురక అంటించారు. ఎవరి గురించి మాట్లాడుతున్నారో ఆలోచించుకోవాలని కాకాణికి హితవు పలికారు.



ధనవంతులం కావడం వల్లే రాజకీయాల్లోకి వచ్చి పేద ప్రజలకు సేవ చేస్తున్నామన్నారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా చేపట్టిన దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్ళ పంపిణీ, ఉచిత క్యాన్సర్ పరీక్షలు, ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ల ఏర్పాటు చిరు వ్యాపారాలకు మంత్రిగా వున్నప్పుడు ఏనాడైనా కోవూరుకు వచ్చారా అంటూ ప్రశ్నించారు. గత 20 నెలల కాలంలో కొడవలూరు మండలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలనువివరించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో కనీస మౌలిక సదుపాయాలైన సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు సంబంధించి 3 కోట్ల 68 లక్షలతో 70 పనులు మొదలు పెట్టారన్నారు. 35 లక్షల ఎంపి లాడ్స నిధులతో సీసీ రోడ్లు, స్మశాన వాటికల ప్రహరీల నిర్మాణాలు చేసిన విషయాన్ని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. 3 కోట్ల 96 లక్షల 15 వ ఆర్థిక సంఘం నిధులతో కొడవలూరు మండలంలో 12 విలేజ్ హెల్త్ క్లీనిక్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. బుచ్చి, కొడవలూరు, విడవలూరు 3 మండలాలను అనుసంధానిస్తూ 8 కోట్ల 50 లక్షలతో చేపట్టిన బుచ్చి నుంచి ఊటుకూరు వరకు 28 బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తికావస్తున్నాయన్నారు. జల్ జీవన్ మిషన్ జిల్లా పరిషత్ కు చెందిన దాదాపు 1 కోటి రూపాయలతో గ్రామీణ ప్రాంతాల దాహార్తి తీర్చే తాగునీటి పైప్ లైన్ నిర్మాణంతో పాటు 70 లక్షల నుడా నిధులతో సిసి రోడ్లు, డ్రైన్లు లాంటి మౌలిక వసతులు కల్పిస్తున్న విషయాన్ని ఆమె తెలియ చేశారు. కూటమి పాలన మొదలైన 20 నెలల కాలంలో ఒక్క కొడవలూరు మండలంలోనే 18 కోట్ల 63 లక్షలతో అభివృద్ధి పనులు చేసిన విషయాన్ని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గణాంకాలతో సహా వివరించారు. ఈ కార్యక్రమంలో కొడవలూరు మండల తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డి, ఎంపీడీఓ సుబ్బారావు, గౌతం నగర్ సర్పంచ్ సునీల్, మండల టిడిపి అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, సొసైటీ అధ్యక్షులు వంశిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కరకట్ట మల్లికార్జున, సీనియర్ నాయకులు సునీల్మరియు తెలుగుదేశం యూనిట్, క్లస్టర్, బూత్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.


# మాట నిలబెట్టుకున్న మంత్రి సవిత



పెనుకొండ (చైతన్యరథం): సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం, పరిగి మండలం, కొడిగేపల్లి గ్రామానికి చెందిన అయ్యప్ప స్వామి భక్తులు గత నెలలో తమ గ్రామంలో అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని మంత్రి సవితమ్మని కోరారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన మంత్రి సవిత, దేవాలయ నిర్మాణం కోసం 8 సెంట్ల స్థలాన్ని కేటాయించేందుకు ఆదేశాలు జారీ చేశారు. శనివారం ఆ స్థలానికి సంబంధించిన పత్రాలను రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, అయ్యప్ప స్వామి భక్తులు మంత్రి సవితకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# వైభవంగా లక్ష్మీనరసింహస్వామి విగ్రహం ఊరేగింపు

## ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు



బొమ్మనహాల్ (చైతన్యరథం): బొమ్మనహాల్ మండలంలోని ఉప్పరహాల్ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఉత్సవం శనివారం సాయంత్రం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా ఉద్దేహాల్ గ్రామ సమీపంలోని వేదవతి హగరి ఒడ్డున ఉంచి పవిత్ర జలముతో అభిషేకం, పుష్పాలంకరణ, కుంకుమార్చన పంచామృతాభిషేకం, వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉద్యహాల్ వేదవతి హగిరి నుంచి ఊరేగింపుగా ఉప్పరహాల్ గ్రామానికి బయలుదేరి గ్రామ పుర వీధిలో స్వామివారికి ఊరేగింపు నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉత్సవంలో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తును నిర్వహించారు.

# కదిరి నరసింహుని సన్నిధికి సాంకేతిక సౌకర్యాలు

## కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వెల్లడి




కదిరి (చైతన్యరథం): భగవంతుని సేవ.. మరింత చేరువయ్యేలా సాంకేతికతను అందుబాటులోకి తెచ్చినట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీవారి దర్శనం, కేశఖండన, అభిషేకం, అర్చన, నివేదన, లడ్డూ ప్రసాదం, తులాభారం, నామకరణం, వాహనపూజ వంటి ఆర్జిత సేవా టికెట్లను పొందే యంత్రాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, యశోదాదేవి దంపతులు ఆర్జిత సేవా టికెట్ల కియోస్క్ యంత్రాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టికెట్ల కోసం వరుసలో గంటలపాటు ఉండాల్సిన అవసరం ఉండదన్నారు. సులభంగా సేవలు పొందేందుకు మూడు యంత్రాలను సమకూర్చినట్లు పేర్కొన్నారు. ఫోన్పేతో తగిన సేవలను ఎంచుకుని టికెట్ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి, నాయకులు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



# చంద్రగ్రహణం

తిరుమల (చైతన్యరథం): చంద్ర గ్రహణం కారణంగా మార్చి 1, 2 తేదీల్లో స్లాటెడ్ సర్వదర్శనం (ఎస్ఎస్ఓ) టోకెన్ల జారీ రద్దు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ప్రకటించింది. మార్చి 2న దర్శనానికి (1న జారీ చేసేవి), మార్చి 3న దర్శనానికి (2న జారీ చేసేవి) రద్దు చేసింది. మార్చి 3న చంద్రగ్రహణం కారణంగా మార్చి 2, 3 తేదీల్లో ఎస్ఎస్ఓ టోకెన్ల జారీ రద్దు చేసినట్లు తితిదే పేర్కొంది. మార్చి 4వ తేదీన శ్రీవారి దర్శనానికి సంబంధించిన టోకెన్లను 3న యథావిధిగా జారీ చేయనున్నట్లు తితిదే పేర్కొంది.



# ఒంగోలు జాతి వృషభ జాతిని కాపాడుకోవాలి

ఒంగోలు (చైతన్యరథం): ఒంగోలు జాతి వృషభ రాజాలకు పుట్టిన గడ్డపై పూర్వ వైభవం తీసుకొస్తే... ఈ జాతిని తరువాత తరాలవారికి అందించినట్లే.. నానాటికి తగ్గిపోతున్న ఈ జాతి పశు వులను సంరక్షణకు పశు సంవర్ధకశాఖ అధికారులు ఆలస్యంగానైనా కళ్లు తెరిచారు. పశు వైద్యులు తమ పరిధిలో కనీసం ఒక రైతు అయినా వీటిని

పెంచుకునేవిధంగా ప్రణాళిక రూపొందించారు. గతంలో ఒంగోలు జాతి ఎద్దులను అరక దున్నేందుకు, పండిన పంటను ఇంటికి చేర్చేందుకు వినియోగించేవారు. వ్యవసాయ యాంత్రీకరణతో వాటి ప్రాధాన్యం తగ్గిపోయింది. వీటిని పెంచేవారు తగ్గిపోవడంతో దేశవాళి రకమైన ఈ రకం పశువులు తగ్గిపోతున్నాయి. ఇప్పుడిప్పుడు నాటు ఆవు పాలకు డిమాండు పెరుగుతుండడం, ప్రకృతి సేద్యానికి సంబంధించి గోమూత్రం, పేడకు డిమాండు పెరగడంతో ఆవుల పెంపకానికి మొగ్గు చూపుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని ఒక్కో పశువైద్యుడు తన పరిధిలో ఒక పాడి రైతును ఎంపిక చేసుకుని ఈ రకం కోడెలు గానీ, పెయ్యలు గానీ పెంచుకుంటే ఎలాంటి ప్రయోజనాలుంటాయో తెలియజేయజేసే కార్యక్రమానికి పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు శ్రీకారం చుట్టారు. ప్రయోజనాలు తెలియజేసి జెర్సీ, హెచ్ఎఫ్ రకాలను ప్రస్తుతం పాలు కోసం పెంచుతున్నారు. అవి మూడు, నాలుగు ఈతలు తరువాత పాలు ఇచ్చే పరిస్థితి ఉండదు. అదే ఒంగోలు జాతి ఆవులు 15 ఏళ్ల పాటు పాలు ఇస్తాయి. నెయ్యికి అత్యధిక ధర లభిస్తుంది. ఒంగోలు జాతి దూడలను ఉత్పత్తి చేసే చదలవాడ పశు క్షేత్రాన్ని పశు వైద్యాధికారులు శ్రీనివాసరావు, జయచంద్రా, మురళికృష్ణ పరిశీలించారు. ఉత్పత్తి, వీటి పెంపకంపై పశు క్షేత్రం పర్యవేక్షకులు రవి వారికి వివరించారు. ఒంగోలు జాతి పశువులు అన్ని ప్రాంతాల్లోనూ విస్తరించాలనే ఉద్దేశంతో ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో వైద్యాధికారులతో అవగాహన సదస్సు నిర్వహించాం. ప్రతి పశువైద్యుడు తమ పరిధిలో ఒక రైతు వీటిని పెంచుకునేవిధంగా చర్యలు తీసుకోవాలని చెప్పాం. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందించేందుకు ఆలోచన చేస్తున్నామని పశు అభివృద్ధి సంస్థఈవో శ్రీనివాసరావు వెల్లడించారు.

# ఇంటికి వెలుగు ఇల్లాలే!

కడప (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళల ఆర్థికాభివృద్ధి, ఆరోగ్యంపై దృష్టి పెట్టింది. ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం, రుణ వసతి కల్పించడం వంటి కార్యక్రమాలు విస్తృతంగా అమలు చేస్తోంది. దీనికి తోడు ఇల్లాలి విద్య.. ఇంటికి వెలుగని గుర్తించి నిరక్షరాస్యత నిర్మూలనకు అక్షరాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. మహిళలు చదువుకుంటే కుటుంబంతో పాటు సమాజంలోనూ మార్పులు సాధ్యమవుతాయని అక్షరాస్యత కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులను గుర్తించి, వారికి రాత్రి వేళల్లో ప్రత్యేక తరగతులను వాలంటీర్లు బోధిస్తున్నారు. ౖ జిల్లాలో 72,240 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు అధికారులు ప్రణాళికను తయారు చేశారు. వీరిని తీర్చిదిద్దడానికి 5,203 మంది వాలంటీర్లను నియమించారు. పది మంది నిరక్షరాస్యులకు ఒక వాలంటీరు చొప్పున నియమించి, తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని డీపీవో, డీఆర్డీఏ, మెప్మా పీడీలు పర్యవేక్షిస్తున్నారు.ౖ జిల్లాలో వంద శాతం లక్ష్యంగా అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరు అక్షరాస్యులు కావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో మహిళా విద్యను ప్రోత్సహిస్తూ, మహిళా సమాఖ్య, ఉపాధి హామీ పథకాల్లో చదువురాని వారిని గుర్తించారు. యానిమేటర్లు సాయంత్రం వేళ గుర్తించిన మహిళలకు పాఠాలు చెబుతున్నారు. ప్రాథమిక అక్షరాస్యత, డిజిటల్ విద్య, ఆర్థిక విద్య, జీవన నైపుణ్యాలపై తరగతులు నిర్వహిస్తున్నారు. అక్షరాలను గుర్తించడం, రాయడం, చదవడం నేర్పిస్తారు. బస్సులపై ఊర్ల పేర్లు గుర్తిం చడం, పత్రికలు చదివేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.



# తెలుగు భాష, సంస్కృతిని భవిష్యత్తు తరాలకు అందించాలి

◆ ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు ◆ అమలాపురంలో ఘనంగా ప్రారంభమైన మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు

అమలాపురం (చైతన్యరథం): 'తెలుగు భాష కేవలం ఒక భాష మాత్రమే కాదు... మన సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర, సాహిత్యం, కళలు, మన అస్తిత్వానికి ప్రతీక' అని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. ఏపీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో కిమ్స్, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ అధినేత చైతన్యరాజు ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైన మూడవ ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలను ఒక వేదికపైకి తీసుకొచ్చి తెలుగు భాషా వైభవాన్ని చాటిచెప్పడం ఈ మహాసభల ప్రధాన ఉద్దేశమన్నారు. మాతృ భాష తెలుగు భాష మన గౌరవానికి, ఐక్యతకు ఆధారమన్నారు. తెలుగు భాషను పరిరక్షించడం, అభివృద్ధి చేయడం ప్రతి తెలుగువాడు వ్యక్తిగత బాధ్యతగా భావించాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరూ ఐక్యంగా ఉండాలన్నారు. తెలుగు సాహిత్యం, సంగీతం, నాటకం, కళలను ప్రపంచానికి పరిచయం చేయాలన్నారు. యువతలో తెలుగుపట్ల ప్రేమ, గౌరవం పెంపొందించాలన్నారు. మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు ఇచ్చిన స్ఫూర్తితో తెలుగు భాషను, మన సంస్కృతిని భవిష్యత్తు తరాలకు అందించడాన్ని మన కర్తవ్యంగా భావించాలన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల ప్రాముఖ్యతను, తెలుగు భాషా సౌరభాన్ని చాటి చెప్పాలన్నారు భాష, అస్తిత్వం, తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణే ధ్యేయంగా నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు మహాసభలు ప్రతి తెలుగువాడికీ ఒక పండుగ వంటిదన్నారు. "దేశభాషలందు తెలుగు లెస్స" అన్న నానుడిని నిజం చేస్తూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడమే ఈ సభల ప్రధాన లక్ష్యమన్నారు.



### ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు తెలుగు భాషను తప్పనిసరిచేస్తాం: స్పీకర్

ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రసంగిస్తూ ప్రాచీన తెలుగు సాహిత్యం నుంచి నేటి ఆధునిక సాహిత్యం వరకు జరిగిన పరిణామాలను గుర్తు చేసుకుని మాతృ భాష పరిరక్షణపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తెలుగు భాషను తప్పనిసరి చేసేలా శాసనసభలో బిల్లును తీసుకొస్తామని ప్రకటించారు. తెలుగు భాష, సాహిత్య, సంస్కృతుల సమ్మేళనమే ఈ మహాసభలు అన్నారు. కూచిపూడి నృత్యం, జానపద కళలు, తెలుగువారి విశిష్ట జీవనశైలిని ప్రపంచానికి పరిచయం చేయాలని సూచించారు. డిజిటల్ యుగంలో తెలుగును ఎలా ఉపయోగించాలి, కంప్యూటర్లు, చరవాణిల్లో తెలుగు వినియోగాన్ని పెంపొందించే మార్గాలను మరింతగా అన్వేషించాలన్నారు. ఇతర దేశాల్లో నివసిస్తున్న తెలుగువారు తమ మూలాలను మర్చిపోకుండా వారి తర్వాతి తరాలకు తెలుగు భాషను ఎలా అందించాలో ఈ సభల్లో చర్చ జరగాలన్నారు.

శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ప్రసంగిస్తూ... వెయ్యి సంవత్సరాల నాటి తెలుగు భాష చచ్చిపోతే జాతి అంతరిస్తుందన్న పెద్దల మాటను గుర్తుంచుకోవాలన్నారు. తెలుగు కేవలం ఒక సంభాషణ మార్గం మాత్రమే కాదు... అది మన ఆత్మగౌరవమన్నారు. పిల్లలకు అమ్మ భాషలోని తియ్యందనాన్ని రుచి చూపించడం మన బాధ్యత అన్నారు. ముత్యాల వంటి అక్షరాలు, తేనెలొలికే పదాలు మన తెలుగుకే సొంతమన్నారు. ఈ మహాసభలు మనల్ని మన భాషా మూలాలవైపు మళ్లించి తెలుగు వెలుగులను దశదిశలా వ్యాపింపజేయాలని కోరుకుందామన్నారు.

### తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుకుందాం: చాగంటి కోటేశ్వరరావు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు, ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన తెలుగు ప్రియులందరికీ ఈ గొప్ప సాహిత్య దినోత్సవ సందర్భంగా ఘన స్వాగతం పలికారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుకునేందుకు మనమందరం కృషి చేయాలన్నారు. తల్లి భాష అయిన తెలుగు కేవలం మాట్లాడే భాష మాత్రమే కాదని, మన సంస్కృతి, సంప్రదాయం, చైతన్యానికి ప్రతీక అన్నారు. ప్రపంచ తెలుగు మహాసభలు అంటే తెలుగు భాషా వైభవాన్ని నలుదిక్కులా చాటిచెప్పే ఒక జాతీయ, అంతర్జాతీయ సందర్భమన్నారు. తెలుగు సంస్కృతి, సాహిత్యం, సంగీతం, నృత్యం, చలన చిత్ర కళలను ఒకచోటకు చేర్చి తెలుగుప్రియులు, సాహితీ పండితులు, కళాకారులు తెలుగు భాషా వైభవాన్ని చర్చిస్తూ, పంచుకుంటూ భవిష్యత్తు గమనాన్ని నిర్దేశించాలన్నారు. భాష అంటే కేవలం అక్షరాలు, పదాలు మాత్రమే కాదు సంస్కృతి, సమాజ చైతన్యం అన్నారు. రామాయణం, కావ్యాలు, కీర్తనలు, కవిత్వం, రూపకాలు, చలనచిత్రాల ద్వారా తెలుగు భాష శతాబ్దాల పాటు మన భావాలను, విలువలను ప్రపంచానికి చాటిందన్నారు.

సమాజాన్ని, యువతను, సాహిత్య ప్రపంచాన్ని ఒక మెట్టు ముందుకు తీసుకువెళ్లే ప్రయాణంగా మారాలి' అని ప్రముఖ సినీ నటుడు, కథా రచయిత, బహుముఖ ప్రజ్ఞాశాలి తనికెళ్ల భరణి అన్నారు. ప్రతి విద్యార్థికీ ప్రపంచాన్ని శాసించే శక్తిని ఇచ్చేది గురువు మాత్రమే అన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులకు వాత్సల్యం ఉండొచ్చు గానీ విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఇచ్చేది గురువు మాత్రమే అన్నారు. టీచర్ వృత్తి పవిత్రమైనదని... భయపెట్టకుండా విద్యార్థులకు విద్య బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ తెలుగు భాషకు మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు అత్యంత ప్రాధాన్యత కల్పించారన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల



ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు ప్రసంగిస్తూ... తెలుగు భాష ఔన్నత్యం, ప్రాచీన సాహిత్యం, జానపద సంస్కృతిని అంతర్జాతీయ ప్రేక్షకులకు పరిచయం చేయాలన్నారు. సాహిత్య గోష్ఠులు, పత్రికల సమీక్షలు, భాషా పరిశోధన సమావేశాలు, కవి సమ్మేళనాలు, పత్రికా సమావేశాల ద్వారా తెలుగు భాష ఉన్నతికి పాటుపడాలన్నారు. తెలుగు నిఘంటువు, సాహిత్య గ్రంథాల ప్రదర్శనలు, కొత్త పదజాలం అభివృద్ధిపై చర్చలు నిర్వహించాలన్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు తెలుగు మాధ్యమాన్ని మాత్రమే కొనసాగించాలని.. అప్పుడే తెలుగు భాష నిలుస్తుందన్నారు.

'మన తల్లి భాష అయిన తెలుగు సాహిత్య వైభవాన్ని ప్రపంచానికి చాటే ఈ మహాసభలు మన ద్వారా దేశ, విదేశాల్లో ఉన్న తెలుగువారిని ఒకే వేదికపైకి తీసుకువచ్చామన్నారు. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, కళలను కాపాడి మాతృభాష విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలను సంఘటితం చేసి భాషా గర్వం, సాంస్కృతిక జాగృతిని పెంపొందించాలన్నారు.

తెలుగువారి మధ్య సౌభ్రాతృత్వం, సామాజిక ఐక్యత బలపరచడానికి చర్చలు, సంభాషణలను ఫలవంతంగా నిర్వహించాలన్నారు. భాషా ఐక్యత, సాహిత్య వికాసం, సంస్కృతి ప్రదర్శన, ఆధ్యాత్మిక సామాజిక చర్చలు అనే నాలుగు ప్రధాన అంశాల చుట్టూ ఈ మహాసభల్లో సుదీర్ఘమైన చర్చలు చేపట్టి మాతృ భాష అయిన తెలుగును విశ్వవ్యాప్తం చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు.

# జాగ్రత్తగా, సురక్షితంగా ఉండండి

ఈ ఉద్రిక్త, అనిశ్చిత పరిస్థితుల సమయంలో మీరు, మీ కుటుంబ సభ్యులు సురక్షితంగా, ఆరోగ్యంగా ఉన్నారని హృదయపూర్వకంగా ఆశిస్తున్నాను. ఇరాన్‌కు సంబంధించిన ప్రస్తుత ప్రాంతీయ సంఘర్షణ, దాని ప్రభావం గల్ఫ్ ప్రాంతమంతటా కనిపిస్తున్న నేపథ్యంలో ఆందోళన కలగడం సహజమే. ఈ పరిస్థితి త్వరలోనే ముగిసి, శాంతి నెలకొనాలని మనమందరం ప్రార్థిద్దాం.

బహ్రెయిన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతర్, కువైట్, ఒమన్ దేశాల్లో నివసిస్తున్న మన సభ్యులందరూ అప్రమత్తంగా ఉండాలని, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని మనవి చేస్తున్నాను.

**దయచేసి కింది సూచనలను పాటించండి...**

– ప్రశాంతంగా ఉండండి, ఆందోళన చెందవద్దు.

– మీ దేశ ప్రభుత్వాలు జారీ చేసే అధికారిక సూచనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా అనుసరించండి.

– అత్యవసరమైతే తప్ప అనవసర ప్రయాణాలు, గుంపులుగా చేరే కార్యక్రమాలను నివారించండి.

– అత్యవసర సంప్రదింపు నెంబర్లు, ముఖ్యమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోండి.

– కుటుంబ సభ్యులు, స్నేహితులతో సంప్రదింపులో ఉండండి. ముఖ్యంగా భావోద్వేగ సహాయం అవసరమైన వారికి అండగా ఉండండి

– నిర్ధారణ కాని వార్తలు/వదంతులను పంచుకోవడం మానుకోండి.

– ఎవరైనా సహాయం లేదా మద్దతు అవసరమైతే సంకోచించకుండా సంప్రదించండి. గల్ఫ్ ప్రాంతమంతటా మనమందరం ఒకే సమాజంగా ఉన్నాం. ఈ సమయంలో మనం ఐక్యంగా నిలబడి ఒకరికొకరం అండగా ఉండాలి.

– ప్రాంతమంతటా భద్రత, స్థిరత్వం, శాశ్వత శాంతి నెలకొనాలని మనస్ఫూర్తిగా ప్రార్థిద్దాం.



**రాధా కృష్ణ రవి**
అధ్యక్షుడు
ఎన్ఆర్ఐ టీడీపీ
గల్ఫ్ కౌన్సిల్








## దుబాయ్ ఎయిర్‌పోర్ట్‌లు బంద్

పశ్చిమ ఆసియాలో యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో దుబాయ్ ఇంటర్నేషనల్, అల్ మక్తూమ్ ఇంటర్నేషనల్ విమానాశ్రయాల్లో కార్యకలాపాలను నిలిపివేశారు. భద్రతా కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. ప్రయాణికులు ఎవరూ విమానాశ్రయాలకు రావొద్దని, విమాన సమాచారం కోసం సంబంధిత ఎయిర్‌లైన్స్ సంస్థలను సంప్రదించాలని సూచించారు. వేల సంఖ్యలో ప్రయాణికులు విమానాశ్రయాల్లోనే చిక్కుకుపోవడంతో తీవ్ర గందరగోళం నెలకొంది.

ప్రవాసాంధ్ర

NRI TDP

చైతన్యరథం

**ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో క్షిపణి దాడులు ప్రారంభించడంతో పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు పరాకాష్ఠకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో కువైట్, ఇరాన్, ఖతార్ యూఏఈ, సౌదీ అరేబియా, ఇజ్రాయెల్ దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు అక్కడి భారతీయ పౌరుల కోసం విడివిడిగా అత్యవసర భద్రతా మార్గదర్శకాలు జారీ చేశాయి.**



# గల్ఫ్ దేశాల్లో భారతీయులు అప్రమత్తం

గల్ఫ్: ప్రస్తుత అస్థిర పరిస్థితుల దృష్ట్యా భారతీయులందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అనవసర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని ఎంబసీలు సూచించాయి. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని, కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని సూచించాయి. క్షేత్రస్థాయిలో పరిస్థితులను భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఎప్పటికప్పుడు గమనిస్తోందని తెలిపింది.

వివిధ దేశాల్లోని భారతీయుల కోసం అందుబాటులో ఉన్న అత్యవసర సంప్రదింపుల వివరాలు:

**కువైట్:** ఇక్కడి భారతీయులు పరిసరాలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలి. ఎంబసీ తన సేవలను యథావిధిగా కొనసాగిస్తోంది.

హెల్ప్‌లైన్: +965 65501946

ఈ-మెయిల్: community.kuwait@mea.gov.in

**ఇరాన్:** సైనిక స్థావరాలపై దాడుల నేపథ్యంలో ఇరాన్‌లోని భారతీయ విద్యార్థులు, ఉద్యోగులు వెంటనే ఎంబసీ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి.

మొబైల్: +98-21-88755103/88755105

వాట్సాప్: +98-9128109115

ఈ-మెయిల్: cons.tehran@mea.gov.in

**ఖతార్:** ఇక్కడి భారతీయులు సైనిక ప్రాంతాలకు దూరంగా ఉండాలి. అత్యవసరమైతే తప్ప భవనాల నుంచి బయటకు రాకూడదు.

24/7 హెల్ప్‌లైన్: 00974-55647502

ఈ-మెయిల్: cons.doha@mea.gov.in

**యూఏఈ:** అబుదాబి దుబాయ్‌లోని భారతీయులు స్థానిక ప్రభుత్వం జారీచేసే నిబంధనలను కచ్చితంగా పాటించాలి.

టోల్‌ఫ్రీ: 800-46342

వాట్సాప్: +971543090571

ఈ-మెయిల్:

pbsk.dubai@mea.gov.in/
ca.abudhabi@mea.gov.in

**సౌదీ అరేబియా:** రియాద్‌లోని ఎంబసీ, జెడ్డాలోని కాన్సులేట్ యథావిధిగా పనిచేస్తున్నాయి. పౌరులు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలి.

24/7 హెల్ప్‌లైన్: 00-966-11-4884697

వాట్సాప్: 00-966-542126748

టోల్ ఫ్రీ: 800 247 1234

ఈ-మెయిల్: cw.riyadh@mea.gov.in

**ఇజ్రాయెల్:** పౌరులు హోమ్ ఫ్రంట్ కమాండ్ సూచనలను కచ్చితంగా పాటించాలి. ఎల్లప్పుడూ సురక్షిత ప్రాంతాలకు అందుబాటులో ఉండాలి.

24/7 హెల్ప్‌లైన్: +972-54-7520711/+972-54-2428378

ఈ-మెయిల్: cons1.telaviv@mea.gov.in

**గమనిక: అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం భారతీయులు పై నెంబర్లను (లేదా) సంబంధిత రాయబార కార్యాలయాలను నిరంతరం సంప్రదించవచ్చు.**

## ప్రయాణికులకు DGCA కీలక సూచన

- మిడిల్ ఈస్ట్ దేశాలకు ప్రయాణాలు రద్దు చేసుకోవాలని డీజీసీఏ కోరింది.
- ఎయిరిండియా ఇప్పటికే మిడిల్ ఈస్ట్ దేశాలకు విమాన సర్వీసులను రద్దు చేసింది.
- దుబాయ్‌లోని అన్ని విమానాశ్రయాలను మూసివేశారు.
- ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌కు రావొద్దని సూచన.
- దుబాయ్ మీదుగా ఇతర దేశాలకు వెళ్లే విమానాలపై ప్రభావం
- భారత్ ఎయిర్‌పోర్టులకు దుబాయ్ ఎఫెక్ట్
- ఎయిర్‌పోర్టుల్లో ప్రయాణికుల పడిగాపులు
- ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా విమాన ప్రయాణాలకు అంతరాయం ఏర్పడే అవకాశముందని ఢిల్లీ ఎయిర్‌పోర్టు అధికారులు వెల్లడించారు.
- ప్రయాణికులు విమానాశ్రయానికి చేరుకునే ముందు విమానయాన సంస్థలను సంప్రదించాలని సూచించారు.








# అమలాపురంలో తెలుగు వెలుగు

అమలాపురం (చైతన్యరథం): ఏపీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం తెలుగు వెలుగుతో కాంతులీనింది. తెలుగు వైభవాన్ని, కీర్తిని నలుదిక్కులకూ చాటిచెప్పింది. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పే లక్ష్యంతో శనివారం ప్రారంభమైన మూడవ ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొనేందుకు అతిరథ, మహారథులు విచ్చేశారు. ముఖ్య అతిథిగా ఒడిసా గవర్నర్ కంభంపాటి హరిబాబు, అతిథులుగా శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు హాజరయ్యారు. భాషాభిమానులు, పండితులు, సాహితీవేత్తలు పెద్ద సంఖ్యలో హాజరై సభను మరింత వైభవంగా తీర్చిదిద్దారు.

ప్రఖ్యాత ప్రవచనకర్తలు చాగంటి కోటేశ్వరరావు, గరికపాటి నరసింహారావు తమ ఆలోచనాత్మక ఉపన్యాసాలతో సభను ఆకట్టుకున్నారు. ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి తెలుగు భాష మాధుర్యాన్ని కీర్తిస్తూ ప్రత్యేక సందేశం అందించారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వారణాసి రామ్‌మాధవ్, కాంగ్రెస్ సీనియర్ నేత ఎన్.తులసిరెడ్డి తమ ప్రసంగాల్లో తెలుగు భాష అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.



మహాసభల నిర్వాహకుడు, గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ కులపతి కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) పలు వివరాలు వెల్లడించారు.

తెలుగు తల్లి మహిమాన్విత గీతాలతో ప్రారంభమైన మహాసభలో ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, పేరాబత్తుల రాజశేఖరం, కిమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ కె.రవికిరణ్‌వర్మ, కె.శశికిరణ్ వర్మ, సీఏవో ఎ.రఘువర్మ, సురేష్‌మోహన్ రాజు, అముదా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, బీజేపీ సీనియర్ నాయకుడు మోకా వెంకట సుబ్బారావు, ప్రపంచ తెలుగు మహాసభల నిర్వాహక కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భాషాభిమానులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనలు, సాహిత్య చర్చలు, కవిసమ్మేళనాలు అలరించాయి.






# దేశవాప్తంగా హెచ్‌పీవీ టీకా పంపిణీ

## రాజస్థాన్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ



దేశవ్యాప్తంగా హెచ్‌పీవీ టీకా కార్యక్రమం ప్రారంభమైంది. శనివారం రాజస్థాన్‌లోని అజ్మేర్‌లో ప్రధాని నరేంద్రమోదీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో పాటు, నివారించదగిన మరికొన్ని రకాల క్యాన్సర్లను అరికట్టడమే లక్ష్యంగా కేంద్రం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులోభాగంగా 14 సంవత్సరాల బాలికలకు 'గార్డాసిల్' అనే టీకాను ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ వ్యాక్సిన్ హెచ్పీవీ టైప్ 16, 18తో పాటు టైప్ 6, 11 రకాల నుంచి ఇది రక్షణ కల్పించనున్నట్లు కేంద్రం తెలిపింది. గర్భాశయ క్యాన్సర్ నివారణకు ప్రపంచస్థాయి వ్యూహంలో భాగంగా హెచ్పీవీ వ్యాక్సినేషన్ చేపట్టాలంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన సిఫార్సు మేరకు కేంద్రం దీనిని ప్రారంభించింది. ప్రతి ఏటా 115 కోట్ల వ్యాక్సిన్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఈ వ్యాక్సిన్ 2006లో అందుబాటులోకి రాగా, ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 50 కోట్ల డోసులు పంపిణీ చేశారు. దీంతో పలు దేశాల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు గణనీయంగా తగ్గినట్లు అంచనా. 160 దేశాల్లో ఇప్పటికే ఈ టీకా పంపిణీ కార్యక్రమం అమల్లో ఉండగా, వీటిలో 90 దేశాలు సింగిల్ డోసులు అందిస్తున్నాయి. ప్రపంచంలో క్యాన్సర్ బాధితుల సంఖ్యాపరంగా చైనా, అమెరికా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. 2040 నాటికి దేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య ఏటా 20 లక్షలకు చేరే అవకాశం ఉందని అంచనా. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఏటా 2 కోట్ల మంది క్యాన్సర్ బారిన పడుతుండగా, వీరిలో 15 లక్షల మంది భారతీయులే ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.

# సీట్ల పంపకానికి డీఎంకేతో కాంగ్రెస్ పందేరం

## కుదరకపోతే విజయ్‌పార్టీ వైపు మొగ్గు



తమిళనాడులో అధికార డీఎంకే, కాంగ్రెస్ పార్టీల మధ్య సీట్ల పంపకంపై ప్రాథమికంగా చర్చలు మొదలయ్యాయి. ఏ క్షణంలోనైనా ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉండడంతో ఇప్పటినుంచే సీట్ల పంపకంపై ఇరుపార్టీలు కసరత్తు మొదలుపెట్టాయి. ఏఐసీసీ తమిళనాడు ఇన్చార్జి గిరీష్ చోదంకర్, టీఎస్సీసీ చీఫ్ సెల్వపెరుంతగై, ఏఐసీసీ కో ఇన్చార్జి నివేదితా ఆల్వా డీఎంకే రాష్ట్ర కార్యాలయానికి చేరుకున్నారు. డీఎంకే సీనియర్ నేత టీఆర్ బాలు నేతృత్వంలోని ప్యానెల్‌తో చర్చలు ప్రారంభించారు. తమిళనాట 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 25 స్థానాలకు కాంగ్రెస్ పోటీ చేసింది. ఈసారి కనీసం 35 స్థానాలు తమకు కేటాయించాలని, రెండు రాజ్యసభ స్థానాలు కూడా ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. తొలుత అధికారంలో కూడా భాగస్వామ్యం కావాలన్న డిమాండ్ కూడా డీఎంకే ముందుంచింది. ప్రస్తుతానికి ఆ విషయాన్ని పక్కనపెట్టి అధిక సీట్లు, రాజ్యసభ సీటు విషయంలో పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు డీఎంకే మాత్రం 27, 28 స్థానాలు, ఒక రాజ్యసభ సీటును ఆఫర్ చేసేందుకు సుముఖంగా ఉన్నట్లు సమాచారం. ఒకవేళ డీఎంకే, కాంగ్రెస్ల మధ్య సీట్ల పంపకం విఫలమైతే తమిళనాడులో కొత్త పొత్తులు చిగురించే సూచనలు కనిపిస్తున్నాయి. టీవీకే విజయ్‌తో కలిసి వెళ్లే విషయాన్నీ కాంగ్రెస్ పరిశీలించొచ్చని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అటు విజయ్ పార్టీ కూడా కాంగ్రెస్ కలిసి వెళ్లే అంశంపై సుముఖంగా ఉంది. దీనిపై విజయ్ నేరుగా స్పందించనప్పటికీ.. ఆయన తండ్రి ఎస్ఏ చంద్రశేఖర్ మాత్రం ఇప్పటికే హింట్ ఇచ్చారు. కాంగ్రెస్‌కు పూర్వవైభవం తెచ్చేందుకు విజయ్ సిద్ధంగా ఉన్నారంటూ, నిర్ణయం మాత్రం ఆ పార్టీ చేతుల్లో ఉందని పేర్కొన్నారు. ఈ ఆఫర్ను కాంగ్రెస్ నేతలు తోసిపుచ్చినప్పటికీ.. డీఎంకేతో పొత్తు విఫలమైతే ఇరు పార్టీలూ కలిసి వెళ్లే అంశాన్ని కొట్టిపారేయలేమని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అదే జరిగితే చిరకాల మిత్రులుగా, ఇండియా కూటమి భాగస్వాములుగా ఉన్న డీఎంకే, కాంగ్రెస్‌ల మధ్య దూరం పెరిగే అవకాశం ఉంది.

# కేంద్రం హామీలకు పార్లమెంటు బాధ్యత వహించదు : సుప్రీం

చట్టాన్ని సమీక్షించడంపై కేంద్ర ప్రభుత్వం కోర్టుకు హామీ ఇచ్చినా.. అందుకు పార్లమెంటు బాధ్యత వహించదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. పార్లమెంటుకు చట్టాన్ని రూపొందించే "సంపూర్ణ స్వతంత్ర అధికారం" ఉందని స్పష్టం చేసింది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 152 చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారిస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. సెక్షన్ 152 దేశ సార్వభౌమత్వం, ఏకత్వం, సమగ్రతకు భంగం కలిగించే చర్యలకు సంబంధించినది. గతంలో రద్దు చేసిన ఐపీసీలోని సెక్షన్ 124ఏ (దేశద్రోహం)ను కేంద్రం సెక్షన్ 152 ద్వారా తిరిగి ప్రవేశపెడుతోందని పిటిషనర్ల తరఫు న్యాయవాదుల్లో ఒకరు వాదించారు. "ఈ చట్టాన్ని ప్రభుత్వం సమీక్షించేవరకు అమలు చేయొద్దని, దీన్ని ఉపయోగిస్తూ కొత్త ఎఫ్ఎస్ఐఆర్లు నమోదు చేయొద్దని సుప్రీంకోర్టుకు చెందిన ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం 2022 మే నెలలో పేర్కొంది. ఆ సమయంలో కేంద్రం ఆ చట్టాన్ని పునఃసమీక్షిస్తామని సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది" అని న్యాయవాది వివరించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. 'కేంద్రం హామీ ఇచ్చి ఉండవచ్చు. కానీ, పార్లమెంటు దానికి బాధ్యత వహించదు' అని తెలిపింది.




# భగ్గుమన్న పశ్చిమాసియా

## తిరిగొచ్చిన ఎయిరిండియా విమానం

దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియా భగ్గుమంది. ఇజ్రాయెల్, ఇరాన్ తమ గగనతలాలను మూసివేశాయి. దీంతో ఢిల్లీ నుంచి ఇజ్రాయెల్లోని టెల్ అవీవ్ బయలుదేరిన ఎయిరిండియా విమానం వెనక్కి తిరిగివచ్చింది. పశ్చిమాసియాకు వెళ్లే విమానాలు రద్దు చేస్తున్నట్లు ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. మరో దేశీయ విమానయాన సంస్థ ఇండిగో కూడా పశ్చిమాసియా దేశాలకు విమానాలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ప్రయాణికులు, సిబ్బంది భద్రతే తమకు ముఖ్యమని పేర్కొంది. నిరంతరం పరిస్థితులు మారుతుండడంతో ప్రయాణికులకు కావాల్సిన సర్దుబాట్లు చేయడానికి తమ సిబ్బంది కృషి చేస్తున్నారని వెల్లడించింది. పశ్చిమాసియాలో అస్థిరమైన పరిస్థితుల మధ్య ఆయా దేశాలకు వెళ్లే అంతర్జాతీయ విమానాలకు అంతరాయాలు ఎదురయ్యే అవకాశం ఉందని ఢిల్లీ విమానాశ్రయం ప్రయాణికులకు హెచ్చరిక జారీ చేసింది. మరోవైపు ఇరాన్, ఇజ్రాయెల్‌కు వెళ్లాల్సిన తమ విమానాలను రద్దు చేస్తున్నట్లు అనేక విమానయాన సంస్థలు వెల్లడించాయి. ఈ మేరకు జర్మనీ, రష్యా, ఫ్రాన్స్ ఇతర దేశాలకు చెందిన విమానయాన సంస్థలు ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేశాయి.


# లండన్‌లో అగ్నిప్రమాదం : భారతీయుడి మృతి

## అవయవదానానికి తల్లిదండ్రులు అనుమతి

లండన్‌లోని క్రొయిడాన్ ప్రాంతంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఏపీకి చెందిన గొంతి అభిషేక్ ప్రాణాలు కోల్పోయాడు. తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న నిజామాబాద్‌కు చెందిన సాయి శ్రీకర్‌ను వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధరించారు. ఒకే రూమ్లో ఉంటున్న వీరు ఎంబీఏ పూర్తిచేసి పార్ట్ టైమ్ ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ అగ్నిప్రమాదం నుంచి తప్పించుకున్న మరో విద్యార్థి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. లండన్ డుప్పాస్ హిల్స్ టెర్రాస్లోని రెండు అంతస్తుల నివాసంలో ఇటీవల గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. గ్రౌండ్ ఫ్లోర్ నుంచి మొదటి అంతస్తుకు మంటలు, దట్టమైన పొగ వ్యాపించడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో సాయి శ్రీకర్ అవయవాలు దానం చేసేందుకు నిజామాబాద్‌లోని శ్రీనగర్ కాలనీకి చెందిన అతని తల్లిదండ్రులు వెల్లడించారు.







# రిటైర్డ్ అగ్నివీరులకు రైల్వే ఉద్యోగాలు

## 9 జోన్లతో కుదిరిన అవగాహన ఒప్పందాలు

సైన్యం నుంచి అగ్నివీ రిటైరయ్యాక వారికి ఉద్యోగావకాశాలను కల్పించే దిశగా కేంద్రప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఇందుకోసం రైల్వే శాఖ, సైన్యం కలిసి సహకార ముసాయిదా (ఫ్రేమ్వర్క్ ఆఫ్ కోఆపరేషన్)ను అమల్లోకి తెచ్చాయి. దీంతో రిటైర్డ్ అగ్నివీరులు, ఆర్మీ సిబ్బందికి రైల్వేశాఖలో ఉద్యోగాల కల్పన జరగనుంది. దీనిపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ప్రత్యేక హెల్ప్ లైన్ వ్యవస్థనూ అందుబాటులోకి తేనున్నారు. ఈ మేరకు రైల్వేశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. ఆర్మీ మాజీ సిబ్బందికి రైల్వేశాఖలోని లెవల్-2, అంతకంటే ఎక్కువ స్థాయి పోస్టుల్లో 10శాతం రిజర్వేషన్లను అమలు చేస్తారు. లెవల్-1 పోస్టుల్లో సైనిక మాజీ సిబ్బందికి 20 శాతం రిజర్వేషన్లు అమలవుతాయి. రిటైర్డ్ అగ్నివీర్‌లకు లెవల్-2, అంతకంటే ఎక్కువ స్థాయి పోస్టుల్లో అదనంగా 5 శాతం, లెవల్-1 పోస్టుల్లో అదనంగా 10 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తామని రైల్వేశాఖ వెల్లడించింది. సాధారణ రిక్రూట్మెంట్ ప్రక్రియ పూర్తయ్యేవరకు వేగవంతమైన భర్తీలు చేపట్టేందుకుగానూ ఆర్మీ మాజీ సిబ్బందిని కాంట్రాక్టు ప్రాతిపదికన పాయింట్స్ మెన్‌గా నియమించుకుంటామని రైల్వేశాఖ వెల్లడించింది. ఇందుకోసం సంబంధిత ఆర్మీ సంస్థలతో 9 రైల్వే డివిజన్లు అవగాహన ఒప్పందాలు(ఎంఓయూ) కుదుర్చుకున్నాయని తెలిపింది.

# అట్టుడుకుతున్న పశ్చిమాసియా!







- అమెరికా సాయంతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు
- 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'గా ప్రకటించిన అమెరికా
- 'ఆపరేషన్ రోరింగ్ లయన్'గా ప్రకటించిన నెతన్యాహు
- ప్రతి దాడులకు దిగిన ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్
- మరోపక్క వాణిజ్య నౌకలపై దాడులకు హూతీలు సన్నద్ధం
- అలెర్టయిన యూఏఈ, ఖతార్ దేశాలు
- అడ్వైజరీ జారీ చేసిన భారత రాయబార కార్యాలయాలు

అమెరికా బలగాల మోహరింపుతో కొన్నిరోజులుగా నివురుగప్పిన నిప్పులా ఉన్న పశ్చిమాసియా శనివారం భగ్గుమంది. ఇరాన్ లక్ష్యంగా ఇజ్రాయెల్, అమెరికాలు దాడులకు దిగాయి. తమ సైనిక చర్యను 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'గా అమెరికా రక్షణశాఖ కార్యాలయం 'పెంటగాన్' ప్రకటించుకుంది. సోషల్ మీడియా ద్వారా ఈమేరకు ప్రకటన చేసింది. ఇజ్రాయెల్ దాడులను 'ఆపరేషన్ రోరింగ్ లయన్'గా ప్రధాని నెతన్యాహు పేర్కొన్నారు. ఇరాన్ సైతం ప్రతిదాడులు చేపట్టింది. ఇజ్రాయెల్‌తోపాటు పశ్చిమాసియాలోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. తమ దేశంలోని అమెరికా నేవీ 5వ ఫ్లీట్స్‌పై క్షిపణి దాడి జరిగినట్టు బహ్రెయిన్ తెలిపింది. యూఏఈ, కువైట్, ఖతార్లలోనూ పేలుళు వినిపించినట్టు అంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి. యూఏఈలో ఒకరు మృతి చెందినట్టు అధికారిక మీడియా తెలిపింది. యూఏఈ, ఖతర్ తదితర దేశాలు ఇప్పటికే తమ గగనతలాన్ని మూసివేశాయి. మరోవైపు.. వాణిజ్య నౌకలపై దాడులను పునఃప్రారంభించనున్నట్టు యెమెన్‌కు చెందిన హూతీ తిరుగుబాటుదారులు ప్రకటించారు.

అణు ఒప్పందంపై అమెరికా– ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణి దాడులకు పాల్పడింది. టెహ్రాన్ అంతటా పేలుళ్లు వినిపించాయి. దీంతో ఆ ప్రాంతంలో భారీగా పొగ వ్యాపించింది. అమెరికా సాయంతోనే ఇజ్రాయెల్ దాడులు చేస్తోందన్నది బహిరంగ రహస్యం. అయితే, దాడిని తామే చేశామని టెల్‌అవీవ్ ప్రకటించింది. శత్రు దేశంనుంచి పొంచిఉన్న ముప్పును తప్పించేందుకు దాడులు చేసినట్టు ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి కట్జ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ నివాసం, నిఘా ప్రధాన కార్యాలయం సహా మొత్తం 30 ప్రాంతాలు లక్ష్యంగా దాడులు జరిగాయి. ఇరాన్ అధ్యక్షుడి భవనం, కీలక ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోనే దాడులు జరగ్గా.. మొదటి దాడి సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ ఆఫీస్ సమీపంలోనే జరిగినట్లు సమాచారం. అయితే, ఆ సమయంలో ఖమేనీ టెహ్రాన్‌లో లేరని, అప్పటికే ఆయనను సురక్షిత ప్రాంతానికి తరలించినట్టు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. దాడులు చేస్తామని అమెరికా బెదిరిస్తున్న నేపథ్యంలో ఖమేనీ కొన్ని రోజులుగా బహిరంగంగా కనిపించడం లేదని సమాచారం. హర్మోజ్‌గాన్ బాలికల పాఠశాలపై జరిగిన దాడిలో 40మంది మృతి చెందినట్టు స్థానిక మీడియా వెల్లడించింది. మరో 45మంది గాయపడినట్టు తెలిపింది. ఇరాన్ పారామిలిటరీ 'ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్‌కు ఈ ప్రాంతంలో స్థావరం ఉంది.

ఇదిలావుంటే, టెల్‌అవీవ్ సైన్యం తమ దేశ ప్రజలను అప్రమత్తం చేసింది. వైమానిక దాడులు జరిగే అవకాశం ఉన్నందున దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించింది. టెల్‌అవీవ్ సహా పలు ప్రాంతాల్లో సైరన్లు మోగాయి. స్కూళు, కార్యాలయాలను మూసివేయాలని ఆదేశించింది. దాడుల్లో అమెరికా హస్తం ఉన్నట్లు అధికార వర్గాలను ఉటంకిస్తూ మీడియాలో కథనాలు వస్తున్నాయి. తాజా దాడుల నేపథ్యంలో పౌర విమానాలకు ఇజ్రాయెల్ తన గగనతలాన్ని మూసివేసింది. అటు ఇరాన్, ఇరాక్‌లు కూడా గగనతలాన్ని మూసివేస్తున్నట్టు ప్రకటించాయి. ఇరాన్‌లో మొబైల్ ఫోన్ సేవలు నిలిచిపోయాయి.

### ప్రతిదాడులకు దిగిన ఇరాన్

ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. ఇరాన్ వైపునుంచి క్షిపణులు దూసుకెళ్లాయి. ఈ మేరకు ఆ దేశ మిలిటరీ వెల్లడించింది. ఆ సమయంలో ఇజ్రాయెల్‌లోని హోమ్ ఫ్రంట్ కమాండ్ యాప్ ఎర్రగా మారిపోయింది. అది ఎప్పటికప్పుడు రియల్ టైమ్ హెచ్చరికలు, అత్యవసర మార్గదర్శకాలు చూపిస్తుంటుంది. ఇరాన్‌నుంచి వచ్చే క్షిపణులను అది గుర్తించడంవల్లే రెడ్ కలర్లోకి మారిపోయిందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. డ్రోన్లు, క్షిపణులతో తాము తొలుత ప్రతీకార దాడిని ప్రారంభించామని, ఇవి కొనసాగుతాయని ఇరాన్‌కు చెందిన రివల్యూషనరీ గార్డ్ తెలిపింది.

### ఇరాన్ నాయకత్వాన్నే టార్గెట్ చేశాం: ఇజ్రాయెల్

ఇదిలావుంటే, ఇరాన్‌పై దాడుల్లో ఆ దేశ అగ్రనాయకత్వాన్ని టార్గెట్ చేసినట్టు ఇజ్రాయెల్ వెల్లడించింది. మరోవైపు ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్‌కు చెందిన పలువురు సీనియర్ కమాండర్లు.. పాలనా విభాగంలోని అత్యున్నత అధికారులు ప్రాణాలు కోల్పోయినట్టు స్థానిక మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. మృతుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## భారత రాయబార కార్యాలయాలు అప్రమత్తం

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాల సంయుక్త సైనిక ఆపరేషన్‌తో గల్ఫ్‌లోని భారత రాయబార కార్యాలయాలు అప్రమత్తమయ్యాయి. భారత పౌరులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, స్థానిక అధికారుల సూచనలను పాటించాలని పేర్కొన్నాయి. ఈమేరకు యూఏఈ, సౌదీ అరేబియా, జోర్డాన్‌తోపాటు గల్ఫ్ ప్రాంతాల్లోని పలు భారత ఎంబసీలు అడ్వైజరీలు జారీ చేశాయి. "దేశంలో ఉన్న భారత పౌరులు అనవసర ప్రయాణాలు మానుకోండి. అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉంటూ యూఏఈ అధికారులు ఇచ్చిన భద్రతా మార్గదర్శకాలు పాటించండి" అని యూఏఈలోని భారత ఎంబసీ ప్రకటించింది. అబుదాబీలోని ఎంబసీ, దుబాయ్‌లోని కాన్సులేట్ జనరల్ కార్యాలయాల్లో సేవలు నిరంతరం అందుబాటులో ఉంటాయని, అత్యవసర సమయాల్లో సంప్రదించవచ్చని తెలిపింది. సౌదీ అరేబియాలో ఉన్న భారత పౌరులు అప్రమత్తంగా ఉండాలని రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం పేర్కొంది. జెడ్డాలోని కాన్సులేట్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపింది. పశ్చిమాసియాలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా జోర్డాన్‌లోని భారతీయ పౌరులు, పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని అడ్వైజరీలో పేర్కొంది. వాణిజ్య విమాన సర్వీసులకు అంతరాయం కలగకముందే భారతీయ పర్యాటకులంతా తక్షణమే జోర్డాన్‌ను వీడాలని సూచించింది. బహ్రెయిన్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా పౌరులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. స్థానిక అధికారులిచ్చే మార్గదర్శకాలు, ఎంబసీ సూచనలు పాటించాలని తెలిపింది. పాలస్తీనాలో ఉన్న భారతీయ పౌరులందరూ అప్రమత్తంగా ఉండాలని రామల్లాలోని భారత ప్రతినిధి కార్యాలయం వెల్లడించింది. అనవసర ప్రయాణాలు మానుకోవాలని సూచించింది. వీటితోపాటు ఇజ్రాయెల్, ఇరాన్‌లలోని భారత రాయబార కార్యాలయాలు అనవసర ప్రయాణాలు చేయొద్దంటూ అక్కడ ఉన్న భారత పౌరులను హెచ్చరించాయి.



## మాట వినకుంటే ఇరాన్ నాశనమే

**దారికి రాకుంటే దేశాన్నే నాశనం చేస్తామన్న డొనాల్డ్ ట్రంప్**



ఇరాన్‌పై యూఎస్–ఇజ్రాయెల్ చేపట్టిన సంయుక్త దాడులను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధ్రువీకరించారు. తాము ఎన్ని హెచ్చరికలు చేసినా ఇరాన్ తన అణుకేంద్రాల పునర్నిర్మాణానికి, క్షిపణులను అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. అందువల్లే ఆ దేశానికి వ్యతిరేకంగా భారీ సైనిక చర్య చేపట్టామని వెల్లడించారు. ఇక ఎప్పటికీ ఇరాన్ అణ్వాయుధాలను కలిగిఉండకుండా వాటిని పూర్తిగా నాశనం చేస్తున్నామన్నారు. ఆ దేశ నాయకులు ఇప్పటికైనా తమ మాట వినకపోతే మొత్తం దేశాన్ని నాశనం చేస్తామని హెచ్చరించారు. ప్రపంచంలోని ఉగ్రవాదానికి ఇరాన్ అతి పెద్ద మద్దతుదారని ట్రంప్ పేర్కొన్నారు. ఇటీవల నిరసనలు చేపట్టిన తన సొంత పౌరులనే అక్కడి ప్రభుత్వం వీధుల్లో దారుణంగా చంపేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాద పాలనలో ఉన్న దేశం దగ్గర అణ్వాయుధాలు ఉండడం ప్రమాదకరమని.. అందువల్లే వాటిని నాశనం చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. ఇరాన్ పాలకుల ముప్పునుంచి అమెరికాను రక్షించుకోవడమే తమ లక్ష్యమన్నారు. ఇకనైనా అణ్వాయుధాల కోసం వారు చేసే దుర్మార్గపు ప్రయత్నాలు మానుకోవాలని.. లేదంటే మరిన్ని తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## ఇరాన్‌తో అస్తిత్వ ముప్పు

**అందుకే దాడులని ప్రకటించిన నెతన్యాహు**



ఇరాన్‌పై దాడులను ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు సమర్థించుకున్నారు. టెహ్రాన్‌నుంచి తమకు అస్తిత్వ ముప్పు ఉందని, వీటిని తొలగించేందుకే అమెరికాతో కలిసి ఆపరేషన్ చేపట్టామన్నారు. ఇరాన్‌లోని క్షిపణి స్థావరాలు, పారామిలటరీ రెవల్యూషనరీ గార్డు, బాసిజ్ దళానికి చెందిన వాలంటీర్లపైనా దాడులు చేస్తున్నామన్నారు. "47 ఏళ్లుగా వారి పాలన ఇజ్రాయెల్, అమెరికాకు ముప్పుగా మారింది. ఎంతోమంది అమెరికన్లను బలి తీసుకోవడంతోపాటు తమ పౌరులనూ ఊచకోత కోసింది. ఇటువంటి వారికి అణ్వాయుధాలతో మానవాళిని బెదిరించే అవకాశం ఇవ్వకూడదు. ఇరాన్‌లోని అన్ని వర్గాలకు.. నిరంకుశ పాలననుంచి విముక్తి, స్వేచ్ఛ, శాంతిని పొందే సమయం ఆసన్నమైంది" అని దేశ పౌరులను ఉద్దేశిస్తూ విడుదల చేసిన వీడియో సందేశంలో నెతన్యాహు పేర్కొన్నారు. ఉద్రిక్తతల నేపథ్యంలో సైన్యం ఇచ్చే ఆదేశాలను ఇజ్రాయెల్ పౌరులు పాటించాలని నెతన్యాహు సూచించారు. ఈ ఆపరేషన్ రానున్న రోజుల్లో కొనసాగే అవకాశం ఉందని, కలసికట్టుగా ధైర్యంగా పోరాడాల్సి ఉంటుందన్నారు.

## సైనికాధికారులకు స్నైపర్ల గిఫ్ట్



***ఉ.కొరియా నియంత విచిత్ర నిర్ణయం - రైఫిల్ ఎయిమ్‌తో కిమ్ కుమార్తె ఫొటో వైరల్***

ఉత్తర కొరియా నియంత తమ ప్రభుత్వ, సైనిక అధికారులకు స్నైపర్ రైఫిళ్లను బహుమతిగా ఇచ్చారు. కిమ్ కుమార్తె కిమ్ జు యే స్నైపర్ రైఫిల్ ఎయిమ్ చేసిన ఫొటోను ఆ దేశ మీడియా విడుదల చేసింది. ఆమెతోపాటు కిమ్, ఇతర సైనిక ఉన్నతాధికారులు రైఫిళ్లను ఎయిమ్ చేసిన ఫొటోలు వైరల్‌గా మారాయి. దీంతో దేశ నాయకత్వ బాధ్యతలను స్వీకరించడానికి కిమ్ కుమార్తె సిద్ధమవుతున్నట్టు వస్తున్న వార్తలకు బలం చేకూరుతోంది. ఉత్తర కొరియాలో ప్రతి ఐదేళ్లకోసారి జరిగే వర్కర్స్ పార్టీ కార్యక్రమాన్ని ఇటీవల నిర్వహించారు. అందులో భాగంగానే ప్రభుత్వ, సైనిక అధికారులు తనకు నమ్మకంగా పని చేస్తున్నందుకు కృతజ్ఞతగా కిమ్‌వారికి రైఫిల్స్ బహూకరించినట్టు వార్తా సంస్థలు వెల్లడించాయి. అంతేకాకుండా ఇటీవల కాంగ్రెస్‌లో పదోన్నతి పొందిన కిమ్ సోదరి కిమ్ యో జోంగ్ ప్రస్తుతం పార్టీ కేంద్ర కమిటీ జనరల్ అఫైర్స్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారని పేర్కొన్నాయి. పార్టీ అంతర్గత కార్యకలాపాలు, పరిపాలనా వ్యవహారాలను ఆమె పర్యవేక్షిస్తున్నట్టు తెలిపాయి. కిమ్ జోంగ్ ఉన్ తన రాజకీయ వారసురాలిగా కుమార్తె కిమ్ జు యేను ప్రకటించే అవకాశాలున్నట్టు దక్షిణ కొరియా నిఘా సంస్థ అంచనా వేసింది. తర్వాత ఆయుధ పరీక్షలనుంచి మిలిటరీ పరేడ్ల వరకూ పలు అధికారిక, కీలక కార్యక్రమాల్లో ఆమె తండ్రి వెంట హాజరైంది. వాస్తవానికి ఉత్తరకొరియా పురుషాధిక్య నాయకత్వ క్రమాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఆమెకు వారసత్వ బాధ్యతలు అప్పగించే అవకాశాలు తక్కువనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అయితే ఇటీవల జరిగిన వర్కర్స్ పార్టీ సదస్సు వేదికగా కిమ్ తన వారసత్వ ప్రణాళికలకు పార్టీపరంగా ఆమోదముద్ర వేసుకునే అవకాశముందని దక్షిణ కొరియా అంచనా వేసింది. అయితే, ఈ కార్యక్రమంలో కిమ్ ఎటువంటి ప్రకటనా చేయలేదు.



# పాక్ గెలుపు..అయినా ఇంటికే..



- దాసున్ శనక బాదుడుతో రన్‌రేట్ డౌన్
- ఓడినా ఆకట్టుకున్న శ్రీలంక బ్యాటర్లు
- సెమీస్‌కు చేరిన న్యూజిలాండ్

పల్లెకెలె: టీ20 ప్రపంచ కప్‌లో భాగంగా శ్రీలంకతో జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో పాకిస్థాన్ 5 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో గెలిచినా పాక్ సెమీస్‌కు అర్హత సాధించలేకపోయింది. పాకిస్థాన్ కంటే మెరుగైన నెట్ రన్‌రేట్‌తో న్యూజిలాండ్ ముందంజ వేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. శ్రీలంకను 147 లేదా అంతకంటే తక్కువ పరుగులకు కట్టడి చేసి విజయం సాధిస్తే పాకిస్థాన్ సెమీస్‌కు వెళ్లేది. శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 207 పరుగులు చేసింది. చివర్లో దాసున్ శనక (76: 31 బంతుల్లో 2 ఫోర్లు, 8 సిక్సులు) చెలరేగి నా లంకకు ఓటమి తప్పలేదు. పవన్ రత్నానాయకే (58; 37 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు) రాణించాడు.

# తండ్రి అంత్యక్రియల్లో రింకు సింగ్



టీమిండియా హిట్టర్ రింకు సింగ్ ఇంట విషాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. శుక్రవారం అతడి తండ్రి ఖచంద్ర సింగ్ కన్నుమూశారు. గ్రేటర్ నోయిడాలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన మరణించారు. దీంతో రింకు సింగ్ హుటాహుటిన స్వస్థలమైన అలీఘర్‌కు చేరుకున్నాడు. కన్నీళ్లను దిగమింగుకుని తండ్రి పాడె మోస్తూ.. సోదరులతో కలిసి అంత్యక్రియలు పూర్తి చేశాడు. అంతటి విషా దంలో ఉండి కూడా రింకు సింగ్ సంచలన నిర్ణయం తీసుకున్న ట్లు తెలుస్తోంది. అతడి నిర్ణయం క్రికెట్ అభిమానులను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. తండ్రి చనిపోవడంతో పుట్టెడు దుఃఖంలోనూ తిరిగి టీమిండియాతో చేరేందుకు అతడు సిద్ధమై నట్లు సమాచారం. ఈ విషయం గురించి రింకు సన్నిహితులు స్థానిక మీడియాతో మాట్లాడుతూ 'తండ్రి అంత్యక్రియలకు రింకు హాజరయ్యాడు. తన నలుగురు అన్నదమ్ములతో కలిసి రింకూ కార్యక్రమం పూర్తి చేశాడు. అతడు తిరిగి జట్టులో చేరుతాడు' అని చెప్పారు. మరోవైపు రింకు సోదరుడు మాట్లాడుతూ 'మా నాన్న అంత్యక్రియల కోసం రింకు ఇక్కడికి వచ్చాడు. ఆ కార్యక్రమం పూర్తైంది. కోల్‌కతాలో జరిగే వెస్టిండీస్ మ్యాచ్ కోసం రింకు తిరిగి జట్టుతో చేరతాడు' అని స్పష్టం చేశాడు. మరోవైపు టీ20 ప్రపంచకప్-2026 సూపర్-8 భాగంగా టీమిండియా ఆదివారం కీలక మ్యాచ్ ఆడనుంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా వెస్టిండీస్ జరిగే ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే.. భారత్ సెమీ ఫైనల్‌కు చేరుకుంటుంది. ఇంతటి కీలక మ్యాచ్‌కు అందుబాటులో ఉండాలని రింకు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు లీగ్ దశలో నాలుగు, సూపర్-8లో సౌతా ఫ్రికాతో మ్యాచ్‌తో కలిపి మొత్తంగా 24 పరుగులు మాత్రమే చేశాడు. ఏది ఏమైనా వెస్టిండీస్‌తో జరిగే కీలక పోరుకు... రింకు అందుబాటులో ఉండటం శుభపరిణామమే.

# 'ఈడెన్'లో పరుగుల పండుగే!

కోల్‌కతా : వరల్డ్ కప్ సూపర్-8 ఆఖరి పోరులో ఆదివారం వెస్టిండీస్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. టీమిండియాకు ఈ మ్యాచ్ నాకౌట్. గెలిస్తే సెమీస్‌కు లేదంటే డిఫెండింగ్ చాంపియన్ ఇంటికే. అయితే ఈ మ్యాచ్‌లో పరుగుల వరద ఖాయమని స్థానిక క్యూరేటర్ సుజన్ ముఖర్జీ సూచనప్రాయంగా వెల్లడించాడు. కారణం..గత నెల తొమ్మిదిన ఈడెన్‌గార్డెన్స్‌లో స్కాట్లాండ్-ఇటలీ మధ్య నిర్వహించిన మ్యాచ్ పిచ్‌పైనే భారత్-వెస్టిండీస్ పోరు జరగడం. ఆ పోటీలో స్కాట్లాండ్ తొలుత 200 పరుగులకుపైగా స్కోరు చేసింది.

ఇక..బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ శుక్రవారం సాయంత్రం ఆ వికెట్‌ను పరిశీలించి చీఫ్ క్యూరేటర్ ఆశిష్ భౌమిక్‌తో కలిసి సుదీర్ఘంగా చర్చించాడు. వికెట్ ఉపరితలం బాగా పొడిగా ఉండనున్న క్రమంలో స్పిన్నర్లు కీలక భూమిక



పోషించే చాన్సుంది. పిచ్‌పై బౌన్స్ కూడా అయ్యే అవకాశాలు లేకపోలేదు. ఇటలీతో ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ పేసర్ ఆర్చర్ వికెట్ నుంచి అందిన బౌన్స్‌ను చక్కగా ఉపయోగించుకున్నాడు. దాంతో టీమిండియా పేస్ దళపతి బుమ్రా, ఎడమ చేతి వాటం బౌలర్ అర్ష్‌దీప్, హార్దిక్ బౌన్స్‌తో లబ్ది పొందే అవకాశాలున్నాయి. అయితే ఈసారి మెగా టోర్నీలో ఈడెన్‌లో భారత్ తొలి మ్యాచ్ ఆడుతోంది. మరోవైపు వెస్టిండీస్ ఇక్కడ రెండు గ్రూపు మ్యాచ్‌లు ఆడి ఉండడం ఆ జట్టుకు సానుకూలాంశం. స్కాట్లాండ్, ఇటలీలతో జరిగిన ఆ రెండు మ్యాచ్‌ల్లో కరీబియన్లు విజయం సాధించారు.



# రెండో వన్డేలోనూ చిత్తుగా..

**- జార్జియా వాల్ సెంచరీ**

**- భారత్‌పై ఆసీస్ ఘన విజయం**

హోబర్ట్ : బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై పరుగులు సులువుగా లభించినా..భారత బ్యాటర్లు చెత్త షాట్లతో వికెట్లు పారేసుకున్నారు. మరోవైపు వికెట్‌ను సద్వినియోగం చేసుకున్న ఆస్ట్రేలియా జట్టులో జార్జియా వాల్ (101) సెంచరీతో కదం తొక్కింది. లిచ్‌ఫీల్డ్ (80) ధనాధన్ బ్యాటింగ్‌తో మెరిసింది. ఫలితంగా రెండో వన్డేలో ఆస్ట్రేలియా మహిళలు ఐదు వికెట్లతో గెలుపొందారు. తొలి మ్యాచ్‌లోనూ ఆతిథ్య జట్టు నెగ్గిన విష యం తెలిసిందే. మొదట భారత్ 50 ఓవర్లలో 251/9 స్కోరు చేసింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ (54), ఓపెనర్ ప్రతికా రావల్ (52) అర్ధ శతకాలతో సత్తా చాటారు. ఛేదనలో వాల్, లిచ్‌ఫీల్డ్‌కు తోడు బెత్ మూనీ (31) రాణించడంతో ఆసీస్ 36.1 ఓవర్లలో 252/5 స్కోరు చేసి నెగ్గింది.

# 'రంజీ' విజేత జమ్మూకశ్మీర్




**- 67 ఏళ్ల సుదర్ఘీ నిరీక్షణకు తెర**

**- స్ఫూర్తిదాయక విజయంతో నయా చరిత్ర**

జమ్ముకశ్మీర్ సరికొత్త చరిత్ర సృష్టించింది. 67 ఏళ్ల సుదర్ఘీ నిరీక్షణకు తెరదించుతూ తొలిసారి రంజీ ట్రోఫీని ముద్దాడింది. కర్ణాటకతో శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్ డ్రాగా ముగియ డంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించిన జమ్ముకశ్మీర్ జయకేతనం ఎగురవేస్తూ.. నయా ఛాంపియన్‌గా అవతరించింది. దీంతో దేశవాళీ క్రికెట్లో తన ప్రస్థానాన్ని ఘనంగా చాటింది జమ్ముకశ్మీర్ టీమ్. 1959-60 సీజన్లో తొలిసారిగా జమ్ముకశ్మీర్ రంజీ ట్రోఫీలో ఆడింది. అప్పటినుంచి టైటిల్ వేట కొనసాగిస్తూనే ఉంది. ఇప్పుడు 67 ఏళ్ల తర్వాత ఆ టీమ్ కల నెరవేరినట్టైంది. ఇవాళ ఫైనల్లో కర్ణాటకపై విజయంతో తొలిసారి రంజీ ట్రోఫీని సగర్వం గా అందుకుంది. భారత క్రికెట్ చరిత్రలో ఇది ఎప్పటికీ గుర్తుండి పోయే రోజు అని పలువురు క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దేశవాళీ ప్రతిష్ఠాత్మక క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీ 2026 ఫైనల్లో జమ్ముకశ్మీర్ అద్భుతమైన ఆటతీరు ప్రదర్శించింది. ఆద్యంతం నిలకడైన ఆట తీరుతో మేటి జట్లను ఓడిస్తూ.. అసాధారణ విజయాలతో తుదిపోరుకు దూసుకెళ్లింది. ఫైనల్లో ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 8 సార్లు రంజీ ట్రోఫీ ఛాంపియన్ అయిన కర్ణాటకను జమ్ముకశ్మీర్ ఓడించింది. పారస్ డోగ్రా కెప్టెన్సీలోని జమ్ముకశ్మీర్ తుదిపోరులో అసలైన ఛాంపియన్‌లా ఆడింది. మ్యాచ్ డ్రాగా ముగిసినా.. కర్ణాటకపై ఫస్ట్ ఇన్నింగ్స్ ఆధిక్యంతో జమ్ముకశ్మీర్ విజేతగా నిలిచింది.

### మ్యాచ్ జరిగిందిలా..

హుబ్బళి వేదికగా జరిగిన ఫైనల్లో తొలుత బ్యాటింగ్ చేసిన జమ్ముకశ్మీర్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 584 పరుగుల భారీ స్కోరు చేసింది. శుభమ్ పుండిర్ 121 రన్స్‌తో అదరగొట్టాడు. యావర్ హాసన్ 88, సాహిల్ లోత్రా 72, కెప్టెన్ పారస్ 70, కన్హయ్య వాధవాన్ 70 కీలక ఇన్నింగ్స్ ఆడారు. కర్ణాటక బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ 5 వికెట్లతో రాణించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక ఫస్ట్ ఇన్నింగ్స్‌లో కేవలం 293 పరుగులకే ఆలౌటైంది. ఆ టీమ్‌లో మయాంక్ అగర్వాల్ 160 పరుగులతో పోరాడాడు. కేఎల్ రాహుల్ 13, దేవ్‌దత్ పడిక్కల్ 11, కరుణ్ నాయర్ 0 దారుణంగా విఫలమయ్యారు. జమ్ముకశ్మీర్ బౌలర్ ఆకిబ్ నబి 5 వికెట్లతో కర్ణాటక పనిపట్టాడు. సునీల్‌కుమార్, యుధ్‌వీర్ చెరో 2 వికెట్లతో సత్తాచాటారు. 291 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆడిన జమ్ముకశ్మీర్ 342/4 వద్ద డిక్లేర్ చేసి.. కర్ణాటక ముందు భారీ లక్ష్యాన్ని ఉంచింది. ఓపెనర్ కమ్రాన్ ఇక్బాల్ 160 సూపర్ ఇన్నింగ్స్ ఆడాడు. సాహిల్ లోత్రా 101 రన్స్‌తో అదరగొట్టాడు. 5వ రోజు కర్ణాటక బ్యాటింగ్ చేసినా ఇంత టార్గెట్ ఛేజ్ చేసే అవకాశం లేకపోవడంతో ఇరు జట్ల కెప్టెన్లు డ్రాకు అంగీకరించారు. దీంతో ఫస్ట్ ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా జమ్ముకశ్మీర్ గెలుపొం దింది. ఈ విజయం పట్ల జమ్ముకశ్మీర్ క్రికెట్ అసోసి యేషన్ అధికారి కిశోర్ కుమార్ మాట్లాడుతూ.. 'మన జట్టు ఎంతో కష్టపడిం ది. ఈ విజయాన్ని సాధించడం మా సాధికారతను, ధైర్యాన్ని చాటి చెబుతోంది. ఈ ఘనత ప్రతి జమ్ముకశ్మీర్ క్రికెట్ అభిమానికి గర్వకా రణం' అని అన్నారు. కొత్త ఛాంపియన్‌గా నిలిచిన జమ్ముకశ్మీర్ జట్టుకు పలువురు సీనియర్ క్రికెటర్లు అభినందనలు తెలిపారు. ఈ విజ యాన్ని 'ప్రతిభ, పట్టుదల, అంకితభావం'గా టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ కొనియాడారు.

### క్రికెట్‌లో కొత్త దిశ

జమ్ముకశ్మీర్ జట్టు.. ఈ విజయం ద్వారా క్రికెట్ ప్రపంచంలో మార్గదర్శకంగా నిలిచింది. క్రికెట్‌నే కెరీర్‌గా ఎంచుకునే ఎందరో యువ ఆటగాళ్లకు ప్రేరణనిచ్చింది. గతంలో ఎన్నో అవరోధాలు ఎదుర్కొన్న ఈ జట్టు.. ఇప్పుడు సిసలైన ఆటతో కొత్త కోణాన్ని సృష్టించింది. కొన్ని దశాబ్దాలుగా రాజకీయ అస్థిరత, ఆర్థిక అడ్డంకుల వంటి అనేక సమస్యలతో తీవ్ర ఒడుదొడుకులు ఎదుర్కొ న్న ఆ జట్టు.. ఇప్పుడు భారత క్రికెట్ చరిత్రలో ఓ కొత్త కోణాన్ని చూపించింది. ఇక.. రంజీ ట్రోఫీకి సంబంధించి ఆ టీమ్ మొదటిసారి ఫైనల్‌కు చేరడం, విజేతగా నిలవడం అనేది జమ్ముకశ్మీర్ క్రికెట్‌లో కొత్త వెలుగును చూపింద నడంలో అతిశయోక్తి లేదు. ఆ జట్టు ఆటగాళ్ల స్ఫూర్తివంతమైన ప్రదర్శన, సహకారం వంటివి భారత క్రికెట్లో మంచి గుర్తింపు సంపాదించడంలో కీలకపాత్ర పోషించాయి.

చైతన్య రథం
సినిమా
ఆదివారం 1 మార్చి 2026

# కలెక్షన్ కింగ్... కొత్త లుక్‌లో



‘ఆర్ఎక్స్ 100, మంగళవారం’ చిత్రాల ఫేమ్ అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం ‘శ్రీనివాస మంగాపురం’. ఈ మూవీతో సూపర్ స్టార్ కృష్ణ మనవడు, దివంగత నటుడు రమేష్‌బాబు కుమారుడు ఘట్టమనేని జయకృష్ణ హీరోగా పరిచయం అవుతున్నాడు. బాలీవుడ్ నటి రాషా తడాని తెలుగులో హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తోంది. అశ్వినీదత్ సమర్పణలో చందమామ కథలు బ్యానర్‌పై పి.కిరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ‘కలెక్షన్ కింగ్’ మంచు మోహన్‌బాబు ఓ కీలక పాత్ర పోషిస్తున్నాడు.


తాజాగా ఆయన లుక్ విడుదల చేశారు మేకర్స్. ఇందులో ఆయన ‘వెంకటప్పయ్యనాయుడు’ అనే పాత్రలో నటిస్తున్నాడు. ఈ పోస్టర్‌లో మోహన్ బాబు సాధారణ తెల్లటి కుర్తా-ధోతీ ధరించి పవర్ ఫుల్గా, గంభీరంగా కనిపిస్తున్నాడు. పోస్టర్‌ని బట్టి చూస్తే.. ఈ సినిమాలో నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో మోహన్‌బాబు నటించినట్టు తెలుస్తోంది. చాలాకాలం తర్వాత మోహన్‌బాబు మళ్లీ ఇలాంటి పాత్రలు చేయడంపట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్న ‘ది ప్యారడైజ్’ లోనూ మోహన్‌బాబు విలన్‌గా నటిస్తున్నాడు.

# వింటారా సరదాగా..



ఈ ఏడాది సంక్రాంతికి ‘అనగనగ ఒక రాజు’ సినిమాతో సక్సెస్ అందుకున్న సితార నిర్మాణ సంస్థ నుంచి ఈ ఏడాదిలో పలు చిత్రాలు రాబోతున్నాయి. వాటిలో ఒకటి ‘వింటారా సరదాగా’. మహేష్ మేనల్లుడు అశోక్ హీరో కాగా శ్రీగౌరీప్రియ హీరోయిన్. పూర్తిగా అమెరికా బ్యాక్‌లో జరిగే లవ్ స్టోరీగా దీన్ని తెరకెక్కించారు. ఇప్పుడు ఈ చిత్రం నుంచి ‘అనగాఅనగా అమెరికా’ అంటూ సాగే ఓ మెలోడీ సాంగ్ రిలీజ్ చేశారు. ఇది వినసొంపుగా ఆకట్టుకుంటోంది. ఉద్భవ్ అనే నటుడు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. అమెరికాలో ఉంటున్న తెలుగు యువతి, యువకుడు ప్రేమలో పడటం... తర్వాత జరిగే పరిస్థితులు నేపథ్యంగా మూవీ తీసినట్టు తెలుస్తోంది. ఈ వేసవిలో థియేటర్లలోకి రానున్నట్లు ప్రకటించారు.

# ‘విరోష్’ పెళ్లి.. ‘రణబాలి’ స్పెషల్ సర్ప్రైజ్





స్టార్ హీరో హీరోయిన్లు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ఇంకా పెళ్లి హడావుడిలోనే ఉండగా... వారిద్దరికీ సంబంధించిన మ్యారేజ్ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది! విజయ్- రష్మిక జంటగా మరోసారి నటిస్తున్న రణబాలి మూవీ టీమ్ ఆ వీడియో పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఆ గ్లింప్స్.. అందరినీ ఆకట్టుకుని ఓ రేంజ్‌లో సందడి చేస్తోంది. అయితే రణబాలి మూవీ టీమ్ విజయ్-రష్మిక రియల్ మ్యారేజ్ వీడియో పోస్ట్ చేసిందనుకుంటే పొరపాటే! తమ సినిమాలోని పెళ్లి పాటకు సంబంధించిన గ్లింప్స్‌ను శనివారం ఉదయం రిలీజ్ చేసింది. అంతే కాదు.. కొత్త జంటకు బెస్ట్ విషెస్ కూడా తెలిపింది. సినిమాలో రణబాలి, జయమ్మగా విజయ్ దేవరకొండ, రష్మిక కనిపించనుండగా.. వాళ్ల లవ్‌ను స్పెషల్ సర్ప్రైజ్ తో సెలబ్రేట్ చేస్తున్నామని రాసుకొచ్చింది.

ఏందయ్యా సామి.. అంటూ సాగే పాటలో మేకర్స్ సినిమాలో విరోష్ వెడ్డింగ్‌కు సంబంధించిన విజువల్స్‌ను చూపించారు. పసుపు దంచడం, పెళ్లి, అత్తవారింట్లో జయమ్మ అడుగుపెట్టడం వంటి మూమెంట్స్‌ను చూపించి మెప్పించారు. ఆ తర్వాత మ్యారేజ్ లైఫ్‌లో కొన్ని సీన్స్‌ను యాడ్ చేశారు. అయితే విజయ్, రష్మిక కెమిస్ట్రీకి ఎవరూ ఫిదా అవ్వకుండా ఉండరేమో! సిల్వర్ స్క్రీన్‌పై మరోసారి తమ కెమిస్ట్రీతో విజయ్, రష్మిక మ్యాజిక్ చేసేటట్టు కనిపిస్తున్నారు. ఇద్దరూ నేచురల్ లుక్‌తో తమ యాక్షన్‌తో ఆకట్టుకుంటున్నారు. చివర్లో ఊయలలో ఇద్దరూ ఉన్న విజువల్స్ అదిరిపోయాయనే చెప్పాలి. అదే సమయంలో సాంగ్‌కు సింగర్స్ శ్వేతా మోహన్, అజయ్ గోగావలె తమ గాత్రంతో ప్రాణం పోశారు. తమ ప్లెజెంట్ వాయిస్‌తో మెప్పించారు.

సరస్వతీ పుత్ర రామజోగయ్య శాస్త్రి అందించిన లిరిక్స్ అద్భుతంగా ఉన్నాయి. అందుకు తగ్గట్లే అజయ్-అతుల్ ద్వయం కంపోజ్ కూడా చేసింది. విజువల్స్ చాలా నేచరుల్‌గా ఉండి ఆకట్టుకున్నాయి. ఓవరాల్‌గా రణబాలి మూవీ టీమ్.. ఏందయ్యా సామి పేరుతో ఇచ్చిన సర్ప్రైజ్.. ఏముందిరా సామి అన్నట్లు ఉందని నెటిజన్లు, సినీ ప్రియులు ఇప్పుడు సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు.

ఇక రణబాలి విషయానికొస్తే.. రాహుల్ సాంకృత్యాన్ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. టాక్సీవాలాతో విజయ్‌కు హిట్ ఇచ్చిన ఆయన.. మరోసారి ఛాన్స్ అందుకున్నారు. ఆర్నాల్డ్ వోస్లో సహా పలువురు కీలక పాత్రలు పోషిస్తున్నారు. టి సిరీస్, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. సెప్టెంబరు 11న విడుదల కానుంది.

# మగధీర... వంద కోట్ల కలెక్షన్




ఒకప్పుడు కోటి రూపాయలు వసూలు చేసిందంటే సినిమా బ్లాక్ బస్టర్ కింద లెక్క. ఆ తర్వాత క్రమేపీ లెక్కలు మారుతూ వచ్చాయి. రూ.2 కోట్లు, రూ.3 కోట్లు, ఇలా గ్రాస్ వసూళు పెరుగుతూ వచ్చాయి. తొలిసారిగా చిరంజీవి నటించిన ఘరానామొగుడు సినిమా రూ.10 కోట్లు సాధించి రికార్డు నెలకొల్పింది. ఆ తర్వాత ఇతర సినిమాలు కూడా 10కోట్లకు చేరుకున్నాయి. అలా నెమ్మదిగా ప్రయాణం చేస్తూ చివరకు రూ.100 కోట్ల గ్రాస్ అందుకునే స్థాయికి ఎదిగాయి. ఈ క్రమంలో మన తెలుగు సినీ పరిశ్రమలో తొలిసారిగా రూ.100 కోట్లు సాధించి చరిత్రలో తనకంటూ ఓ పేజీని లిఖించుకున్న సినిమా ‘మగధీర’. అరుదైన రికార్డు తనపేరు మీద రాసుకుంది. ఈ సినిమాకు దర్శక ధీరుడు రాజమౌళి దర్శకత్వం వహించారు. రామ్‌చరణ్, కాజల్ అగర్వాల్, శ్రీహరి, దేవ్‌గిల్, సూర్య తదితరులు కీలక పాత్రలు పోషించారు. కీరవాణి సంగీతం అందించారు. ఆ రోజుల్లోనే గీతా ఆర్ట్స్ బ్యానరుపై అల్లు అరవింద్ రూ.45కోట్ల భారీ బడ్జెట్‌తో సినిమాను రూపొందించారు. రాజమౌళి సినిమా అంటేనే భారీ బడ్జెట్ ఉంటుందని అర్థం. అందుకు తగినట్లుగానే సినిమా ఇండస్ట్రీ హిట్‌గా నిలవడంతో పాటు తెలుగు సినీ పరిశ్రమలో తొలిసారిగా రూ.100 కోట్లు వసూలు చేసిన సినిమాగా అరుదైన రికార్డును తన పేరుమీద నెలకొల్పింది.

# బాలయ్యతో వివేక్ ఆత్రేయ కాంబో ఫిక్స్!




వరుస విజయాలతో ఫుల్ ఫామ్‌లో ఉన్న సీనియర్ హీరో నందమూరి బాలకృష్ణ, యంగ్ డైరెక్టర్ వివేక్ ఆత్రేయతో సినిమా చేయబోతున్నారనే వార్త టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనున్న ఈ ప్రాజెక్ట్‌కు బాలయ్య ఇప్పటికే కథకు ఓకే చెప్పినట్లు సమాచారం. భారీ స్పాన్ ఉన్న కథ కావడంతో దీనిని ఒక భాగంగా తీయాలా, రెండు భాగాలుగా తీసుకురావాలా అనే అంశంపై చర్చలు కొనసాగుతున్నాయి. విభిన్న కథలకు పేరుగాంచిన వివేక్ ఆత్రేయ ఈసారి బాలయ్యను కొత్త కోణంలో చూపించనున్నారనే అంచనాలు ఉన్నాయి.

వరుస హిట్‌లతో మంచి ఉత్సాహంలో వున్న బాలయ్యకు సంబంధించిన మరో ఇంట్రస్టింగ్ ప్రాజెక్ట్ టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. యువ దర్శకుడు వివేక్ ఆత్రేయతో బాలయ్య సినిమా దాదాపు ఖరారైనట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. విభిన్నమైన కథలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వివేక్ ఆత్రేయ... ఈసారి బాలయ్య మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా, తన స్టైల్‌కు భిన్నంగా ఉండే భారీ కథను సిద్ధం చేసినట్టు సమాచారం. ఈ కథ స్పాన్ చాలా పెద్దదిగా ఉండనుందని తెలుస్తోంది. అందుకే దీనిని ఒక్క భాగంగా తీసుకురావాలా? లేక రెండు భాగాలుగా విభజించాలా? అనే అంశంపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నట్టు టాక్ వినిపిస్తోంది. ఇంకా ఏ నిర్ణయం ఫైనల్ కాలేదని, కానీ ప్రాజెక్ట్ మాత్రం భారీస్థాయిలో ఉండబోతోందని సినీ వర్గాలు చెప్తున్నాయి. వివేక్ ఆత్రేయ ఈసారి తన కెరీర్‌లోనే అత్యంత భారీ కథతో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతున్నాడు అన్నది మాత్రం స్పష్టంగా తెలుస్తోంది.

# సోషల్ మీడియాకి పిల్లల్ని దూరంగా ఉంచండి



ఒకప్పుడు యాంకర్‌గా ఉర్రూతలూగించిన ఉదయభాను ఇప్పుడు సినీ నటిగా అలరిస్తోంది. గతేడాది త్రిబాణధారి బార్బరిక్ చిత్రంలో మెప్పించిన ఈమె ఇప్పుడు ‘డాటరాఫ్ ప్రసాద్‌రావు: కనబడుట లేదు’ వెబ్ సిరీస్లో పోలీస్‌గా కనిపించింది. ఈ సిరీస్ జీ5లో తాజాగా రిలీజైంది. ఈ సిరీస్ ప్రమోషన్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూకి హాజరైన ఉదయభాను ఆసక్తికర విషయాలు వెల్లడించింది.

ఈ జనరేషన్ కిడ్స్ వాళ్ల ప్రపంచంలో వాళు ంటున్నారు. తల్లిదండ్రులు వారి పనుల్లో వారు బిజీ.. పిల్లలు అయితే చదువు లేదంటే ఫోన్‌తో బిజీ అయిపోతున్నారు. కానీ సోషల్ మీడియాకు పిల్లల్ని ఎంత దూరంగా ఉంచితే అంత మంచిది. ఎందుకంటే సోషల్ మీడియా టాక్సిక్.. అక్కడ మంచి కన్నా చెడే ఎక్కువగా ఉంది. ఈ ఫోన్ పిల్లల్ని క్రిమినల్‌గా మార్చేస్తుంది. కాబట్టి ఈ విషయంలో మనం ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి.

నాకు పిల్లలంటే ప్రాణం. వాళ్ల కోసం ఉదయం ఐదు గంటలకే లేచి వంట చేసి పెట్టి షూటింగ్‌కు వెళ్తాను. వారికోసం ప్రత్యేక సమయం కేటాయిస్తాను. ఇకపోతే నేను తొలిసారి మైక్ పట్టింది హృదయాంజలి కోసం! అప్పటికి చిన్న చిన్న సీరియల్స్ చేశాను. కానీ హృదయాంజలి షోతోనే యాంకర్‌గా నా జర్నీ మొదలైంది అని ఉదయభాను చెప్పుకొచ్చింది.